ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 17.09.2026 | సంపుటి :13 సంచిక : 58 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# కేసీఆర్ ఫాంహౌజ్‌పై విచారణకు ఆదేశం

**ఫాంహౌజ్‌లో 388 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది**

**విచారణ పూర్తి చేసి 30రోజుల్లో నివేదిక సమర్పించాలి**

- త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం
- అసెంబ్లీ వేదికగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'ధరణి'తో బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టారాజ్యంగా బదిలీ చేసుకున్నారు
- తెలంగాణ ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారు
- ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు.మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు.700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి మిగతా 2లో..

"భూములను ఎట్లా కొల్లగొట్టాలని కేసీఆర్ ఆలోచన చేశారు. ఈ క్రమంలోనే ఆయన మెదడులో ధరణి అనే పురుగు మొలిచింది. అదే ఈ రోజు భూతమై తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తోంది. ధరణి మెదడును రంగరించి తానే కనిపెట్టాను అని ప్రారంభం రోజు గొప్పగా చెప్పుకున్నాడు. పోర్టల్ పేరిట దోపిడీ జరిగి రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది. మంత్రి పొంగులేటి సృష్టించి న భూతం అందరినీ మింగేస్తుందని ఆయనపై కక్షాపూరిత ఆలోచనతో అబద్ధాలు ప్రచారం చేశారు. ఈ సమ స్యపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలి. సభ్యులు సూచన చేస్తే పేదల ను ఆదుకునేందుకు మంచి నిర్ణయం తీసుకోవచ్చు. ప్రభుత్వ ప్రతిపాదిత అంశాలను పరిశీలించి సలహాలు సూ చనలు ఇవ్వాలి" - సీఎం రేవంత్

"బీఆర్ఎస్ నేతల ప్రతి ధర్నా వెనుక భూదందా, భూదాహం ఉంది. సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు ఉంది. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉంది. జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉంది. నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాలోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి" - సీఎం రేవంత్ రెడ్డి



## తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ

- ఏర్పాటుకు ముందుకొచ్చిన సింగపూర్
- సీఎం రేవంత్‌తో ప్రతినిధుల బృందం భేటి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం తెలిపింది. ఈ మేరకు అసెంబ్లీ ఛాంబర్లో సింగపూర్ ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ నిర్వహించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని మిగతా 2లో..

**భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జీచేత విచారణకు**

# హరీశ్ డిమాండ్

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్: హరీశ్‌రావు**

**ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు**

**అసెంబ్లీ వేదికగా సీఎం మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలేనని ధ్వజం**

బీఆర్ఎస్ హయాంలో ధరణి విషయంలో కావొచ్చు. లేదు కాంగ్రెస్ వచ్చిన డిసెంబర్ 7 2023 నుంచి ఈ రోజు వరకు భూభారతి వరకు నీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..?22ఏ భూములపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే..కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే భయంతోనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. సభలో ప్రతిపక్షం లేకుండా, ప్రజా సమస్యలపై చర్చ లేకుండా తప్పించుకుంటున్నారు.- హరీశ్ రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా... రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు.ఇవాళ చర్చ ద్వారా 22ఏకు ఒక క్లారిటీ వస్తదేమో అని అనుకున్నాం.. కానీ రేవంత్ రెడ్డి యూఎల్‌సీ భూముల మీద న్యూ పాలసీ గైడ్ లైన్స్ ఇస్తా అంటడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. .. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ లే అవుట్లు ఓ వారం రోజుల్లోపు వ్యవస్థ తెస్తం.. జిల్లా స్థాయిలో కమిటీ వేస్తం. జీవో 118 ఎల్‌బీ నగర్ దానిపై పరిశీలిస్తాం. ఆలోచిస్తం.. లీగల్‌గా పరిష్కరిస్తాం. విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతం. ఫీజులు కట్టించుకుంటం.. గైడ్ లైన్స్ ఇస్తం.. హైపవర్ కమిటీ వేస్తం.. ఇవే చెప్పిండు. నీ ఇల్లు మాత్రం తీసుకున్నవ్.. నీ ఇల్లుకు ఏ హైపవర్ కమిటీ లేదు.. లీగల్‌గా ఆలోచించేది లేదు. కమిటీ వేసేది లేదు.. పరిష్కరించేది లేదు. ఇవన్నీ రేవంత్ రెడ్డి చెప్పినవేనన్నారు.ఇయ్యాళ్ల కేటీఆర్ మీద.. నా మీద, మా నాయకుల మీద ఇన్ని మిగతా 2లో..

## ఆ భూములపై నిజాల నిగ్గు తేల్చండి

**ఒక్క గజం భూమి ఎక్కువగా ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తా.. : కవిత**

2లో..

## భూదాన్ భూముల వివరాలు బయటపెట్టండి

**కూనం నేని డిమాండ్**

**కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు**

# దాదాసాహెబ్ ఫాల్కే



**ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రకటించిన కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను 2024కు గాను ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. భారతీయ సినిమాకు అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును ప్రకటించినట్లు కేంద్రం తెలిపింది. ఈనెల 22న గుజరాత్‌లోని కేవడియాలో 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.అనంత్‌నాగ్ కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లిష్ భాషల్లో 300పైగా సినిమాల్లో నటించారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన.. 1973లో కన్నడ చిత్రం 'సంకల్ప' చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత శ్యామ్ బెనెగల్ రూపొందించిన 'మంథన్', 'కొండుర', 'కల్‌యుగ్' తదితర చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించారు. ఆర్‌కే నారాయణ్ కథల ఆధారంగా తెరకెక్కించిన ప్రసిద్ధ టెలీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో ఆయన మిఠాయివాలా పాత్రను పోషించారు. బయలుదారి, కన్నేశ్వర రామ, గోది బణ్ణ సాధారణ మైకట్టు, రాజకుమార, గాలిపట-2, కేజీఎఫ్ వంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. తెలుగులో ప్రేమలేఖలు, అనుగ్రహం, భీష్మ, బాలు, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. వెండితెర మీదే కాదు కర్ణాటక మిగతా 2లో..



# వినాయక నిమజ్జనంలో ఘోరం

**చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి**

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో చోటుచేసుకున్న ఘటన
- మృతులంతా ఓ ఛారిటబుల్ ట్రస్టుకు చెందినవారు..

**సంగారెడ్డి/పటాన్‌చెరు(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధి లోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రా మంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగిం పుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందిం చిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నర సింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్రగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర గ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి మిగతా 2లో..

# భాజపాతో పొత్తు ముచ్చటే లేదు



**దామాషా ప్రకారం ఎంపీ స్థానాలను పెంచితే, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తాం: కేటీఆర్**


**హరియాణా (జనంసాక్షి):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాతో ఎలాంటి పొత్తు ఉండదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో "ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్" అనే అంశంపై కేటీఆర్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భాజపాతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా? అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పందించారు. 'భాజపాతో ఎలాంటి పొత్తు ఉండదు' అని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అంశంపై మాట్లాడుతూ.. లోక్‌సభ స్థానాల సంఖ్యను దేశవ్యాప్తంగా దామాషా ప్రకారం పెంచితే, డీలిమిటేషన్ బిల్లుకు మిగతా 2లో..

**ఝీరాం వ్యాలీ యాక్షన్‌లో పాల్గొన్న పది మంది మావోయిస్టులకు**

# మరణ శిక్ష

**కీలక తీర్పు వెలువరించిన ఎన్ఐఏ కోర్టు**

ఝార్ఖండ్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పదమూడేళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన దాడి కేసులో ఎన్ఐఏ మిగతా 2లో..





# యూపీఐ ఎండీఆర్‌పై వెనక్కి తగ్గేది లేదు

**ఒకసారి నిర్ణయం తీసుకున్నాక పునరాలోచన చేసే అవకాశమే లేదు**

**యూపీఐ ఛార్జీలపై 18 శాతం జీఎస్టీ : కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యూపీఐపై ఛార్జీల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గే ఉద్దేశమేదీ లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక పునరాలోచన చేసే అవకాశమే లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు. యూపీఐని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఎండీఆర్ ఛార్జీల విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఎండీఆర్ ఛార్జీలపై విపక్ష పార్టీలు, ట్రేడర్ల నుంచి వ్యతిరేకత వస్తున్న వేళ ప్రభుత్వం నుంచి ఈ స్పందన వెలువడింది. యూపీఐ లావాదేవీలకు సంబంధించి పెద్ద వ్యాపారులకు ఎండీఆర్‌తో పాటు మరో భారం కూడా పడనుంది. రూ.2,000కు మించి జరిపే యూపీఐ చెల్లింపులపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేటుపై వ్యాపారులు 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే వారు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ను పొందడం ద్వారా మొత్తం పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చని పన్ను నిపుణులు చెబుతున్నారు.వ్యక్తులు రూ.2వేలు పైబడి వ్యాపారులకు చేసే యూపీఐ చెల్లింపులపై అక్టోబర్ 15 నుంచి 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుంది. గరిష్ఠ పరిమితిని రూ.300గా కేంద్రం నిర్ణయించింది. రైల్వే, టెలికాం, బీమా, పెట్రోల్ బంకుల్లో ఫ్లాట్ రేటు రూ.5గా నిర్ణయిం చారు. ప్రతిపాదిత విధానం ప్రకారం చెల్లింపు సేవలు వినియోగించుకున్నందుకు గానూ ఎండీఆర్ భారాన్ని వ్యాపారులే భరించాల్సి మిగతా 2లో..

## ఇది ముమ్మాటికీ యూపీఐ ట్యాక్స్

**రాహుల్ గాంధీ ఆగ్రహం**

**ఈ దేశ వ్యతిరేక నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోసుకోవాలని డిమాండ్**


2లో..

## ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవు

**యూపీఐ ఛార్జీలపై ఆరోపణలను ఖండించిన కేంద్రం**

**యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..**

**కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**



## భారత్ నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

**తీవ్రంగా గర్హించిన భారత్ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అంతర్జాతీయ జలాల్లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో భారత నౌకను పాక్ నౌక ఢీకొట్టింది. దీనిని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీంతో పాక్ దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీచేసింది. గతేడాది పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో మంగళవారం సాయంత్రం భారత నౌకను పాక్ షిప్ ఢీకొట్టింది ఇది నిర్లక్ష్యపూరిత మిగతా 2లో..

**తెలంగాణలో పరిశ్రమలకు**

# అనుకూల వాతావరణం

**డిసెంబర్7,8,9 తేదిలలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్': డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్(జనంసాక్షి):** విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు వినియోగాన్ని సమర్థవంతంగా తగ్గించడం ద్వారా కూడా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవచ్చని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. "మనం ఉత్పత్తి చేసే విద్యుత్ యూ నిట్ కంటే అవసరం లేకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే చౌకైనది" అని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్యాన్ని కేవలం పర్యావరణ పరిరక్షణ అంశంగా కాకుండా ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహంగా చూడాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరిగిన 25వ సిఐఐ- ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్-2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం హాజరై ప్రసంగించారు. ఇప్పటివరకు ఇంధన విధానాన్ని ప్రధానంగా సరఫరా కోణంలోనే చూశామని అన్నారు. "ఎంత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉం ది, ఎంత బొగ్గు అందుబాటులో మిగతా 2లో..

**ఓటుకు నోటు కేసులో**

## దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ

## దానం అనర్హత పై విచారణ వాయిదా

**సౌదీకి హుతీల మరో**

## భారీ షాక్

**అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!**

9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17.09.2026

# భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జీచేత విచారణకు హరీశ్ డిమాండ్

22ఏ భూములపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. "కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే భయంతోనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. సభలో ప్రతిపక్షం లేకుండా, ప్రజా సమస్యలపై చర్చ లేకుండా తప్పించుకుంటున్నారు. 22ఏపై మేం చెప్పింది నిజమని.. ఇవాళ సీఎం ప్రసంగంతో తేలిపోయింది. 3లక్షల ఎకరాల సమస్య.. 30 లక్షల ఎకరాలకు పెరిగిపోయిందని సీఎం అన్నారు. 22ఏ పై గత కొంతకాలంగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం అక్షర సత్యం.. ఇవాళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం శాసనసభ సాక్షిగా తేటతెల్లమైంది. కలెక్టర్లు పాత జాబితా అప్‌లోడ్ చేశారు.. కలెక్టర్లు చూసుకోకుండా 30లక్షల ఎకరాలను 22ఏలో చేర్చారని సీఎం చెబితే.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాత్రం ఒక్క ఎకరం కూడా చేర్చలేదని అన్నారు. 22ఏ నుంచి సీఎం ఇల్లును రాత్రికి రాత్రి ఎలా తీశారో.. ప్రజల భూములు కూడా అలాగే తీయాలి. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారు.. బురదజల్లే ప్రయత్నం చేశారు. 22ఏ తప్పును సరిచేసుకోవాల్సిన పాలకులు విపక్షంపై ఎదురుదాడి చేస్తున్నారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపితే.. మాపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేస్తున్నారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరాం.. దానిపై సమాధానం లేదు. ఎన్నికల అఫిడవిట్‌లో మేం చూపిన ఆస్తులే.. ఇప్పుడు సీఎం చెప్పారు. భూ భారతిలో రూ. 80లక్షల విలువైన చలాన్ల స్కామ్ జరిగింది. ఒక్క జిల్లాలో రూ. 80లక్షల చలాన్ల స్కామ్ జరిగితే .. ఎవరిపైనా చర్యలు లేవు. భూ భారతి ద్వారా ప్రజలకు తెలియకుండానే ప్రజల ఆస్తి.. మరొకరికి బదిలీ అయ్యింది. అసైన్డ్ భూములు పట్టా భూములుగా.. పట్టా భూములు అసైన్డ్ భూములుగా మారాయి. భూభారతి ద్వారా ఇప్పటికే 9,200కు పైగా అక్రమ లావాదేవీలు జరిగాయి" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారిని కోరారు. దీంతో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలించే అంశాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి కూడా సీఎం వారికి సమగ్రంగా వివరించారు.

**మూసీ పునరుజ్జీవంతో నైట్ ఎకానమీకి ప్రోత్సాహం**

సమావేశంలో సింగపూర్ ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్ రెడ్డి మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా మూసీ, ఈసీ నదుల సంగమ స్థలమైన గాంధీ సరోవరం వరకు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నదీతీర అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీ వ్యవస్థను ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని పూర్తిస్థాయి నెట్ జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కూడా వారితో సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

హైదరాబాద్ నగరాన్ని కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్?రెడ్డి సింగపూర్ ప్రతినిధులతో వివరించారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటి, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విద్యాసంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి అంగీకరించాయని వారికి తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సేవలు అందించడం, పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రి కోరగా సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో రాబోయే డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం నిర్వహించనున్న ప్రతిష్టాత్మక తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సింగపూర్ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భాజపాతో పొత్తు ముచ్చటే లేదు

మద్దతు ఇవ్వడానికి బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. "ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. మొత్తం లోక్‌సభ స్థానాలను దామాషా ప్రకారం పెంచితే.. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో మాకు ఎలాంటి సమస్య ఉండదు" అని పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), సాంకేతిక మార్పులపై ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని కేటీఆర్ అన్నారు. "ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించారు.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతోంది. మనం దాన్ని స్వీకరించి ముందుకు సాగాలి" అని అన్నారు. కేటీఆర్ తన ప్రసంగంలో తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించారు. సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలోని కరవు ప్రభావిత ప్రాంతాలకు గోదావరి జలాలను ఎలా తరలించాలనే చారిత్రక సవాలుకు ఇంజినీరింగ్ పరిష్కారం ఈ ప్రాజెక్టు అని అభివర్ణించారు. తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి 2014-15లో సుమారు 44.4 లక్షల టన్నులు ఉంటే.. 2023-24లో అది 168.8 లక్షల టన్నులకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు.

## షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం..

### ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను (ఎస్‌బీఎన్) కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్ 35 కింద కేంద్ర హోంశాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో షహజాద్ భట్టి నెట్‌వర్క్ సంస్థతో పాటు దాని సభ్యులపై ఉగ్రవాద నిధులు (టెర్రర్ ఫైనాన్సింగ్), కుట్ర వంటి తీవ్రమైన అభియోగాల కింద కేసులు నమోదు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు మార్గం సుగమమైంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అందులో భాగంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ సంస్థ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తూ, యువతను, చిన్నచిన్న నేరస్థులను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌తో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, మత సామరస్యానికి ఈ సంస్థ విఘాతం కలిగిస్తోందని హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ మద్దతుతో నడుస్తున్న సిండికేట్‌గా అధికారులు ఎస్‌బీఎన్‌ను అభివర్ణిస్తున్నారు. గ్రెనేడ్లు, ఐఈడీ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రదేశాలపై నిఘా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఈ సంస్థకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని అధినేత షహజాద్ భట్టి దుబాయ్, పాకిస్థాన్‌ల నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటాడు. 2025 మార్చిలో పంజాబ్‌లోని జలంధర్‌లో యూట్యూబర్ రోజర్ సంధు నివాసంపై జరిగిన గ్రెనేడ్ దాడి, 2024 నవంబర్‌లో నటుడు మిథున్ చక్రవర్తికి అందిన బెదిరింపుల వెనుక భట్టి హస్తం ఉన్నట్లు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి కొన్ని వారాల ముందు భద్రతా ఏజెన్సీలు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి ఎస్‌బీఎన్‌తో సంబంధం ఉన్న 253 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, తుపాకులు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులు, పలు కేసుల్లో వెల్లడైన ఆధారాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

# కేసీఆర్ ఫాంహౌజ్‌పై విచారణకు ఆదేశం

యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు."సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు ఉంది. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉంది. జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉంది. నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాలోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి" త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ), మొత్తం భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్-1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు."ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27ఎకరాలుండాలి. కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో కేసీఆర్, శోభిత పేరిట 67.5 ఎకరాలు. కేటీఆర్ పేరు మీద 49.5 ఎకరాలు, శైలిమ పేరిట 17.5ఎకరాలు. కేటీఆర్ పిల్లలు అలేఖ్య పేరిట 9.38, హిమాన్షు పేరిట 46.23 ఎకరాలు. కేటీఆర్ కుటుంబానికి మొత్తం 123.19 ఎకరాలు ఉంది" అని అన్నారు.

**భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారు**

హరీశ్‌రావుకు రంగనాయకసాగర్ పరిధిలో భూమి ఉందని, రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు భూమి కొన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ కోసం ఇరిగేషన్ శాఖ భూసేకరణ చేసిందని, హరీశ్‌రావు కొన్న భూమిని భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారని, రామంచ సర్వే నం.4.20 ఎకరాలకు గాను ఒక ఎకరం తీసుకున్నారని పేర్కొన్నారు. భూసేకరణ రైతలకు ఎకరాకు రూ.6.20 లక్షల చొప్పున చెల్లించిందని, హరీశ్‌రావు మాత్రం రైతుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ.5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు కూడా లేకుండా రోడ్డు వేయించుకున్నారని వెల్లడించారు. ధరణిని అడ్డుపెట్టుకుని హరీశ్‌రావు మామ, సోదరుడు 94 ఎకరాల భూమిని కొల్లగొట్టారని, హరీశ్‌రావు మామ కూడా 93.33 ఎకరాల భూమిని గౌరవ్ పురానా పేరు ఉంటే ఎం.హనుమంతరావు పేరు మీదకు మార్చారని సీఎం ఆరోపించారు. 2022లో రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్ మీదకు మార్చుకున్నారని, రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్‌లో హనుమంతరావు, హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు భాగస్వాములని తెలిపారు.

"బీఆర్ఎస్ నేతల ప్రతి ధర్నా వెనుక భూదందా, భూదాహం ఉంది. బహదూర్‌గూడలో గంగుల, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి భూములు కొన్నారు. బహదూర్‌గూడ సర్వే నం.28, 62లోని అసైన్డ్ భూములు కొనుగోలు చేశారు. బుల్లెట్ ట్రైన్ భూసేకరణ కోసం బహదూర్‌గూడ వెళ్తే ధర్నాలు చేస్తున్నారు. బహదూర్‌గూడ భూముల్లో కాలు పెడితే ధర్నాలు చేస్తామని అంటున్నారు. బహదూర్ గూడలోని ప్రభుత్వ భూములను వదిలిపెట్టమని అన్నారు. సత్యం రామలింగరాజు ఆస్తులను కేటీఆర్ తీసుకున్నారన్న సీఎం హైకోర్టులో వివాదంలో ఉన్న సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని తెలిపారు. జన్వాడలో సర్వే నం.311లో ఇన్‌కంటాక్స్ సీజ్ చేసిన భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని అన్నారు. ఐటీ అటాచ్ చేసిన భూమి శతభిష కంపెనీ నుంచి బదిలీ అయ్యిందని, 2015లోకి ఆచంట మల్లన్న చేతుల మీదుగా కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని, శతభిష ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ అనేది సత్యం రామలింగరాజుకు సంబంధించిందని, 2019లో ధరణి కాంట్రాక్టు కట్టబెడితే జన్వాడ భూములు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు.

**కేసీఆర్ విచారణకు అడుగుతారా?**

జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి , సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారని అన్నారు. కిషన్‌రెడ్డి సొంతూరు తిమ్మాపూర్‌లో 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేటుపరమైందని, దామోదర్‌రావుకు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ బెంజి కారు ఇచ్చారని తెలిపారు. దామోదర్‌రావుకు బెంజికారు ఎందుకు ఇచ్చారో కేసీఆర్ విచారణకు అడుగుతారా? ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ మల్కం కొమురయ్య 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఆరోపించారు.

ధరణి ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టారాజ్యంగా బదిలీ చేసుకున్నారు : సీఎం రేవంత్

ధరణి ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారంగా బదిలీ చేసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు.

**ధరణితో ఇష్టారాజ్యంగా భూముల బదిలీ**

ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు.

"భూములను ఎట్లా కొల్లగొట్టాలని కేసీఆర్ ఆలోచన చేశారు. ఈ క్రమంలోనే ఆయన మెదడులో ధరణి అనే పురుగు మొలిచింది. అదే ఈ రోజు భూతమై తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తోంది. ధరణి మెదడును రంగరించి తానే కనిపెట్టాను అని ప్రారంభం రోజూ గొప్పగా చెప్పుకున్నాడు. అదంతా పచ్చి అబద్ధం"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

మాఫియా చేతుల్లోకి కోట్ల మంది డేటా

2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## ఆ భూములపై నిజాల నిగ్గు తేల్చండి

హైదరాబాద్(జనంసాక్షి):శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదిక గా కవిత స్పందించారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల ఎర్రబెల్లి, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా" అని కవిత తెలిపారు.

## భూదాన్ భూముల వివరాలు బయటపెట్టండి

హైదరాబాద్(జనంసాక్షి):కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు.

## కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

రాజకీయాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. మల్లేశ్వరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించారు. 2025లో అనంత్ నాగ్ కీర్తి కిరీటంలో 'పద్మభూషణ్' చేరింది.

## వినాయక నిమజ్జనంలో ఘోరం

తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఝీరాం వ్యాలీ యాక్షన్‌లో పాల్గొన్న పది మంది మావోయిస్టులకు మరణ శిక్ష

కోర్టు కీలక తీర్పు వెలువరించింది. పది మంది మావోయిస్టులను ఇప్పటికే దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి మరణశిక్ష ఖరారు చేసింది. నాటి ఘటనలో కాంగ్రెస్ కీలక నేతలు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దోషులుగా తేలిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. బస్తర్ జిల్లాలోని ఝీరాం వ్యాలీలో 2013 మే 25న కాంగ్రెస్ నిర్వహించిన పరివర్తన్ ర్యాలీని లక్ష్యంగా చేసుకొన్న మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. ఆ ఘటనలో రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ దిగ్గజ నేతలు సహా 29 మంది మృతి చెందారు. నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, అసెంబ్లీలో మాజీ విపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ తదితరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసు విచారణ సమయంలో దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తాజాగా శిక్ష ఖరారు చేసింది.

## భారత్ నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

ప్రవర్తనగా భారత్ ఖండించింది. "సైనిక విన్యాసాలు, కసరత్తులు , దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి ఇరు దేశాల మధ్య 1991లో ఒప్పందం ఉంది. ఆ ఒప్పందంలోని ఆర్టికల్ 10ని పాక్ నౌక ఉల్లంఘించింది. అనైతిక పద్ధతిలో విన్యాసాలు చేయడమే ఈ పరిస్థితికి దారితీసింది" అని పేర్కొంది. అలాగే దిల్లీలోని పాకిస్థాన్ అత్యున్నతస్థాయి దౌత్యప్రతినిధికి సమన్లు ఇచ్చింది. దౌత్యమార్గాల ద్వారా కేంద్రం ఈ ఘటనను లేవనెత్తింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఇరుదేశాల మధ్య ఒప్పందాల్లోని నిబంధనలు గౌరవించేలా సంబంధిత పాక్ అధికారులకు తెలియజేయాలని సూచించింది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఈ ఘటనను లేవనెత్తాలని ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్తకు వెల్లడించింది.

# యూపీఐ ఎండీఆర్‌పై వెనక్కి తగ్గేది లేదు

ఉంటుంది. దీనికి 18 శాతం జీఎస్టీ కూడా వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల ఏటా రూ.3,500 నుంచి రూ.4వేల కోట్ల ఆదాయం సమకూరనుందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ వెల్లడించారు. అయితే, ఈ రుసుములను భరించే నమోదిత వ్యాపారులు చెల్లించిన జీఎస్టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవడం ద్వారా పన్ను భారం తగ్గించుకోవచ్చని చెప్పారు. లావాదేవీ విలువతో సంబంధం లేకుండా 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటుపై మాత్రమే 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని మరో పన్ను నిపుణుడు శివకుమార్ రమ్జి తెలిపారు. జీఎస్టీ పరిధిలో ఉన్న వారు ఐటీసీ ద్వారా మినహాయింపు ఈ భారం తగ్గించుకోవచ్చని, జీఎస్టీ వెలుపల ఉన్న వ్యాపారులు మాత్రం ఎండీఆర్ ఛార్జీలతో పాటు దానిపై జీఎస్టీ భారమూ భరించాల్సి ఉంటుందని తెలిపారు.

## ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవు

న్యూఢిల్లీ(జనంసాక్షి): యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మర్చంట్ డిస్కౌంట్ రేటును విధించడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవని.. తాము స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే.. అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికే ఈ ఆలోచన చేసినట్లు తెలిపింది .రూ. 2వేల్లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలూ వర్తించబోవని, ఆపైబడిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది. ఈ ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయని, ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం ఈ మార్పు చేసిందని ఆ పార్టీ దుయ్యబట్టింది.

**యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..**

యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, ఛార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

## ఇది యూపీఐ ట్యాక్స్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ ఛార్జీలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు చేశారు. దీనిని 'యూపీఐ ట్యాక్స్'గా అభివర్ణించారు. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. అందులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గురించి ప్రస్తావించారు. "మీరు ఏ పక్షంవైపు మొగ్గుచూపుతారని ఒకసారి ఇందిరాగాంధీకి ప్రశ్న ఎదురైంది. నేను ఎటువైపు మొగ్గుచూపను.. నిటారుగా ఉంటానని ఆమె సూటిగా బదులిచ్చారు. కానీ, మోదీజీ భిన్నమైన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఆయన ఏ పక్షం వైపు వెళ్లకుండా.. ట్రంప్ ముందు తలవంచుతున్నారు. ప్రతి భారతీయుడిపై యూపీఐ ట్యాక్స్ విధించి, ఆ డబ్బును అమెరికాకు ఇస్తున్నారు. మోదీజీ అమెరికా ముందు తలవంచడం ఆపండి. ధైర్యం తెచ్చుకొని నిటారుగా నిల్చోండి. యూపీఐ ట్యాక్స్‌ను వెనక్కి తీసుకోండి" అని రాహుల్ విమర్శించారు. ఇక, నోటాకు మోదీ కొత్త అర్థం చెప్పారని కాంగ్రెస్ విమర్శించింది ఈ దేశ వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, మునుపటిలానే యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేకుండా చూడాలని డిమాండ్ చేసింది.

# తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం

ఉంది, ఎంత పునరుత్పాదక విద్యుత్‌ను జోడించగలం, ఎంత ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు అవసరం వంటి అంశాలపై దృష్టి పెట్టామని" చెప్పారు. అయితే మన ముందే మరో విద్యుత్ కేంద్రం ఉందని, దానికి పొగ గొట్టం, బొగ్గు గని, భూమి, కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ అవసరం లేదని అన్నారు. అదే ఇంధన సామర్థ్యమని వివరించారు. మెరుగైన మోటార్లు, సమర్థవంతమైన శీతలీకరణ వ్యవస్థలు, ఇంధన సామర్థ్య భవనాలు, మెరుగైన పారిశ్రామిక ప్రక్రియలు, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతి మెగావాట్ విద్యుత్ డిమాండ్‌ను శాశ్వతంగా తగ్గించగలిగితే మొత్తం విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు.??వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో భవిష్యత్తులో విద్యుత్ అవసరం మరింత పెరుగుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలు, తయారీ రంగం, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున అభివృద్ధి వేగాన్ని తగ్గించడం పరిష్కారం కాదని, ప్రతి యూనిట్ విద్యుత్‌తో మరింత ఆర్థిక కార్యకలాపాలను సాధించడమే పరిష్కారమని స్పష్టం చేశారు.??పారిశ్రామిక సంస్థలు తక్కువ విద్యుత్ వినియోగిస్తే వాటి నిర్వహణ వ్యయం తగ్గుతుందని అన్నారు. తెలంగాణలో పీక్ విద్యుత్ డిమాండ్ తగ్గితే ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. దేశానికి ఇంధన భద్రత పెరగడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం, ఉద్గారాలు తగ్గుతాయని వివరించారు. ఇంధన సామర్థ్యం వ్యాపార సంస్థల నిర్వహణ వ్యయాలను తగ్గించడంతో పాటు వనరుల ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. గొప్ప ఆవిష్కరణలు ఎప్పుడూ ప్రయోగశాలల్లోనే జరగాల్సిన అవసరం లేదన్నారు. ఒక పరిశ్రమలో విజయవంతమైన సాంకేతికత మరో పరిశ్రమకు ఉపయోగపడుతుందని చెప్పారు. సిమెంట్ పరిశ్రమలో పరిష్కరించిన సమస్య ఉక్కు పరిశ్రమకు ఉపయోగపడవచ్చుని, పేపర్ మిల్లులో అమలు చేసిన ఇంధన సామర్థ్య విధానం ఇతర రంగాలకు ఆదర్శంగా నిలవవచ్చున్నారు. "తదుపరి కొత్త సాంకేతికత ఏమిటి?" అనే ప్రశ్నతో పాటు "ఇప్పటికే ఏది విజయవంతంగా పనిచేస్తోంది? దాన్ని ఎంత వేగంగా విస్తరించగలం?" అనే ప్రశ్న కూడా ఉండాలి అని సూచించారు. భారత్‌లో మంచి పైలట్ ప్రాజెక్టులకు కొరత లేదని, ఒక కర్మాగారంలో విజయవంతమైన ప్రయోగాన్ని వంద కర్మాగారాలకు విస్తరించడమే అసలు సవాలని అన్నారు.

ఏఐతో ఇంధన వినియోగంలో సమర్థత

ఇంధన సామర్థ్యంలో తదుపరి తరం సాంకేతికతలు కీలక పాత్ర పోషించనున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుదీకరణ, డిజిటలైజేషన్, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌తో పాటు కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. సెన్సర్ల ద్వారా ఎక్కడ విద్యుత్ వృథా అవుతుందో గుర్తించవచ్చుని, డిజిటల్ వ్యవస్థలతో పారిశ్రామిక ప్రక్రియలను నిరంతరం మెరుగుపరచవచ్చని చెప్పారు. మానవ ఆపరేటర్లు గుర్తించలేని నమూనాలను కూడా కృత్రిమ మేధస్సు గుర్తించగలదన్నారు. భవిష్యత్తులో కర్మాగారాలు కేవలం విద్యుత్ వినియోగదారులుగా కాకుండా విద్యుత్ వ్యవస్థలో చురుకైన భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన సామర్థ్యం విషయంలో పరిశ్రమలకు మూడు సూచనలు చేశారు. ఇంధన వినియోగాన్ని కొలవకుండా వ్యవస్థాగత మార్పులు చేయడం సాధ్యం కాదని, అందుకే దీనిని ఏడాదికోసారి నిర్వహించే ఆడిట్‌గా కాకుండా నిరంతర పర్యవేక్షణ ప్రక్రియగా మార్చాలని స్పష్టం చేశారు. అలాగే, ఒక పరిశ్రమలో విజయవంతమైన పొదుపు విధానాలను ఇతర వందలాది సంస్థలు నేర్చుకుని అమలు చేసేలా అనుభవాల మార్పిడికి అనువైన వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు.

# కెకె-5 గనిలో ప్రమాదం

- ముగ్గురు కార్మికులకు గాయాలు
- ఏరియా ఆసుపత్రికి తరలింపు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మందమర్రి ఏరియా కేకే-5 గనిలో మరో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులకు గాయాలు కాగా రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ కి అధికారులు తరలించారు. మొదటి షిఫ్ట్ లో 12 లెవల్ లో జనరల్ అసిస్టెంట్లు రామిల్ల తిరుపతి, ఆవునూరి శశికుమార్, కోల్ కట్టర్ ఎ.రాజశేఖర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో 3 సిమ్ 16వ లెవెల్ లో బండ కూలడంతో జరిగిన ఎయిర్ బ్లాస్ట్ కి కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఏరియా జీఎం రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, సంపత్, సిఐటియు నాయకులు సాంబారు వెంకటస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రమాదాన్ని ఉద్దేశించి మాట్లాడారు. యాజమాన్యం రక్షణతో కూడిన ఉత్పత్తిని మరిచి కేవలం బొగ్గు ఉత్పత్తిపై శ్రద్ధ వహించడం వలన ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని మండిపడ్డారు. వరుసగా జరుగుతున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్సను అందజేయాలని కోరారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్



**కుబీర్, సెప్టెంబర్ 16, (జనంసాక్షి):** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కుబీర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 15న సాయంత్రం గణేష్ మండపం సమీపంలో ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్న బాలికను నిందితుడు మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఇతర పిల్లలను బయటకు పంపించి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. బాలిక ఏడుస్తుండటంతో ఇతర పిల్లలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు బాధిత బాలికను వైద్య పరీక్షలకు పంపించి, ఆమె వాంగ్మూలాన్ని చట్టప్రకారం నమోదు చేశారు. బాలిక సంరక్షణ కోసం సఖీ కేంద్రానికి తరలించారు. ఈ నెల 16న విశ్వసనీయ సమాచారం మేరకు భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద నిందితుడు జాధవ్ బిక్కు కుబీర్ మండలంను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నేర సమయంలో ధరించినట్లు పేర్కొన్న దుస్తులను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని భైంసా రూరల్ సర్కిల్ పోలీసులు తెలిపారు.

## తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు

- ఎంపీ వద్దిరాజు




**హైదరాబాద్ (జనం సాక్షి) :** విలీన దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "ఆపరేషన్ పోలో"తో 1948 సెప్టెంబర్ 17న నిజాం రాజ్యం (ఆసఫ్ జాహీల రాజ్యం) భారత యూనియన్ లో విలీనమైన విషయం తెలిసిందే.మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన 14 ఏళ్ల పాటు కొనసాగిన మహోద్యమంతో ఆంధ్ర పెట్టుబడిదారుల వలస పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి "విమోచన" లభించి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో కేసీఆర్ తాను సాధించి పెట్టిన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి అయి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసి దేశం మొత్తం మీద అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

చారిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా కేసీఆర్ సెప్టెంబర్ 17వతేదీని "తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం"గా ప్రకటించి అధికారికంగా పలు కార్యక్రమాలు జరిపించే వారన్నారు.నిజాం పాలన ముగిసి ప్రజలకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం సిద్ధించిన రోజు అయినందున సెప్టెంబర్ 17వతేదీకి విశేష ప్రాధాన్యత ఉన్నదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో స్వేచ్ఛ హరించుకుపోయి, ప్రజాస్వామ్యం అపహాస్యమవుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో పూర్తిగా కుంటు పడిపోయిన అభివృద్ధి తిరిగి పుంజుకో వాలంటే, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగాలంటే, ప్రజలు స్వేచ్ఛా వాయువు పీల్చుకోవాలంటే, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే దార్శనికులు కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావల్సిందేనని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానిం చారు. విలీన దినోత్సవం సందర్భంగా తెలంగాణ వాసులు, దేశంలోని వివిధ ప్రాంతాలు, ప్రపంచం నలుమూలల నివసిస్తున్న, స్థిరపడిన తెలంగాణ బిడ్డలం దరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.


# షాద్‌నగర్ నుండి అసెంబ్లీ వరకు..

- భూదాన్ భూములపై జనంసాక్షి వరుస కథనాలు..
- భూదాన్ భూములకు హెచ్ఎండిఏ అనుమతులు..
- భూధాన్ భూములపై వరుస కథనాలు ప్రచురించిన జనంసాక్షి..
- కోట్ల రూపాయల విలువ చేసే భూములను కాపాడేందుకు యత్నం..
- తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధారాలతో సహా ప్రసంగించిన వైనం..
- అధికారుల తీరుపై అసహనం...







**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** మహాభారతంలో ఓ పదం ఉంటుంది అదే ధర్మంగా వెళ్తే విజయం సాధిస్తావు పది కాలాలపాటు చల్లగా ఉంటావు ,అదే అధర్మంగా వెళ్తే ఏదో ఒక రోజు కింద పడక తప్పదు అప్పుడు ధర్మమే గెలుస్తుంది ఆ ధర్మమే నిన్ను కాపాడుతుంది ఇప్పుడు ఇదే జరిగింది... ధర్మం గెలిచింది అధర్మం ఓడిపోయింది సమాజ ముందు నిజ నిజాలు ఏంటో అసెంబ్లీ సాక్షిగా ఈ రాష్ట్ర ప్రజల ముందుకు తప్పు చేసిన అధికారుల మెదడుకు తలిగేటట్టు ఏకంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పోగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడిన తీరు అధికారుల పనితీరు ఎలా ఉందో అధికారులు ఎలా పని చేశారో బట్టబయలు చేసింది ఇవే నిప్పులాంటి నిజాలు...

రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన బోయినపల్లి రామచంద్రయ్య ఇదే గ్రామానికి చెందిన దళితులకు సర్వేనెంబర్ 191,193లో 25 ఎకరాల 15 గుంటల భూమిని భూదానం ఇచ్చారు ఈ భూమిని కొందరు అధికారులు అమ్యమ్యాలతో హెచ్ఎమ్ డీఏ అనుమతులు ఇచ్చారు ఆ తర్వాత అవి ప్లాట్లుగా మార్చుతున్నారనే విషయం తెలియడంతో రామచంద్రయ్య కుమారులు బోయిన్పల్లి యాదయ్య బోయిన్పల్లి నర్సింలు కోర్టును ఆశ్రయించారు ప్రస్తుతం ఈభూమిలో ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులు క్రయవిక్రయాలు జరిపి అమాయకులను మోసం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..

### జనంసాక్షి వరుస కథనాలు.! అక్రమ కేసులను ఎదుర్కొన్న వైనం.!

షాద్ నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారవేత్తగా చెప్పుకునే వ్యక్తి భూదాన్ భూములతో పాటు సర్కార్ భూములను కూడా చేరబట్టారు ఈ భూదాన్ భూములతో పాటు కోట్ల రూపాయలు విలువ చేసే సర్కారు భూమిని కాపాడేందుకు జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎన్ని బెదిరింపులకు ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన వెనకడుగు వేయకుండా తన కలంతో భూదాన్ సర్కార్ భూమిని కాపాడారు ఇదే క్రమంలో అప్పటి తాహసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి భూ కబ్జాదారులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు..

# బీసీ అస్తిత్వ ఉద్యమానికి భావజాల రహదారి నిర్మించాలి

- బీసీ సాహిత్య ప్రకటనకు సమయం ఆసన్నమైంది
- కవులు, రచయితలు, మేధావులు ఒక్క గొంతుగా నిలవాలి
- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ పిలుపు
- ఖమ్మంలో "వెంటాడే కలాలు" రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం (జనంసాక్షి) :** బీసీల హక్కుల సాధన ఇక కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోకూడదని, అది స్పష్టమైన సామాజిక దృక్పథంగా, సాంస్కృతిక ఉద్యమంగా, సాహిత్య భావజాలంగా రూపుదిద్దుకోవాల్సిన సమయం వచ్చిందని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్, బహుజన ఉద్యమకవి, "వెంటాడే కలాలు– వెనుకబడిన కులాలు" సంపాదకుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. బీసీ కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, మేధావులు ఒక ఉమ్మడి వేదికపైకి వచ్చి "బీసీ లిటరరీ డిక్లరేషన్ – బీసీ సాహిత్య ప్రకటన" రూపొందించాల్సిన చారిత్రక సందర్భం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. "వెంటాడే కలాలు – వెనుకబడిన కులాలు" వెలువడి పాతికేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాతికేళ్ల క్రితం బీసీ జీవితంలోని అవమానం, శ్రమ, వృత్తి, ఆకలి, అస్తిత్వం, ఆత్మగౌరవం సాహిత్యంలో బలమైన గొంతుగా వినిపించాలన్న ఆకాంక్షతో మొదలైన ప్రయాణం ఇప్పుడు మరో చారిత్రక మలుపు వద్ద నిలిచిందన్నారు. ఈ రజతోత్సవం గతాన్ని స్మరించుకునే ఉత్సవం మాత్రమే కాదని, రాబోయే కాలానికి బీసీ సాహిత్యం, సామాజిక ఉద్యమం ఎటువైపు ప్రయాణించాలో నిర్ణయించుకునే ఆలోచనా వేదిక అని వివరించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ ఆవరణలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద "వెంటాడే కలాలు – వెనుకబడిన కులాలు" రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, ఆలోచనాపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బుధవారం పలుచోట్ల కవులు, రచయితలు, విద్యావంతులు, బహుజన ఉద్యమకారులు రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరించినట్లు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. సమాజ జనాభాలో అత్యంత విస్తృతమైన సామాజిక సమూహాల్లో ఒకటైన బీసీల జీవితానుభవాలు, వృత్తి సంస్కృతులు, జ్ఞాన సంపద, ఉత్పత్తి సంబంధాలు సాహిత్యంలో తగినంతగా నమోదు కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ జీవితాన్ని కేవలం వెనుకబాటుతనం కోణంలో మాత్రమే చూడటం సరైంది కాదని, భారతీయ సమాజ నిర్మాణంలో ఉత్పత్తి, సేవలు, వృత్తి నైపుణ్యాలు, స్థానిక జ్ఞానం, కళలు, సంస్కృతికి బీసీ సమూహాలు అందించిన చారిత్రక పాత్రను సాహిత్యం తిరిగి వెలికితీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "మన చేతులు సమాజాన్ని నిర్మించాయి. కానీ మన జీవితాల చరిత్రను చాలా కాలం ఇతరులు రాశారు. ఇక మన చరిత్రను మనమే రాసుకోవాలి. మన అనుభవానికి మనమే భాషను నిర్మించుకోవాలి. మన భాషకు మనమే భావజాలాన్ని అందించాలి" అనే దిశగా బీసీ సాహిత్య ఉద్యమం ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు దక్కాల్సిన సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యం వంటి అంశాలపై సాహిత్య సమాజం మరింత విస్తృతమైన చర్చ చేపట్టాలని జూలూరు అన్నారు. సామాజిక న్యాయం అనేది కేవలం అధికార వ్యవస్థలకు చేసే విజ్ఞప్తిగా మిగిలిపోకూడదని, ప్రజల సాంస్కృతిక చైతన్యంలో భాగంగా మారినప్పుడే అది బలమైన సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఆ చైతన్యాన్ని నిర్మించడంలో సాహిత్యం కీలక పాత్ర పోషించగలదన్నారు. బీసీ ఉద్యమం అనేక సంఘాలు, వేదికలు, వృత్తి సమూహాలు, ప్రాంతాలు, రాజకీయ ఆలోచనలుగా విస్తరించి ఉందని, ఈ వైవిధ్యాన్ని బలహీనతగా కాకుండా సామూహిక శక్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భిన్న దారుల్లో నడుస్తున్న బీసీ ఉద్యమాల మధ్య ఒక ఉమ్మడి సామాజిక న్యాయ దృక్పథాన్ని నిర్మించేందుకు కవులు, రచయితలు, మేధావులు భావజాలపరమైన సంభాషణను ప్రారంభించాలన్నారు. "ఇప్పుడేం చేయాలి?" అనే ప్రశ్నను రజతోత్సవ సభ ప్రధానంగా ముందుకు తీసుకురానుందని తెలిపారు. గత పాతికేళ్లలో బీసీ అస్తిత్వ సాహిత్యం సాధించిన విజయాలేమిటి? ఇంకా నమోదు కాని జీవితాలేవి? కొత్త తరం బీసీ రచయితల ముందున్న సవాళ్లేమిటి? సాహిత్యం నుంచి సామాజిక ఉద్యమానికి, సామాజిక ఉద్యమం నుంచి విధానపరమైన చర్చకు ప్రయాణం ఎలా జరగాలి? వంటి ప్రశ్నలపై సభలో విస్తృతంగా చర్చ జరగనుందని వివరించారు. అస్తిత్వం అంటే కేవలం ఒక కులం పేరు ప్రకటించుకోవడం కాదని, తన చరిత్రను తెలుసుకోవడం, తన శ్రమ విలువను గుర్తించడం, తన సంస్కృతిని గౌరవించడం, తనకు దక్కాల్సిన అవకాశాలు, ప్రాతినిధ్యంపై ప్రశ్నించడం కూడా అస్తిత్వ చైతన్యంలో భాగమేనన్నారు. అందుకే బీసీ సాహిత్యం బాధను నమోదు చేసే దశ నుంచి ప్రశ్నించే దశకు, అక్కడి నుంచి ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథాన్ని ప్రతిపాదించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బీసీ కవులు కేవలం కవిత్వం రాయడం, రచయితలు కథలు రాయడంతో తమ బాధ్యత ముగిసిపోయిందని భావించరాదన్నారు. "వెంటాడిన కలాలు ఇప్పుడు మాట్లాడాలి. మాట్లాడిన గొంతులు కలవాలి. కలిసిన గొంతులు ఒక సామాజిక దృక్పథాన్ని నిర్మించాలి. ఆ దృక్పథమే రేపటి బీసీ ఉద్యమానికి సాంస్కృతిక పునాది కావాలి" అని ఆయన అన్నారు. ఈ నెల 20న జరిగే రజతోత్సవ సభకు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, సామాజిక ఉద్యమకారులు హాజరు కానున్నట్లు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. బీసీ అస్తిత్వ సాహిత్య పాతికేళ్ల ప్రయాణాన్ని సమీక్షించడంతో పాటు కొత్త తరానికి అవసరమైన సాహిత్య, సామాజిక ఎజెండాపై ఈ సభ విస్తృతమైన సంభాషణకు వేదిక కానుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, కాళోజి అవార్డు గ్రహీత సీతారాం, టీఎన్జీవో నాయకుడు రంగరాజు, శంకర్, రమేష్కుమార్ ధరణికోట , ఎం వీ రమణ, సునంద ఉరిమళ్ళ, ములక సురేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచింది కేసీఆరే..

- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



**మెదక్ సెప్టెంబర్ 16( జనం సాక్షి) :** గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గుర్తుచేస్తూ సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలో ప్రతి తండాలో కేసీఆర్‌కు క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గిరిజనుల స్వయం పాలన కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.గిరిజనుల విద్యా, సామాజిక అభివృద్ధి కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారని గుర్తుచేశారు.గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. 10 శాతం రిజర్వేషన్ కారణంగా గిరిజన విద్యార్థులకు విద్యా రంగంలో ప్రయోజనం కలుగుతోందని, వైద్య విద్యలో ఏటా విద్యార్థులకు సీట్లు లభిస్తున్నాయని తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం కేసీఆర్ చేసిన కృషిని గుర్తుచేసుకునేందుకే సెప్టెంబర్ 17న ప్రతి తండాలో క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకే సర్పంచులుగా అవకాశం కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. మెదక్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేసిందని ఆరోపించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. తండాలకు గతంలో కల్పించిన మౌలిక వసతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలోని అన్ని తండాల్లో బిఆర్ఎస్ జెండాలు ఎగురవేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిం చాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్,జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మెదక్ హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం అంజ గౌడ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగా. నరేందర్, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,ప్రభు రెడ్డి,ఆర్కే శ్రీనివాస్,సాప సాయిలు, మార్గం. ఆంజనేయులు, శ్రీహరి, ప్రభాకర్, మంగ్యా,ఫుల్ సింగ్, ధన్ సింగ్,పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుట్టు మిషన్‌కు దరఖాస్తుల గడువు పొడిగింపు

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి
- ఇప్పటివరకు 12,500 దరఖాస్తులు..
- సెప్టెంబరు 30 వరకు అవకాశం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 16 (జనంసాక్షి) :** 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకం కింద అర్హులైన నిరుద్యోగ బీసీ మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 12,500 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. గతంలో సెప్టెంబందు 15గా నిర్ణయించిన గడువును 30వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకానికి అర్హులైన మహిళలు నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అర్హతలు ఇవీ..

దరఖాస్తుదారు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళ అయి ఉండాలి. అత్యంత పేదలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలకు ప్రాధాన్యం ఉంటుంది. తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి. అవి లేని వారు సంబంధిత తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు.

### 18 నుంచి 55 ఏళ్ల మధ్య..

దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. వయస్సు, నివాస ధ్రువీకరణకు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు తదితర పత్రాలు సమర్పించాలి. ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు. కుట్టు వృత్తిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తులు అధికంగా వస్తే కనీసం ఐదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఇవ్వవచ్చని తెలిపారు.

### పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి

ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అర్హులైన మహిళలు ఆన్‌లైన్‌లో ht tps://tgobmms.cRR.gov.in/ ద్వారా 30-09-2026 లోపు దరఖాస్తు చేసుకోని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టి.ఝాన్సీరాణి కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 సెప్టెంబర్ 2026

# రాజకీయాల్లో కరిగిపోతున్న నైతికత

సంపాదకీయం

ఒకప్పుడు రాజకీయాలు ప్రజాసేవకు ఒక వేదిక. సచ్ఛీలురు, నిజాయితీపరులు, త్యాగనిరతి కలిగిన నాయకులు ప్రజల కోసం పనిచేయాలన్న ఆకాంక్షతోనే రాజకీయాల్లోకి వచ్చేవారు. అధికారం వారికి ప్రజాసేవకు ఒక సాధనం మాత్రమే.. అంతిమ లక్ష్యం కాదు. కానీ నేటి రాజకీయ ముఖచిత్రం అందుకు పూర్తి భిన్నంగా మారింది. అధికారం కోసం ఆరాటం, పదవుల కోసం పాకులాట, రాజకీయ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలకు తిలోదకాలు ఇవ్వడం ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఒక పార్టీ తరఫున పోటీ చేసి, ఆ పార్టీ గుర్తుపై ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు కొద్దికాలానికే మరో పార్టీలో చేరిపోవడం నేడు సర్వసాధారణంగా మారుతోంది. అధికార పక్షం బలంగా కనిపిస్తే అటువైపు అడుగులు వేయడం, తమను గెలిపించిన ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకపోవడం రాజకీయ నైతికతకు విరుద్ధమైన పరిణామం. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఉన్నప్పటికీ దాని అమలులోని లోపాలను ఆసరాగా చేసుకుని రాజకీయ మార్పులకు కొత్త కొత్త మార్గాలు వెతకడం మరింత ఆందోళనకరం.

ప్రజలు ఒక వ్యక్తికి మాత్రమే ఓటు వేయరు. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీ, దాని విధానాలు, సిద్ధాంతాలు, ఇచ్చిన హామీలు కూడా ఓటరు నిర్ణయంలో భాగమే. అలాంటి తీర్పుతో గెలిచిన ప్రజాప్రతినిధి తన రాజకీయ వైఖరిని మార్చుకోవాలనుకుంటే కనీసం ప్రజల ముందుకు వెళ్లి తన నిర్ణయాన్ని వివరించాల్సిన నైతిక బాధ్యత ఉంది. అవసరమైతే పదవికి రాజీనామా చేసి తిరిగి ప్రజల తీర్పు కోరడం ప్రజాస్వామ్య సంప్రదాయానికి మరింత గౌరవం.

కానీ నేడు రాజకీయ సమీకరణాలు మారగానే ప్రజల తీర్పును పక్కనపెట్టి పదవులను మాత్రం కాపాడుకోవాలనే ధోరణి పెరుగుతోంది. నిన్నటి వరకు ఒక పార్టీని తీవ్రంగా విమర్శించినవారు.. నేడు అదే పార్టీ కండువా కప్పుకోవడం ప్రజలకు రాజకీయాలపై విరక్తిని కలిగిస్తోంది. సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా సమస్యల కంటే పదవి, అధికారం, వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తే ముఖ్యమవుతున్నప్పుడు ప్రజాస్వామ్యంలో విశ్వసనీయత ఎక్కడ మిగులుతుంది?

ఇక పదవిలోకి వచ్చిన కొద్దికాలానికే రాజకీయ కారణాలతో రాజీనామా చేసి, తిరిగి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసే ధోరణి మరో తీవ్రమైన సమస్య. ఒక ప్రజాప్రతినిధి తన రాజకీయ నిర్ణయాన్ని మార్చుకునే హక్కు ఉండవచ్చు. కానీ ఆ నిర్ణయంతో మరోసారి ఎన్నికను రుద్దే ముందు ప్రజలపై పడే భారం, ప్రభుత్వ ఖజానాపై పడే వ్యయం, ప్రజల తీర్పుకు కలిగే అవమానం గురించి కూడా ఆలోచించాలి. ఉప ఎన్నికల నిర్వహణకు అయ్యే ఖర్చు చివరకు ప్రజలు చెల్లించే పన్నుల నుంచే వస్తుంది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని పదేపదే ఖర్చు చేయించడం ఎంతవరకు సమర్థనీయం అన్న ప్రశ్నకు రాజకీయ వ్యవస్థ సమాధానం చెప్పాలి.

ఎమ్మెల్యేలు రాజీనామా చేసి తిరిగి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసే వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు కూడా ఈ అంశంపై చర్చకు దారితీశాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధుల రాజీనామాలు, ఉప ఎన్నికలు, ఓటర్ల తీర్పు వంటి అంశాల్లో మరింత స్పష్టమైన నిబంధనలు అవసరమా అన్న ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కేవలం చట్టంలోని అక్షరాలతో కాకుండా దాని స్ఫూర్తితో కూడా కాపాడాల్సిన అవసరం ఉంది.

ఇది ఏదో ఒక రాష్ట్రానికో, ఒక పార్టీకో సంబంధించిన సమస్య కాదు. దేశవ్యాప్తంగా రాజకీయ ఫిరాయింపులు, పదవుల కోసం పార్టీ మార్పులు, రాజకీయ ప్రయోజనాల కోసం రాజీనామాలు వంటి పరిణామాలు ప్రజాస్వామ్యంపై చర్చకు కారణమవుతున్నాయి. అధికారంలో ఉన్నవారైనా, ప్రతిపక్షంలో ఉన్నవారైనా ఒకే ప్రమాణాన్ని వర్తింపజేయాలి. తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒక నైతిక ప్రమాణం, ప్రత్యర్థులకు వర్తించినప్పుడు మరో ప్రమాణం అనే ద్వంద్వ వైఖరి ప్రజాస్వామ్యాన్ని మరింత బలహీనపరుస్తుంది

రాజకీయ నాయకులు పార్టీలు మార్చకూడదని చెప్పడం మాత్రమే పరిష్కారం కాదు. పార్టీ మారినప్పుడు ప్రజల ముందుకు వెళ్లి వివరణ ఇచ్చే రాజకీయ సంస్కృతి రావాలి. రాజీనామా చేసినప్పుడు దాని వెనుక ఉన్న కారణాలను స్పష్టంగా చెప్పాలి. ప్రజలు ఇచ్చిన తీర్పును తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే హక్కు ఎవరికీ లేదు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం అధికారాన్ని సంపాదించే ప్రక్రియ కాదు. అవి ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఆ విశ్వాసాన్ని గౌరవించకపోతే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం క్రమంగా తగ్గిపోతుంది. చట్టాలు అవసరం.. సంస్థల పర్యవేక్షణ అవసరం.. కానీ వాటికంటే ముందు రాజకీయ నాయకుల్లో నైతిక బాధ్యత అవసరం.

పార్టీ మారడం రాజకీయ నిర్ణయం కావచ్చు.. కానీ ప్రజల తీర్పును తేలికగా తీసుకోవడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

రాజకీయాలు ప్రజాసేవగా నిలవాలంటే అధికారానికి అడ్డదారులు వెతకడం కాదు.. ప్రజల విశ్వాసానికి జవాబుదారీగా ఉండే రాజకీయ సంస్కృతి రావాలి. లేకపోతే రాజకీయాలు ప్రజాసేవకు వేదికగా కాకుండా అధికార పీఠం కోసం సాగే అవకాశవాద క్రీడగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# యూపీఐ ఉచిత చెల్లింపుల వెనుక ఖర్చెవరిది?

భారతదేశంలోని డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లేదా యూపీఐ ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఒక క్యూఆర్ కోడ్, ఒక ఫోన్, ఒక బ్యాంకు ఖాతా ఉంటే చాలు.. క్షణాల్లో డబ్బు చెల్లించవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము లేకపోవడం యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే అధిక విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ లేదా (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయం యూపీఐ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తోంది.

2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం ఎం.డీ.ఆర్. వర్తించనుంది. దీని అర్థం ఇకపై యూపీఐ వాడిన ప్రతిసారీ వినియోగదారుడు రుసుము చెల్లించాల్సి వస్తుందని కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే ఉంటాయి. అలాగే రూ.2,000 వరకు చేసే వ్యాపార చెల్లింపులపైనా ఈ రుసుము ఉండదు. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా కొన్ని రక్షణలు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీలు ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఎం.డీ.ఆర్. అనేది వినియోగదారుడిపై నేరుగా విధించే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు రూ.10,000కు సంబంధించిన లావాదేవీపై 0.4 శాతం రుసుము అంటే రూ.40. అయితే కొన్ని లావాదేవీలకు గరిష్ఠ పరిమితులు, కొన్ని ముఖ్యమైన రంగాలకు ప్రత్యేక రేట్లు కూడా ఉన్నాయి.

అయితే ఈ నిర్ణయంపై రాజకీయ వివాదం కూడా ఉంది. అమెరికా ఒత్తిడి లేదా అమెరికాకు చెందిన అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాల కారణంగానే ఈ మార్పు తీసుకొచ్చారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేసే విధానంలో పనిచేస్తాయి. దీనికి భిన్నంగా భారతదేశం యూపీఐని దాదాపు శూన్య రుసుముతో అభివృద్ధి చేసింది.

అసలు ఆందోళన మాత్రం చిన్న వ్యాపారులపై పడే ప్రభావం. పెద్ద వ్యాపార సంస్థ ఒక చిన్న రుసుమును భరించగలిగినా, తక్కువ లాభాలతో నడిచే చిన్న దుకాణదారుడికి అది భారంగా మారవచ్చు. వ్యాపారి ఆ ఖర్చును తన లాభంలో నుంచి భరించవచ్చు, లేక పోటీ పరిస్థితులను బట్టి వస్తువులు, సేవల ధరల్లో పరోక్షంగా సర్దుబాటు చేయవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఈ రుసుమును వేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ఆ నిబంధన అమలు ఎలా జరుగుతుందన్నది కీలకం. అందువల్ల యూపీఐపై చర్చను 'ఇక నుంచి చెల్లింపులకు రుసుము' అనే సరళమైన ప్రశ్నకు పరిమితం చేయకూడదు. యూపీఐ విజయానికి కారణమైన సరళత, తక్కువ వ్యయం, ప్రజల నమ్మకం దెబ్బతినకుండా, ఈ భారీ డిజిటల్ మౌలిక వ్యవస్థను దీర్ఘకాలం ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## సెప్టెంబర్ -17 సాయుధ పోరాట గ్రామాలకి
# ముమ్మాటికీ విద్రోహ దినమే

విమోచనమా..?
విలీనమా ...??
విద్రోహమా..??? పాలకులు

1. తెలంగాణ ప్రజలకు ఎవరునుండి, ఎవరికీ "విమోచనం " కల్పించారో చెప్పాలి...?
2. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నుండి విమోచనము కల్పించినట్లు ప్రకటిస్తే, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌ని "రాజ్ ప్రముఖ్"గా ప్రకటించి, 1953 వరకు ఎందుకు కొనసాగించారో చెప్పాలి...??
3. 1946-51 వరకు జరిగిన తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో 1948 సెప్టెంబర్ 17 తర్వాత (నిజాం లొంగి పోయిన తర్వాత)

***దాదాపు 03 సంవత్సరాలు భారత ఆర్మీ తెలంగాణ ప్రాంతంలో (నిజాం రాష్టం) ఎవరి పక్షం వహిస్తూ, తెలంగాణ ప్రాంత ప్రజల ప్రాణాలు పొట్టన పెట్టుకుంది.? ప్రకటించాలి.?? కామ్యూనిస్ట్‌ల ఆధ్వర్యంలో నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్యూ ల అరాచక పాలనా, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కై ప్రజలు పోరాడి, వందలాదిమంది ప్రజలు అమరులు అయి, సాయుధ రైతంగా పోరాటం ద్వారా 3వేల గ్రామాల్లో పేద ప్రజలు పంచుకున్న, 10 లక్షల ఎకరాల భూమిని, సైనిక చర్య (ఆపరేషన్ పోలో) పేరుతో గ్రామాలు వదిలి పారిపోయిన భూస్వాములకు, పోరాటం ద్వారా ప్రజలు సాదించుకున్న భూము లు, తిరిగి కట్టబెట్టి, సాయుధ పోరాట గ్రామాల ప్రజలకు " ద్రోహం " చేసింది.***

స్వతంత్ర రాజ్యం గా, స్వంత కరెన్సీ ఉన్న నిజాం రాష్టాన్ని, భారత దేశ స్వప్రయోజనాకోసం భారత దేశంలో " విలీనం " చేసింది. తెలంగాణ రైతంగా సాయుధ పోరాట గ్రామాలకు సెప్టెంబర్ -17 ముమ్మాటికీ విద్రోహ దినమే.

మూడు వేల గ్రామ రాజ్యలు ఏర్పడ్డాయి. పది లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. పదివేల మంది సాయుధ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులు, పనిముట్లు లేని వ్యవసాయ కూలీలు పేద రైతులకు, భూస్వాముల పశువులను నాగళ్లను ఇతర పనిముట్లు గ్రామ రాజ్యాల ద్వారా పంచి ఇచ్చారు. ఫలితంగా చక్కగా సాగు చేసుకుని పండించేవారు. ఈ ఆదాయం తిండికి సరిపోయేది ఆర్థిక ఇబ్బందులు లేకుండా పోయి సుఖ జీవితం గడిపారు.

పోరాట కాలంలో గ్రామ రాజ్యాల నాయకత్వంలో చెరువులన్నీటిని లెవెల్స్ పెంచారు. చెరువు కట్టలను వెడల్పు చేశారు అలుగు అలుగు పెంచడంతో నీళ్లు ఎక్కువగా నిలువ అయి ఇదివరకు కంటే భూమి ఎక్కువ సాగుయింది.

గ్రామ రాజ్యాల నాయకత్వంలో కొత్తగా నీటితో సాగు చేయడానికి ఎక్కడ ఎంత అవకాశం ఉంటే అంత అవకాశం ఇచ్చారు. పన్నులన్నీ రద్దు చేశారు. చెరువులు కుంటల కిందనే కాక కాలువల కింద కూడా కొత్తగా భూములు సాగు అయినవి.

భూస్వాముల భూములు పంచడమే కాక, ఆ భూములు సాగులోకి వచ్చి పంట పడడానికి వీలుగా కావలసిన సౌకర్యాలు కూడా కల్పించారు. ఒకవైపు రజాకార్లను, పోలీసులను మిలిటరీని ప్రతిఘటిస్తూనే మరొకవైపు రైతులకు కలగజేసిన సౌకర్యాలు ఇవన్నీ.

గ్రామాల్లో అధిక వడ్డీ వ్యాపారాన్ని నిషేధిస్తూ కమ్యూనిస్టు పార్టీని




నిర్ణయం తీసుకుంది. అధిక వడ్డీలను అరికట్టి న్యాయమైన వడ్డీతో ప్రజలకు అప్పులు ఇప్పించుట వలన భూములు పంచుకొని కొత్తగా వ్యవసాయం చేసుకొని వారికి కావలసిన కనీస పెట్టుబడి కోసం అధిక వడ్డీల పేరుతో నాగు పేరుతో జరిగే అధిక దోపిడీని తగ్గిపోయాయి. గ్రామ రాజ్యాలు గ్రామాల్లో దొంగతనాలు లేకుండా చేశాయి. వ్యవసాయ కూలీలు పేద రైతులు అందరూ పార్టీ లో పని చేయడం వలన దొంగతనాలకు అలవాటు పడిన వారెవరో ముందే తెలిసి ఉండేది వారిని గట్టిగా హెచ్చరించి దొంగతనం జరగకుండా చూసేవారు.

ప్రజలు కూడా నిజాయితీ ప్రదర్శించేవారు. ఎవరైనా దారిలో ఒక వస్తువు పోగొట్టుకుంటే, డబ్బులు పోగొట్టుకుంటే ప్రజల్లో ఎవరికైనా దొరికిన వారు దానిని తీసుకువచ్చి గ్రామ రాజ్యానికి అప్పగించేవారు అక్రమ సంపాదన, అవినీతి లేకుండా పోయాయి.

సాయుధ పోరాట కాలంలో స్త్రీలపై దౌర్జన్యాలు అరికట్టారు. వ్యభిచారాన్ని నిషేదించారు. స్త్రీ,పురుష సంబంధాలు ఉన్నత స్థాయికి వచ్చాయి.స్త్రీ లు బహిరంగ సభలలో, పోరాటలలో పాల్గొనేవారు. గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి సాయం చేసేవారు.

కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ గ్రామ రాజ్యాలు దళాలు ఇవన్నీ సాంస్కృతిక రంగంలో చాలా మార్పులు తీసుకోవచ్చాయి. ప్రతిరోజు పనులు పూర్తయిన తర్వాత సంఘం వైపు నుండి రాసిన పాటలు ప్రజలకు నేర్పి పాడించేవారు. కోలాటం, అడుగులు, వారికి తెలిసిన జానపద గీతాలు అన్ని వేసేవారు. వాళ్లకి తెలిసిన బాణిలోనే వారి వారి భాషల్లో రోజు పాడుకునే పాటలను సంఘానికి అనుకూలమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి, విప్లవ పోరాటం అనుకూలంగా పాటలు మార్చి రాసి పాడేవారు.

ప్రజల్లో నిరాశ నిస్పృహలు లేకుండా చేయడానికి ఉపయోగపడేవి.

ఒక ప్రాంతంలో దళం ఏర్పడడంతో ప్రజల జీవితాల్లో కొన్ని మార్పులు వచ్చేవి. దళం ఏర్పడడం అంటే ప్రజల చేతికి ఆయుధాలు వచ్చినట్టు. రజాకార్లు ప్రతిరోజు ఉండేవారు కాదు. దాడులు వచ్చినప్పుడే కనపడేవారు. రోజు భూస్వాములు అతని మనుషులు కనపడేవారు, ఒకసారి చేతికి ఆయుధం వచ్చిందంటే "అధికారం మాదే,భూస్వామి ది కాదు" అనే చైతన్యం ప్రజలకు వచ్చేది. వ్యవసాయ కూలీలు పేద రైతులు బానిసత్వం నుండి విముక్తి అయి గ్రామాల్లో గ్రామ రాజ్యాన్ని నడిపేవవారితో కలిసి పనిచేసే వారు.

పోరాట కాలంలో అభివృద్ధి చెందిన సాహిత్యం కళలు ప్రజలను ఉత్తేజితలు చేయడంలో రూపొందించిన గేయాలు బుర్రకథలు యక్షగానాలు వీధి భగవతాలు ఎక్కువ ఉన్నాయి . "రామబాణం వంటి రైతన్న, రాజ్యంబు నీదిరా కూలన్న" లాంటి ఉత్తేజ కరమైన గేయాలు పాటలు పోరాట కాలంలో బాగా ప్రాచుర్యం లో ఉన్నాయి. బండి యాదగిరి చదువు రాకున్నా జన్నారెడ్డి ప్రతాపరెడ్డికి వ్యతిరేకంగా "బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి... ఓ కొడకా ప్రతాపరెడ్డి" అనే పాట రూపొందించి పాడారు. తర్వాత దాన్ని నిజాం కి వ్యతిరేకంగా పాటగా మార్చారు ప్రజలు వీటిని పాడుకునేవారు

**గెరిల్లా దళాలకు వాటి అనుబంధంగా సంస్కృతిక దళం ఉండేది. పోరాటంలో అమరులైన వారి పేరు మీద కూడా గేయాలు బుర్రకథ లు ఉండే, "సైసై గోపాల్‌రెడ్డి" అనే పాట ఉర్రూతలూగించింది. పోరాట కాలంలో క్రైస్తవ మతానికి చెందిన యువకులు కూడా దళాల్లో చేరి దళ నాయకులుగా ఉండి వీరోచితంగా పోరాడిన ఘటనలు ఉన్నాయి . జాజిరెడ్డిగూడెం ప్రాంతంలో ఒక దళం ఉండేది . మూసి మధ్యభాగంలో ఉంటూ అటు నల్గొండ ఇటు సూర్యాపేట ప్రాంతాలను కమాండ్ చేయగలిగిన ఈ దళనికి నాయకుడు జాన్ ఉండేవారు.**

1946 జూన్ నాటికి దళాలు పార్టీ కార్యకర్తలు నల్గొండ వరంగల్ జిల్లాల నుండి పక్క జిల్లాల్లోకి తమ కార్యకర్తలు విస్తరించాయి. రంగారెడ్డి జిల్లాలో (ఆనాడు దీన్ని ఆతరఫ్ బల్ద అనేవారు తర్వాత హైదరాబాద్ జిల్లా అయింది. ఇప్పుడు రంగారెడ్డి జిల్లా అంటున్నారు) నల్గొండ జిల్లా నుండి విస్తరించి నిర్మాణం మరింత వేగంగా పెంచారు. ఉద్యమం కొత్త గ్రామాలకు విస్తరించింది ఈ విధంగా మహబూబ్నగర్,మెదక్ కరీంనగర్, జిల్లాల ప్రాంతాలకు ఉద్యమం విస్తరించింది.

3000 గ్రామాల్లో 10 లక్షల ఎకరాల భూమి కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో పంపకం జరిగింది. 1947 డిసెంబర్ నాటికి పంచిన భూములను దున్ని రెండవ పంట వేసి పండించారు.

ఒకవైపు దళాలు నిజాం సాయుధబలాలతో పోరాడుతూనే, మరొకవైపు పేదలకు భూములు పంపకం చేసేవారు. దౌర్జన్యపరులైన భూస్వాములు గ్రామాలు విడిచి పట్టణాలకు పారిపోయారు. దీంతో ప్రజలకు తాత్కాలిక విముక్తి కలిగింది. తర్వాత కొన్ని సందర్భలలో పారిపోయిన కొంతమంది భూస్వాములు సైన్యాలను రజాకార్లను పోలీసులు వెంట తీసుకొని వచ్చే బెడద ఉండేది.గ్రామ రాజ్యాల నాయకత్వంలో ప్రజలు తిరుగుబాటు జరిగి మళ్లీ పారిపోయారు. ప్రజలకు స్వేచ్ఛావాయువులు పిల్చుకునే అవకాశం కలిగింది. భూస్వాములు వసూలు చేసే అక్రమ పన్నులు, జొర్మానాలు, లేవి వసూళ్లు లేకుండా పోయాయి.

రైతులు, కొత్తగా భూములు లభించినవారు స్వేచ్ఛగా సేద్యం చేసుకున్నారు. తమ భూమిని సేద్యం చేసుకునే సందర్భంలో భూస్వాముల నుండి ఇబ్బందులు లేకుండా పోయాయి.

భూస్వాములకు మొదటగా వెట్టికి అరకలను పంపి భూస్వాముల భూములను దున్నిన తర్వాతనే తమ భూములను దున్నుకునే పరిస్థితి లేకుండా పోయింది.

చెరువుల నుండి నీళ్లను మొదటిగా భూస్వాముల భూములకే మళ్లించేవారు ఈ పరిస్థితి కూడా లేకుండా పోయింది.

మిగితా తరువాయి రేపటి సంచికలో..



అనంతుల మధు
తెలంగాణ యువజన సంఘము
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9505866698

# కడవెండి సిగన వజ్రం
## పోరాట చరిత్రలో వెలుగొందిన నల్లా వజ్రమ్మ

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పేరు వినగానే మన కళ్లముందు తుపాకులు భుజాన వేసుకున్న యోధులు, అడవిబాటలు, గెరిల్లా దళాలు, రక్తంతో తడిసిన నేల కనిపిస్తాయి. కానీ ఆ చరిత్రకు మరో ముఖం ఉంది. అది గడప దాటిన మహిళల ముఖం. పొయ్యి మంట నుంచి పోరాట జ్వాల దాకా ప్రయాణించిన స్త్రీల ముఖం. తమ కన్నీళ్లను బలహీనతగా కాకుండా, తమ ఆత్మగౌరవాన్ని ఆయుధంగా మలుచుకున్న ధీరవనితల ముఖం. ఆ చరిత్రలో కడవెండి నేలపై మెరిసిన వజ్రం నల్లా వజ్రమ్మ.**

వజ్రమ్మ పేరు ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదు. అది ఒక కాలపు చప్పుడు. ఒక స్త్రీ మేల్కొలుపు. భూస్వామ్య దౌర్జన్యానికి ఎదురు నిలిచిన ఆత్మగౌరవం. కుటుంబ బంధాలను దాటి ప్రజా విముక్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ఒక పోరాట స్ఫూర్తి. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను కేవలం "సహాయకులు" అనే చిన్న గదిలో బంధించడం చరిత్రకు అన్యాయం. వారు సమాచారం మోశారు. ఆహారం అందించారు. ఉద్యమకారులకు ఆశ్రయం కల్పించారు. పోలీసు, రజాకార్ల కదలికలను గమనించారు. అవసరమైనప్పుడు ప్రత్యక్షంగా ఎదిరించారు. జైళ్లను చూశారు. హింసను భరించారు. కుటుంబాలను కోల్పోయారు. కొందరు ఆయుధాలు కూడా చేపట్టారు. ఆ విశాలమైన మహిళా పోరాట చరిత్రలో నల్లా వజ్రమ్మది ప్రత్యేకమైన స్థానం.

### అణచివేతను ప్రశ్నించిన ఆత్మగౌరవం

సాధారణ చేనేత కుటుంబంలో పుట్టిన వజ్రమ్మకు చదువు మూడో తరగతితోనే ఆగిపోయింది. కానీ పాఠశాల చదువు ఆగిపోయిన చోట జీవితం ఆమెకు మరో పాఠశాలను తెరిచింది. పుస్తకాల్లోని అక్షరాల కంటే చుట్టూ కనిపిస్తున్న అన్యాయాన్ని చదవడం ఆమె నేర్చుకుంది. రైతు పొలంలో పండించిన పంటపై మరొకరి హక్కు. కష్టపడిన మనిషి చెమటపై పెత్తందారి అధికారం. ప్రశ్నించినవాడిపై దౌర్జన్యం. ఎదిరించినవాడిపై హింస. విసునూరు దేశముఖ్ రేపాక వెంకట రామచంద్రారెడ్డి, జానమ్మ దొరసాని ఆధిపత్యంలో ప్రజలు అనుభవించిన నిర్బంధ వాతావరణం వజ్రమ్మ వంటి మహిళలలో తిరుగుబాటు భావాన్ని పెంచింది. అణచివేతను చూసి మౌనంగా ఉండటం ఆమెకు చేతకాలేదు. అన్యాయాన్ని అనుభవిస్తూ దానిని విధిగా అంగీకరించడం ఆమె స్వభావం కాదు. భర్త నల్లా నరసింహులతో కలిసి ఆమె కడవెండి పోరాటంలో అడుగుపెట్టింది. అయితే ఆమెను కేవలం "నల్లా నరసింహుల భార్య"గా గుర్తించడం సరిపోదు. నరసింహుల జీవితంలో ఆమె సహచరి కావచ్చు. కానీ ప్రజా పోరాటంలో ఆమెకు తనదైన వ్యక్తిత్వం ఉంది. తనదైన ధైర్యం ఉంది. తనదైన చరిత్ర ఉంది.

### రాళ్లు ఆయుధాలైన వేళ

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో మహిళల సాహసాన్ని ప్రతిబింబించే అనేక ఘట్టాలు ఉన్నాయి. వాటిలో కడవెండి మహిళల సాహసం ఒకటి. కడవెండి నాయకుడు ఎర్రమరెడ్డి మోహన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసినప్పుడు ఆయనను విడిపించేందుకు ముందుకు వచ్చిన మహిళల్లో నల్లా వజ్రమ్మతో పాటు ఎన్నమ్మ, గోపమ్మ, శేరమ్మ, సుశీల వంటి వారు ఉన్నారు. వారి చేతుల్లో తుపాకులు లేవు. సైనిక శిక్షణ లేదు. వెనుక అధికార బలం లేదు. ఉన్నది ఒక్కటే అన్యాయాన్ని సహించని ధైర్యం. రాళ్లను చేతుల్లోకి తీసుకున్నారు. పోలీసు బందోబస్తును ఎదుర్కొన్నారు. తమ నాయకుడిని విడిపించేందుకు ముందుకు దూసుకెళ్లారు. ఆ దృశ్యాన్ని ఒక్కసారి ఊహించుకుంటేనే ఆ కాలపు మహిళా చైతన్యపు తీవ్రత అర్థమవుతుంది. గడపలోనే ఉండాలని సమాజం చెప్పిన స్త్రీ, అదే గడప దాటి అధికారాన్ని ఎదిరించింది. చేతిలో ఆయుధం లేకపోయినా తన సంకల్పమే ఆయుధమైంది. కేవలం ఒక నాయకుడిని విడిపించిన సంఘటన కాదు. "మహిళలు భయపడాలి" అనే పాత సామాజిక నియమానికి ఎదురుగా నిలిచిన ఒక చారిత్రక తిరస్కరణ.

### గడప దాటిన స్త్రీ

తెలంగాణ పోరాటంలో మహిళల పాత్రను అర్థం చేసుకోవాలంటే యుద్ధరంగంలో తుపాకీ పట్టుకున్న చేతిని మాత్రమే చూడకూడదు. దళం అడవిలో ఉన్నప్పుడు ఇంట్లో మిగిలిన ఆ తల్లి చేతిని కూడా చూడాలి. పోలీసులు వెతుకుతున్నప్పుడు ఉద్యమకారుడికి తలుపు తెరిచిన ఆ సోదరి చేతిని చూడాలి. రాత్రి వేళ సమాచారాన్ని మోసుకెళ్లిన ఆ యువతి అడుగులను కూడా చూడాలి. వజ్రమ్మ ఆ విస్తృత మహిళా ప్రపంచానికి ప్రతినిధి. ఆమె జీవితం కుటుంబం, మాతృత్వం, ఉద్యమం అనే మూడు వలయాల మధ్య సాగింది. ఒకదానిని మరొకదాని కోసం త్యజించకుండా, మూడింటి మధ్య పోరాటాన్ని మోసుకెళ్లాల్సి వచ్చింది. ఆమె కథలో తుపాకీ శబ్దం కంటే గుండె చప్పుడు ఎక్కువగా వినిపిస్తుంది.

### జైలు గోడల మధ్య పుట్టిన అరుణ

పోరాట జీవితానికి ధర ఉంటుంది. ఆ ధరను వజ్రమ్మ తన శరీరంతో, తన కుటుంబంతో చెల్లించింది. నల్లా నరసింహులు జైలు నుంచి తప్పించుకోవడంలో వజ్రమ్మకు సంబంధం ఉందన్న ఆరోపణలతో పోలీసులు ఆమెను వేధించారు. చివరకు 1952లో నిండు గర్భిణిగా ఉన్న ఆమెను అరెస్టు చేసి జైలులో నిర్బంధించారు. ఒక స్త్రీ గర్భంలో ఒక కొత్త జీవితం పెరుగుతున్న వేళ, ఆమె చుట్టూ జైలు గోడలు పెరిగాయి. బయట స్వేచ్ఛ కోసం పోరాటం. లోపల మాతృత్వం కోసం నిరీక్షణ. ఆ జైలు గోడల మధ్యే వజ్రమ్మ తన పెద్ద కుమార్తె అరుణకు జన్మనిచ్చింది. ఈ సంఘటనను కేవలం ఒక వ్యక్తిగత విషాదంగా చదవడం సరిపోదు. అది ఒక కాలపు రాజకీయ వాస్తవికతను మన కళ్లముందు నిలబెడుతుంది. ఒకవైపు ప్రసవ వేదనను భరిస్తున్న తల్లి. మరోవైపు ఆమెను నిర్బంధించిన రాజ్య యంత్రాంగం. ఆ గోడల అవతల స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ప్రజలు. జైలు గోడలు శరీరాన్ని బంధించగలవు. కానీ ఆలోచనను కాదు. మాతృత్వాన్ని కాదు. ఆత్మగౌరవాన్ని కాదు. వజ్రమ్మ జీవితం దీనికి సాక్ష్యం.

### స్త్రీ చరిత్రను స్త్రీలే రాయాల్సిన సమయం

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో మహిళల పాత్రపై ఇప్పటికీ మరింత పరిశోధన అవసరం. ప్రసిద్ధి చెందిన కొద్దిమంది పేర్లతోనే ఆ చరిత్రను ముగించలేం. గ్రామాల మట్టిలో కలిసిపోయిన ఎన్నో పేర్లు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. వజ్రమ్మ వంటి మహిళల కథలను వెలికి తీయడం అంటే గతాన్ని మాత్రమే గుర్తు చేసుకోవడం కాదు. చరిత్రను ఎవరు రాశారు? ఎవరి అనుభవాలు నమోదు కాలేదు? ఎవరి త్యాగాలు కుటుంబ జ్ఞాపకాలకే పరిమితమయ్యాయి? అనే ప్రశ్నలను కూడా అడగడం. మహిళల పోరాట చరిత్రను పురుషుల చరిత్రకు అనుబంధంగా కాకుండా, స్వతంత్ర చారిత్రక ప్రవాహంగా చూడాలి. అప్పుడే తెలంగాణ




సాయుధ పోరాటం సంపూర్ణంగా కనిపిస్తుంది.

### నేటి మహిళకు వజ్రమ్మ జ్ఞాపకం

నేటి మహిళకు వజ్రమ్మను కేవలం ఒక వీరగాథగా పరిచయం చేయడం ఆమె జీవితాన్ని చిన్నచూపు చూడటమే. ఆమె జీవితం ఒక ప్రశ్న. అన్యాయం ఎదురైనప్పుడు మనం ఏం చేస్తాం?భయాన్ని చూసి వెనక్కి తగ్గుతామా? లేక ఆత్మగౌరవంతో ముందుకు అడుగు వేస్తామా? వజ్రమ్మ తన కాలంలో ఆ ప్రశ్నకు తన జీవితంతో సమాధానం చెప్పింది. ఆమె చేతిలో పెద్ద ప్రసంగ వేదిక లేదు. అధికార పదవి లేదు. పత్రిక లేదు. ప్రచార సాధనాలు లేవు. కానీ తన జీవితం మొత్తాన్నే ఒక ప్రకటనగా మార్చుకుంది. స్త్రీకి స్వేచ్ఛ కావాలంటే ముందుగా ఆమె భయాన్ని దాటాలి. సమాజం మారాలంటే గడపలు దాటాలి. చరిత్ర మారాలంటే నిశ్శబ్దాన్ని ఛేదించాలి. వజ్రమ్మ అడుగులు ఆ దారినే చూపిస్తాయి.

### కడవెండి సిగనగా...

కడవెండి నేల ఎన్నో పోరాట జ్ఞాపకాలను తనలో దాచుకుంది. ఆ నేలపై నడిచిన వజ్రమ్మ అడుగులు కూడా ఆ జ్ఞాపకాలలో ఒకటి. ఆమెను కేవలం ఒక యోధుడి అర్ధాంగిగా గుర్తుంచుకోవడం ఆమె చరిత్రకు న్యాయం చేయదు. ఆమె స్వయంగా ఒక పోరాట యోధురాలు. ఒక తల్లి. ఒక ఉద్యమ సహచరి. ఒక ధీరవనిత. ముఖ్యంగా, తన కాలపు అన్యాయాన్ని ప్రశ్నించిన ఒక స్త్రీ. చరిత్రలో కొన్ని పేర్లు పుటలపై ఉంటాయి. కొన్ని పేర్లు ప్రజల జ్ఞాపకాల్లో ఉంటాయి. మరికొన్ని పేర్లు నేలలో కలిసిపోయి, ప్రతి తరం అడుగుల్లో మళ్లీ మేల్కొంటాయి. నల్లా వజ్రమ్మ అలాంటి పేరే. కడవెండి మట్టిలో మెరిసిన ఆ వజ్రం మనకు చెబుతున్నది ఒక్కటే.. వజ్రాలు భూమి పొరల్లో పుడతాయి. పోరాట వజ్రాలు మాత్రం ప్రజల కన్నీళ్లలో, ఆత్మగౌరవంలో, తిరుగుబాటులో పుడతాయి.



మామిండ్ల రమేష్ రాజా
7893230218

## కొండముచ్చుల దాడిలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు



**కల్లూరు, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** కల్లూరు పట్టణంలో జాతీయ ప్రధాన రహదారిపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులపై కొండముచ్చులు ఆకస్మికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం జరిగింది. కల్లూరు మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, కుక్కలు స్వైర విహారంతో బెంబేలెత్తిపోతు వాటి దాడులతో గాయాలపాలై ఆసుపత్రులలో చికిత్సలు పొందిన సంఘటనలు ఇటీవల అనేకం చోటు చేసుకున్నాయి. దీనికి తోడు కల్లూరు పరిసర ప్రాంతాల్లో కొండముచ్చులు నడిరోడ్డుపై సంచరిస్తూ రహదారిపై ప్రయాణిస్తున్న బాటసారులు , వాహనదారులు, ఆకస్మికంగా దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకుగురవుతున్నారు. బుధవారం పట్టణంలో ఆకస్మిక జరిగిన కొండముచ్చుల దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గోపాలకుంటకు చెందిన బొల్లం వెంకటేశ్వరరావు, వాచ్య నాయక్ తండాకు చెందిన హరి అనే యువకుడు జాతీయప్రధాన రహదారిపైవెళ్తున్న తరుణంలో వీరిపై వేర్వేరు ప్రదేశాల్లో కొండముచ్చులు ఒక్కసారిగా దాడి చేసి గోళ్లతో గిచ్చి, కొరికి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన బాధితులను స్థానికులు స్పందించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై సైతం కొండముచ్చులు గుంపులుగా చేరుతూ, దారి వెంట వెళ్లే పాదచారులను, వాహనదారులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపైకి, దుకాణాలపైకి వస్తూ తీవ్ర అరాచకం సృష్టిస్తున్నాయని చిరు వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు. కొండముచ్చుల బెడద తీవ్రమవడంతో పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుండి బయటకు రావాలంటనే జంకుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు, స్థానిక మున్సిపాలిటీ పాలకవర్గం అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి, ప్రజలపై దాడులకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్న, కోతులను కొండముచ్చులను పట్టుకుని అడవిలో వదిలేయాలని, కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆదిభట్ల సర్కిల్‌లో అక్రమాల కట్టడాలు

- ప్రత్యేక పైప్‌లైన్‌లతో వాగులోకి ప్రైవేట్ హాస్టళ్ల
- డ్రైనేజీ వ్యర్థాలు
- అనుమతి రెండు అంతస్తులకే..
- అక్రమంగా ఐదు అంతస్తుల నిర్మాణాలు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు

**రంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆదిభట్ల సర్కిల్ ప్రాంతంలో అక్రమాలు తారస్థాయికి చేరాయి. నిబంధనలను గాలికి వదిలేసి సాగిస్తున్న అసాధారణ నిర్మాణాలతో పాటు, పర్యావరణాన్ని హరిస్తున్న కాలుష్య క్రీడ స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇటు ఇరిగేషన్ శాఖ, అటు జీహెచ్ఎంసీ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### పులందరి వాగులోకి డ్రైనేజీ ప్రవాహం..

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మంగల్ పల్లిలో వెలసిన ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలకు పాతరేశారు. హాస్టళ్ల నుంచి వెలువడే మురుగు నీటిని శుద్ధి చేసే ఏర్పాట్లు చేయకుండా, నేరుగా పులందరివాగులోకి వదిలేస్తున్నారు. ఇందుకోసం ఏకంగా ప్రత్యేక పైప్‌లైన్‌లను సైతం ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. దీంతో పవిత్రంగా ఉండాల్సిన వాగు నీరంతా కలుషితమై మురికికూపంగా మారుతోంది. ఈ దుర్వాసనతో చుట్టుపక్కల జనవాసాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రజలు ఈ వాగు నీటిని పలు అవసరాలకు వాడుకుంటున్నారు. మూగ జీవాలను దాహార్తిని తీరుస్తుంది. వాటి ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

### అనుమతి ఒకరిది.. నిర్మాణం మరొకరిది..

ఇక భవన నిర్మాణ రంగంలోనూ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. కేవలం రెండు అంతస్తులకే (జీ౦2) అనుమతులు తీసుకుని, దాన్ని ఏకంగా నాలుగు నుండి ఐదు అంతస్తుల వరకు అక్రమంగా పెంచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భారీ భవనాల నుంచి వెలువడే వ్యర్థాలను, మురుగు నీటిని పద్ధతి ప్రకారం తొలగించకుండా నేరుగా జనవాసాల మధ్యలోకి వదిలేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కన్పించడం లేదన్న విమర్శలున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ప్రజాధనాన్ని, పర్యావరణాన్ని కొల్లగొడుతున్నా ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాల్సిన అధికారులే మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమ హాస్టళ్ల నిర్వాహకులపై, అక్రమ కట్టడాల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా



జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పులందరి వాగును కాపాడాలని, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

### కదిలిన యంత్రాంగం..

అక్రమ కట్టడాలతో పాటు, హాస్టల్ల నుండి వెలువడుతున్న వ్యర్థాలను పులందరివాగులోకి మళ్లిస్తున్న విషయాన్ని "జనంసాక్షి" ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. మండల ఏఈ సునీతను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందులో భాగంగానే తన సిబ్బందితో వెళ్లి ప్రైవేట్ హాస్టల్ల నుంచి వెలబడుతున్న వ్యర్థపు నీరును పులందరివాగుతో కలిపి అందుకోసం ఏర్పాటు చేసిన పైపులు తొలగించారు. అందుకు తీసిన గోతిని పూడ్చి. చట్ట విరుద్ధంగా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందాలి

- దళితుల ఆత్మగౌరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరి పై ఉంది
- అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఆర్వోఆర్ అమలు, బ్యాక్ లాగ్ పోస్టులపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కే.లక్ష్మీ నారాయణలతో కలిసి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరి ఆత్మ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీలలో అధికంగా ఎస్సీలు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని వారికి తప్పని సరిగా ఇన్సూరెన్స్



చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ ఖాళీల వివరాలను సేకరించి వెంటనే పూరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. విదేశీ విద్యను అభ్యసించే వారిని ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలి అన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ... జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం, ఓవర్సీస్ స్కాలర్షిప్, కులాంతర వివాహాల ప్రోత్సాలకు సంబంధించి వివరాలను వెంటనే అందించాలన్నారు. పౌర హక్కుల దినోత్సవాల నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నివేదికల ఆధారంగా నష్టపరిహారాలను అందిస్తున్నామని కరెక్ట్‌గా తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చైర్మన్ కు పూల గుచ్చాలతో స్వాగతం పలికారు. సమావేశ అనంతరం చైర్మన్, కమిషన్ సభ్యులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, అదనపు కలెక్టర్ వెంకటాచారి, డీఆర్వో స్వర్ణలత , జడ్పి సీఈవో సుధీర్, డీఆర్డిఓ శ్రీనివాస్, ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, డివిఎంసి సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, కిరణ్ రోనాల్డ్, మయూర్ వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## ఫోటోలకే పరిమితమైన వన మహోత్సవం

- చుక్కమెట్టు స్కూల్ ఆవరణలో ఎండిపోయిన మొక్కలు
- పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**కొందుర్గు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం క్షేత్రస్థాయిలో కేవలం అధికారుల ఫోటోల ముచ్చటకే పరిమితమవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన చుక్కమెట్టు పాఠశాల ఆవరణలో ఇందుకు సంబంధించిన నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో పాఠశాల ఆవరణలో వన మహోత్సవం పండుగలా నిర్వహించి, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. నాటిన రోజున ఫోటోలకు ఫోజులిచ్చిన అధికారులు, ఆ తర్వాత ఆ మొక్కల సంరక్షణను పూర్తిగా గాలికొదిలేశారు. తెచ్చిన మొక్కలు నాటలేకపోవడంతో పాటు నీరు పోసే నాథుడు లేక, పర్యవేక్షణ కరువై పాఠశాల ఆవరణలోని మొక్కలన్నీ ప్రస్తుతం ఎండిపోయి అస్థిపంజరాల్లా మారాయి. గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను రక్షించాల్సిన బాధ్యత స్థానిక పంచాయతీ యంత్రాంగానిదేనని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ముట్పూర్ పంచాయతీ కార్యదర్శి మాత్రం ఈ విషయంలో ఘోరంగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. మొక్కల సంరక్షణపై కనీస శ్రద్ధ చూపకపోవడం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిధులు కేటాయించినా మొక్కలు ఎండిపోవడంపై ఉన్నతాధికారులు స్పందించి, ఎండిపోయిన చోట తిరిగి కొత్త మొక్కలు నాటించి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని చుక్కమెట్టు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన



డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## నిమజ్జనాన్ని పకడ్బందీగా చేపట్టాలి

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతానికి పెద్ద విగ్రహాలు, వాహనాలు సులభంగా చేరుకునేలా రహదారి చదును చేయడం, అవసరమైన చోట్ల మట్టి, మొరం, రాళ్లను ఉపయోగించి రహదారిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన రహదారిలో ఉన్న చెట్ల కొమ్మలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్లలో జెసిబిలు, క్రేన్లు,రోలర్లు, ఇతర అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల వినియోగానికి సంబంధించి డ్యూటీ



వివరాలు, సంబంధిత సిబ్బంది సంతకాలు, రోజువారీ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బంది మరియు అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలన్నారు. మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమమే నాణ్యమైన విద్యకు పునాది

- మాజీ తెలంగాణా విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థ పై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణా మాజీ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు . ప్రజల నుండి డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యా వ్యవస్థను సరిదిద్దుతుందని భావించలేము , ఆశించడం కూడా పొరపాటు అవుతుందని అన్నారు . బుదవారం ఉదయం ఖమ్మం మయూరి సెంటర్ లోని శ్రీధర హోటల్ లో విద్యాబిమానులు , ఉపాధ్యాయ , విద్యార్థి సంఘాలు , విద్యార్థుల తల్లిదండ్రులు , సామాజిక కార్యకర్త లుతదితర వర్గాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆయన మాట్లాడారు . ప్రస్థుతం తెలంగాణా ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసియులో ఉందని , ప్రజలే డాక్టర్లు గా మారి దానికి చికిత్స చేసి బ్రతికించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిసంవత్సరం 40లక్షలమంది పిల్లల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని అన్నారు . ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ కు చట్టం చేయవలసిన అవసరం ఉందని అన్నారు . ప్రభుత్వ పాఠశాల లను అన్ని సౌకర్యాలు గల తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ గా మార్చితే ప్రైవేటు బడులకు పిల్లలను పంపాల్సిన అఘాయిత్యం ఏముంటుంది అని ప్రశ్నించారు . ప్రభుత్వ పాఠశాల ల్లో ప్రస్తుతం 37శాతం మంది పిల్లలే చదువుతున్నారని అన్నారు . ఇలాగే అసౌకర్యంగా కొనసాగితే మరింత ప్రభుత్వ బడి దిగజారే అవకాశం ఉందని



అన్నారు. జాతీయ స్థాయి యుడైస్ గణాంకాలు ప్రకారం తెలంగాణా లో 2,582 ఒకే గదిలో నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయని , సున్నా విద్యార్థుల నమోదుతో 2,245 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు . మూతపడ్డ పాఠశాలల జాబితా లో మన రాష్ట్రం రెండవ స్థానం లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణాలో ప్రతి పిల్లవాడికి విద్య అందాలంటే బడ్జెట్ లో కనీసం గా 18శాతం నిధులు కెటాయించాలని అన్నారు . ప్రైవేటు పాఠశాల మౌళిక సదుపాయాల ను , భూమి విలువ , భావన విలువ , ఉపాద్యాయులు అర్హతలు , వేతనాలు , విద్యార్థుల కు అందిస్తున్న సౌకర్యాలు దృష్టి లో పెట్టుకొని ప్రైవేటు పాఠశాల నియంత్రణ చట్టం తేవాలని అన్నారు . ప్రజలకు అవసరం అయిన మౌళిక సౌకర్యాలు కలిగించే ప్రభుత్వం రావాలంటే నోటు తీసుకోకుండా ప్రజలు ఓటేసే స్థితి రావాలని అన్నారు . రౌండుటేబుల్ సమావేశం లో బస్సుయాత్ర లో పాల్గొన్న తెలంగాణా ప్రజా ఫ్రంటు కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజాషా , ఐఏయస్ మాజీ అధికారి యం.చంపాలాల్ , పి.అశోక్ కుమార్ , సృజన యాదవ్ , యం.కు పోరన్న , యం.నర్సింహరావు , హరీష్ , రుబీనా , నిఖిల్ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు . రౌండ్ టేబుల్ సమావేశం కు సీనియర్ జర్నలిస్టు , ఎడ్యుకేషన్ ఎనలిస్టు ఎన్.తిర్మల్ మోడరేటర్ గా వ్యవహరించారు రౌండ్ టేబుల్ సమావేశం లో డాక్టర్ యంయఫ్ గోపినాథ్ , భద్రూనాయక్ , పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు కట్టా.శేఖర్ , టిపిటీయఫ్ జిల్లా అధ్యక్షులు జి.మల్లయ్య , యుటీయఫ్ ప్రతినిధి ఉద్దండు , ధర్మసమాజ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ , పిడియస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్ , బలహీన వర్గాల జాక్ కన్వీనర్ పి.రాంబాబు , కనకయ్య , రిటైర్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి టి.వేణు , నాగిరెడ్డి , ప్రజానాట్యమండలి దేవేందర్ , బొబ్బిలి భారత్ చంద్ర , మణిభూషణాచారి , ఖలీల్ , ఝూన్సీ , సునీత , సృజన , విజయకుమార్ , గుంతేటి వీరభద్రం తదితర 30 మంది విద్యారంగం ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు . రౌండుటేబుల్ సమావేశం ప్రభుత్వ బడులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి మండలానికి నాలుగు తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని , ప్రైవేటు పాఠశాల ఫీజులు నియంత్రణ చేయాలని , చట్టబద్ధం గా విద్యకు బడ్జెట్ లో ప్రతిఏటా 18శాతం నిధులు కెటాయించాలని సమావేశం తీర్మానం చేసింది . ఈమూడు అంశాలపై జరిగే ఉద్యమానికి సైతం తనసంపూర్మ మద్దతు రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది.

## చిరుత చర్మం విక్రయానికి యత్నించిన ఆరుగురు అరెస్ట్

- చర్మం, గోళ్లు, పళ్లు, పుర్రె స్వాధీనం.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



**భద్రాచలం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** చిరుతపులిని అక్రమంగా వేటాడి, దాని చర్మం, గోళ్లు, పళ్లు, పుర్రెను విక్రయించేందుకు ప్రయత్నించిన ఆరుగురు వ్యక్తులను భద్రాచలం డివిజన్ అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చిరుతపులి చర్మంతో పాటు కీలకమైన శరీర అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల రేంజ్ పరిధిలోని కుర్నపల్లి గ్రామంలో వన్యప్రాణి నేరానికి పాల్పడుతున్నట్లు సెప్టెంబర్ 15న మధ్యాహ్నం 1.05 గంటల సమయంలో అధికారులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ సిబ్బంది తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చిరుతపులిని అక్రమంగా వేటాడి, దాని శరీర భాగాలను రవాణా చేసి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. అరెస్టయిన వారిలో కుర్నపల్లికి చెందిన కోరం నారాయణ (నర్సయ్య కుమారుడు), కిష్టారంపాడుకు చెందిన పోడియం దేవేందర్ (భీమయ్య కుమారుడు), బెస్తకొత్తూరుకు చెందిన అల్లం సాయి కిరణ్ (సుబ్బయ్య కుమారుడు), గంగోనిగూడెంకు చెందిన జలకర రాధాకృష్ణ (పాపయ్య కుమారుడు), కిష్టారంపాడుకు చెందిన పోడియం సంతోష్ (భీమయ్య కుమారుడు), డిల్లే బండి (గంగ కుమారుడు) ఉన్నారు. వారి నుంచి ఒక చిరుతపులి చర్మం, 9 గోళ్లు, 6 పళ్లు, ఒక చిరుతపులి పుర్రె/తల స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. భారతీయ చిరుతపులి వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం షెడ్యూల్-1లో రక్షిత జంతువుగా ఉందని పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
17 సెప్టెంబర్ 2026

# స్వచ్ఛత కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

- **ప్రతి బ్లాక్ స్పాట్‌ను గుర్తించి జియో ట్యాగింగ్ చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** స్వచ్ఛత కార్యక్రమాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడం, బ్లాక్ స్పాట్‌ల నిర్మూలన, లెగసీ వేస్ట్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాలపై నిర్వహించే సమావేశాలు కేవలం సమీక్షకు పరిమితం కాకుండా, ఏం చేయాలి, ఎవరు చేయాలి, ఎప్పటిలోగా పూర్తి చేయాలి, ఇప్పటివరకు ఎంత పురోగతి సాధించాం అనే అంశాల ఆధారంగా స్పష్టమైన యాక్షన్ పాయింట్లు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వ్యర్థాల సేకరణ నుంచి రవాణా, ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో సరైన విధానాన్ని పాటించాలన్నారు. డంపింగ్ ప్రాంతాలు నీటి వనరులు, సాగునీటి కాలువలకు సమీపంలో లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఉన్న ప్రాంతాలను పరిశీలించి అవసరమైన సరిదిద్దే చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, జియో ట్యాగింగ్ ప్రజలు తరచుగా చెత్త వేస్తున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఒక బ్లాక్ స్పాట్‌ను గుర్తించాలని, మున్సిపాలిటీలలో కనీసం 2--3 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వాటి రూపాంతరానికి చర్యలు చేపట్టాలని సూచించారు. గుర్తించిన ప్రాంతాల బిఫోర్--ఆఫ్టర్ ఫొటోలను తప్పనిసరిగా సేకరించి సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. డంపింగ్ యార్డులను మాత్రమే బ్లాక్ స్పాట్‌లుగా చూపకుండా, ప్రజలు వాస్తవంగా చెత్త వేస్తున్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను దశలవారీగా తొలగించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏజెన్సీల పనితీరును సమీక్షించి, అవసరమైతే సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీ ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ప్రత్యక్షంగా కనిపించే విధంగా స్వచ్ఛత, రూపాంతర కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో సీఎస్ఆర్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు.
గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికతో పాటు రూపొందిస్తున్న మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికలో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలుతీసుకోవాలన్నారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, అర్హతలు, ప్రయోజనాలు, దరఖాస్తు విధానం తదితర వివరాలను సిద్ధంగా ఉంచుకుని గ్రామస్థాయి సమావేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిఆర్డిఓ వెంకట్ రాములు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రామలింగేశ్వర గౌడ్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సిద్ధప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీ పీ ఆర్ వో రషీద్, మున్సిపల్ కమిషనర్లు శంకర్, రాజయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అణచివేతలతో కార్మిక పోరాటాలను ఆపలేరు




**గద్వాల, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** అణచివేతలతో కార్మిక ఉద్యమాలను అడ్డుకోలేరని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్రావు స్పష్టం చేశారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన సామూహిక నిరసన దీక్షల్లో ఆయన పాల్గొన్నారు. హామీల అమలు కోరుతున్న ఆశా, అంగన్వాడీ కార్మికులపై పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించడం సరికాదని ఆయన విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పేర్ నరసింహ, వీవీ నరసింహ తదితరులు పాల్గొన్నారు. కార్మికులందరూ ఒకే తాటిపైకి రావడం వల్ల యాజమాన్యాలు, ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచే బలమైన సామూహిక శక్తి ఏర్పడుతుంది. నిరంతర ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా కార్మికులకు తమ చట్టపరమైన హక్కులు, లబ్ధిపై పూర్తి అవగాహన మరియు చైతన్యం లభిస్తుంది. ఒంటరిగా పోరాడితే సాధించలేని వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత వంటి డిమాండ్లను ఐక్య పోరాటాల ద్వారానే సాధించుకోవచ్చు. కార్మికులలో ఐక్యత ఉన్నప్పుడు ప్రభుత్వాలు లేదా పోలీసులు చేసే అప్రజాస్వామిక నిర్బంధాలను ధీటుగా ఎదుర్కొనే మనోధైర్యం వస్తుంది. నేడు ఐక్యంగా సాగించే ఉద్యమాలే రాబోయే తరాల కార్మికులకు సురక్షితమైన పని వాతావరణాన్ని, హక్కులను అందిస్తాయని అన్నారు.

## ప్రతి ఒక్కరూ మతసామరస్యాన్ని చాటాలి



**మక్తల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఉట్కూరులో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని మక్తల్ సీఐ రామ్ లాల్ సూచించారు. గణేష్ శోభాయాత్రల నేపథ్యంలో మక్తల్ సీఐ రామ్ లాల్, ఉట్కూర్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లిం మత పెద్దలు, ప్రముఖులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ రామ్ లాల్ మాట్లాడుతూ... ఉట్కూరు ప్రాంతంలో అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలి. గణేష్ శోభాయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి పోలీస్ శాఖకు సహకరించాలి. ఉట్కూరులో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే విధంగా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ఉట్కూరు ప్రజలు మతసామరస్యాన్ని చాటుతూ గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

# సమానత్వం సాధికారత కోసం మరో పోరాటం చేయాలి

- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు**
- **సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో బైక్ ర్యాలీ**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** సమానత్వం సాధికారతకోసం మరో పోరాటం చేయాలని, విమోచనం పేరిట చరిత్రను మతోన్మాద శక్తులు వక్రీకరిస్తున్నాయని ఇది సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. బుధవారం సంగారెడ్డిలో తెలంగాణ సాయుధ రహితంగా పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహం నుండి సంగారెడ్డి న్యూ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ బైక్ ర్యాలీలో ముఖ్య అతిథిగా చుక్క రాములు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. సాయుధ పోరాటానికి ఆర్ఎస్ఎస్, బిజెపికి ఏ మాత్రం సంబంధం లేదన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం మతాల మధ్య కొట్లాటగా మార్చేస్తున్నారన్నారు. మతం పేరిట ప్రజలను చీల్చేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనన్నారు. ఈ పోరాటానికి ఏమాత్రం సంబంధంలేని బిజెపి దాని అనుబంధ సంస్థలు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మార్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో మత ఉద్రేకాన్ని సృష్టించి తమ ఎజెండాను అమలు చేసుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజలందరూ మతోన్మాద భావజాలంతో ముందుకు వస్తున్న బిజెపి తప్పుడు ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ ప్రాంతంలో దొరలు, జాగిర్దారులు,పటేల్ పట్వారిలు, ఈ ప్రాంత ప్రజలను దోచుకుతింటూ నాటి నైజాం రజాకారుల మూకలతో కుమ్మక్కయ్యారని నాడు ప్రజలను పట్టిపీడిస్తూ పన్నులను వసూలు చేయడమే కాకుండా వారి చేత వెట్టిచాకిరి చేయించారని దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచి దొరలు, జాగిర్దారులు, పటేల్, పట్వారిలకు, నైజాం రజాకార్ మూకలకు వ్యతిరేకంగా జరిపిన మహోన్నత పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం హిందూ ముస్లిం మతాల తేడా లేకుండా ప్రజలంతా కలిసి పోరాడారని గుర్తు చేశారు. ఆ ఉమ్మడి మతసామరస్య, వారసత్వాన్ని ఇప్పుడు బిజెపి తమ మతోన్మాద రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. ఈరోజు దేశాన్ని ఒక మతరాజ్యంగా మార్చేయాలన్న కుట్ర జరుగుతుందన్నారు. ఇక్కడ పాలకులు ప్రజలకు అనేక రకమైన హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు పేదలకు అందడం లేదన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో మరిన్ని బలమైన పోరాటాలు నిర్వహిస్థమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, ప్రవీణ్ కుమార్, నాగేశ్వర్ రావు, కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, శ్రీధర్, శివ కుమార్, మహేష, బాబు రావు తది తరులు పాల్గొన్నారు.

## కార్మిక ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలి

- **సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్**




**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** కార్మిక వర్గానికి ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కార్మిక వర్గ సమస్యలపై శాంతియుత పోరాటాలు చేస్తున్న కార్మికులపై ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడం చాలా దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ అన్నారు బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం వద్ద ఒక్కరోజు సామూహిక దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11 ,12 తేదీలలో రాష్ట్ర అంగన్వాడీ, ఆశ వర్కర్ల సమస్యపై ఇంద్ర పార్క్ వద్ద ధర్నా తలపెట్టగా అక్కడికి చేరకుండా ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకొని నిర్బంధాలు చేసి అనేక రకాల ఇబ్బందులు పెట్టినారని ఇది చాలా దుర్మార్గమని హక్కులు అడిగితే అరెస్టు చేయడం ఏమిటి రాష్ట్రవ్యాప్త రంగాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిపాలన కొనసాగించి 1000 రోజుల దాటిన ఇప్పటివరకు కార్మిక వర్గంపై ఆలోచించడం లేదని తక్షణమే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఇచ్చిన మాట ప్రకారం 18000 అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు కార్మిక వర్గంపై నిర్బంధం కొనసాగిస్తే పెద్ద ఎత్తున ఉద్యమం ఎగసిపడుతుందని హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెనకాడ పోమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేశం జిల్లా కార్యదర్శి జి సాయిలు జిల్లా కోశాధికారి ఏ మాణిక్యం జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ యాదగిరి విద్యాసాగర్ సేటు నాయకులు మహేష్,అంగన్వాడి జిల్లా కార్యదర్శి మంగ, ఆశా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, వివో ఏ జిల్లా అధ్యక్షులు నాగేష్ ఆంజనేయులు, జిపి జిల్లా అధ్యక్షులు సత్తయ్య, హాస్పిటల్ జిల్లా అధ్యక్షులు సదానందం ట్రాన్స్ పోర్ట్ రంగం జిల్లా అధ్యక్షులు, వెంకటేశం వివిధ రాష్ట్రాత్త రంగాలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# నిమజ్జనానికి బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- **జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**



**మెదక్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఆదేశించారు. కొంటూరు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, చిన్న విగ్రహాలు, భారీ విగ్రహాలతో వచ్చే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల బారికేడింగ్ చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలను అనుమతించకుండా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అంశాన్ని ముందుగానే పర్యవేక్షించాలని, నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, పేర్కొన్నారు. ఎస్పీ వెంట డియస్పి ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజ్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు ,సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదిగ జాతి బిడ్డలు ఉన్నతంగా బతకాలి

- **మాదిగ మహిళ సమక్య జాతీయ అధ్యక్షురాలు తబిత**



**బిజినేపల్లి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** సమాజంలో మాదిగ జాతి బిడ్డలు ఉన్నతంగా బ్రతకాలని మాదిగ మహిళా సమైక్య జాతీయ అధ్యక్షురాలు తబిత అన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంగాలైన మాదిగ మహిళా సమైక్య,మహాజన మహిళా మండలి ఆధ్వర్యంలోఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సదస్సు బుధవారం నాడుమండల కేంద్రంలో ఎం జె ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూపద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటు చేసిన మహాజన సోషలిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క మహిళముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. మహాజన సోషలిస్టు పార్టీ బలోపేతం కోసంతెలంగాణలో8 జిల్లాలలోమహిళలను చైతన్య పరుస్తూ కమిటీలు వేయడం జరిగిందని అందులో భాగంగానే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కమిటీని వేసిమహిళలను శక్తివంతులుగా తీర్చిదిద్దిమహాజన సోషలిస్టు పార్టీ నూతన నిర్మాణం కోసంమంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారన్నారు. మాదిగలు ఏ పార్టీ జెండాలు మోసిన మనలను ఎవరు కూడా ఇంతవరకు పట్టించుకోవడంలేదని అదేవిధంగా మన పార్టీ జెండాను మనమే భుజాల మీద వేసుకొని మోసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 32 సంవత్సరాలు మాదిగ జాతి కొరకు ఎన్నో పోరాటాలు,ఎన్నో ఉద్యమాలు చేసిమన జాతి బిడ్డల భవిష్యత్తు కొరకుఎన్నో మార్లు జైలు జీవితం గడిపిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని గుర్తు చేశారు. అనంతరంరాష్ట్ర మహిళా సమైక్య తెలంగాణ అధ్యక్షురాలు పెద్ద గీత మాట్లాడుతూ. ఆడపిల్లలకు ఎక్కడ అన్యాయం జరిగినా ముందుండే నాయకుడు మందకృష్ణ మాదిగ అని అన్నారు. మన పార్టీ జెండాను మనం మూసుకుని మన పార్టీని అధికారంలోకి తెచ్చుకునే విధంగా ప్రతి ఒక్క మహిళ కూడా నడుం బిగించి ముందుకు నడవాలని ఆమె కోరారు. మంద కృష్ణ మాదిగ తలపెట్టిన అక్టోబర్ రెండు నరెండు తెలుగు రాష్ట్రాలలోమద్యపాన నిషేధం కొరకుకలెక్టరేట్ ముందు నిరసనను ప్రతి ఒక్క మహిళ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మందు త్రాగడం వల్ల ఆర్థికంగాను,ఆరోగ్యకరంగానుకుటుంబాలను నాశనం చేసుకుంటున్నా మన మాదిగ కులస్తుల జీవితాలను కాపాడుకోవడానికి ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ శ్రీకారం చుట్టారన్నారు. అనంతరంరాష్ట్ర మహిళ సమైక్య ఉపాధ్యక్షురాలు జేపీ లతా మాట్లాడుతూఎస్సీ వర్గీకరణ సాధించి పెట్టడం వల్లతరతరాలకు కావలసిన సౌకర్యాలను మాదిగ జాతికి సాధించి పెట్టిన ఘనత మందకృష్ణ కే దక్కింది అన్నారు. మహిళలంటే ఆకాశంలో సగం బాగమని మహిళలు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలకుమహిళ అధ్యక్షురాలుగా ముందుకు రావాల్సిన బాధ్యత వారి పైన ఉందని అన్నారు. 32 సంవత్సరాల క్రితం మాదిగోల్లం అని చెప్పుకోవడానికి భయపడే ఆ రోజుల్లో మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నేడు మేము మాదిగలం అని చెప్పుకున్న స్థాయికి ఈనాడు మన జాతి ఉన్నదని గర్వంగా ఉందని అన్నారు. భూమి పుట్టడానికి ముందు జాంబవంతులం జాంబవంతుల పిల్లల మనం కాబట్టి తలదించుకొని బ్రతకకుండా మనం కూడా మహాజన సోషలిస్టు పార్టీలో నాయకులమై తలెత్తుకుని తిరగాలని ఆమె పిలుపునిచ్చారు. మనం మన హక్కుల కోసం ఆత్మగౌరవం కోసం రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరం ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగార్జున, మద్దిలేటి, దశరథం, గూట విజయ్, విల్సన్, అశోకు, అనిల్ గౌడు, రవి, భాస్కర్, శివ, రాజేష్, శ్రావణ్, సుదర్శన్, బంగారయ్య, ఉత్తరయ్య వివిధ గ్రామాల మహిళలు,ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌ను విజయవంతం చేయాలి



**తెలకపల్లి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి మాకం చంద్రకళ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని యోగ భవన్‌లో మండల అధ్యక్షుడు మంద చిన్నారెడ్డి అధ్యక్షతన సేవా సంకల్ప అభియాన్ మండల కార్యశాలను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన మాకం చంద్రకళ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ 25 సంవత్సరాలకు పైగా నిరంతరాయంగా ప్రజా పదవుల్లో కొనసాగడం భారతదేశ రాజకీయ చరిత్రలో అరుదైన విషయమని పేర్కొన్నారు. ప్రజాసేవ, వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుకుగా పాల్గొని సామాజిక బాధ్యతను చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల కృష్ణ, సుధాకర్ రెడ్డి, కనుక రమేష్, రుక్మయ్య, రాజశేఖర్ పటేల్, శివ, చంద్రయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పరుశరాములు, మండల ప్రధాన కార్యదర్శి ద్యారంగుల రాజు, పదాధికారులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్16 (జనంసాక్షి) :** లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ
- తచైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్, సఖి వన్ స్టాప్ సెంటర్ల సందర్శన



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ వరంగల్ ఆటోనగర్ లోని పరిశీలన గృహం, దేశాయిపేట లోని ఇండియా డిసిపిల్స్ మిషన్ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ మరియు సఖీ వన్ స్టాప్ సెంటర్లను సందర్శించి, రికార్డులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలన గృహం మరియు ఇండియన్ డిసిపిల్స్ మిషన్, (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్)లోని బాలలతో న్యాయమూర్తి ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, భద్రత మరియు ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వారి సమస్యలను సానుభూతితో విని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సఖీ వన్ స్టాప్ సెంటర్ను సందర్శించిన న్యాయమూర్తి, అక్కడ అందిస్తున్న సేవలు, బాధిత మహిళలకు కల్పిస్తున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీస్ సహకారం మరియు పునరావాస సేవలు తదితర అంశాలను పరిశీలించారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, బాధితులకు సకాలంలో అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాలలు మరియు మహిళల హక్కుల పరిరక్షణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు.

## టెక్స్టైల్ పార్క్ కార్మికులు, నర్సింగ్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

- ఆర్టీసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష



**గీసుకొండ, సెప్టెంబర్ 16, (జనం సాక్షి) :** గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో పనిచేస్తున్న ఖైటెక్స్ కంపెనీ కార్మికులు,నర్సంపేట మెడికల్ కాలేజీ నర్సింగ్ విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కార్మికులు,నర్సింగ్ విద్యార్థుల రాకపోకలకు అనుకూలంగా బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఖైటెక్స్ కంపెనీ పని వేళలు, నర్సింగ్ కాలేజీ సమయాలను పరిగణనలోకి తీసుకుని బస్సు రూట్లు,సమయాలను నిర్ణయించాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి.గణేష్,ఆర్టీసీ హనుమకొండ ఆర్ఎం ధరమ్‌సింగ్,వరంగల్ ఆర్ఎం అర్పిత,ఏజీఎం రమేష్,జోనల్ మేనేజర్ స్వామి,నర్సంపేట మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో మాయమైన బంగారు ఆభరణాలు

- ఆర్టీసీ ఎండీకి బాధిత కుటుంబం వినతి



**తొర్రూరు, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లే ఆతృతలో ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన లగేజ్ బ్యాగ్ తిరిగి వచ్చినప్పటికీ అందులోని బంగారు చెవి కమ్మలు, బుట్టాలు కనిపించకుండా పోయాయని ఆరోపిస్తూ బాధిత కుటుంబం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని ఆశ్రయించింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమ బంగారు ఆభరణాలను ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ బాధిత మహిళ శారద కుమారుడు రాగిపల్లి శివప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేశారు. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 28న తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో టీఎస్ 09 జెడ్ 8033 నంబర్ గల ఆర్టీసీ బస్సులో తొర్రూరు బస్టాండ్‌లో దిగిన సమయంలో తమ లగేజ్ బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయారు. అనంతరం డిపో నుంచి ఫోన్ రావడంతో వెళ్లి లగేజ్ బ్యాగ్‌ను తీసుకున్నామని, అయితే బ్యాగ్‌లో ఉంచిన బంగారు చెవి కమ్మలు, బుట్టాలు కనిపించలేదని తెలిపారు. బస్సులో మిగిలిపోయిన లగేజ్ బ్యాగ్‌ను ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా తెరిచారని, అందులోని బంగారు వస్తువులు కనిపించకుండా పోయాయని వారు ఆరోపించారు. ఈ విషయమై తన తల్లి శారద డిపో అధికారులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి తొర్రూరు డిపోలో జరిగిన వాగ్వాదం, అనంతరం తొర్రూరు పోలీస్ అధికారులు చేపట్టిన విచారణ, డిపో మేనేజర్‌కు శాఖాపరమైన చర్యల నిమిత్తం పంపిన నివేదిక తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి శివప్రసాద్ వివరించినట్లు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమ బంగారు ఆభరణాలను తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని ఆర్టీసీ ఎండీని కోరారు.



## వృద్ధురాలి హత్య కేసులో భార్యాభర్తల అరెస్ట్

**దేవరుప్పుల, సెప్టెంబర్ 16 (జనం సాక్షి)** కడవెండి గ్రామంలో వృద్ధ మహిళ ఉపేంద్ర అనుమానాస్పద మృతి కేసులో ఆమె కుమారుడు పెందొట వెంకటేశ్వర్లు, అతని భార్య పెందొట వనిత లను పోలీసులు అరెస్ట్ చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సెప్టెంబర్ 8న ఇద్దరూ ఉపేంద్రపై దాడి చేయడంతో మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహంపై గాయాల గుర్తులు కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోస్టుమార్టం కోసం జనగామకు తరలించారు. అనంతరం నిందితులు కడవెండి సర్పంచ్ బషిపాక రాములును ఆశ్రయించగా, ఆయన ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. పాలకుర్తి సీఐ భరత్ సుమన్ నిందితులను అరెస్ట్ చేసి జనగామ కోర్టులో రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో దేవరుప్పుల ఎస్సై, సృజన్ కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల చర్యలను డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

## ఆకేరు బ్రిడ్జి పనులుమ వెంటనే ప్రారంభించాలి

- లేదంటే మహాధర్నా.. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం
- సత్యవతి రాథోడ్ హెచ్చరిక..



**దోర్నకల్ సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** మండలంలోని ముల్కలపల్లి శివారులో 2024 వరదలకు కొట్టుకుపోయిన ఆకేరు వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ నేత సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. బ్రిడ్జి కొట్టుకుపోయి చాలాకాలం గడుస్తున్నా శాశ్వత నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం–మహబూబాబాద్ జిల్లాల మధ్య కీలకమైన ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు గతంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఆకేరు బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి మహాధర్నా నిర్వహిం చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నంద్యాల మధు. మాజీ వైస్ ఎంపీపీ తుమ్మ వెంకట్ రెడ్డి. పార్టీ . మన్యు పాట్ని. మాజీ సొసైటీ చైర్మన్ కొండపల్లి సీతారాం రెడ్డి. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## టీబీ నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి

**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పరీక్షలు చేయించాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్స అందించడంతో పాటు మందులు క్రమం తప్పకుండా వాడేలా పర్యవేక్షించాలన్నారు. డీఎంహెచ్ఓ డా. రాజేందర్ మాట్లాడుతూ నిక్షయ్ మిత్రల ద్వారా టీబీ రోగులకు పోషకాహారం, సామాజిక సహకారం అందించాలని తెలిపారు. ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించి, అపోహలు, వివక్షను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

- పాఠశాల విద్యార్థుల భారీ ర్యాలీ



**మహాదేవపూర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** ఓజోన్ పోర పరిరక్షణ అదరిబాధ్యత జిల్లా పరిషత్ మహదేవపూర్ ఉభయ పాఠశాల అధ్వర్యంలో ప్రపంచ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు పాఠశాలనుండి ప్రదాన కుడలి వరకు ప్లకార్డ్స్ పట్టుకొని నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిం దని హెచ్ఎం అనిల్ కుమార్ అన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు అనిల్ కుమార్, ఎన్జిసి ఇన్చార్జి టీచర్ ప్రభాకర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓజోన్ పొర పల్చపడడం వల్ల జరుగుతున్న అనర్థాలు వివరించారు. ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత యు వి కిరణాలను గణనీయంగా గ్రహించి భూమిపై జీవరాశులను రక్షిస్తుందని ఓజోన్ పొర తగ్గిపోతే పంటలు అడవులు, జలచర జీవులపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడవచ్చని అన్నారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులు బి రాజిరెడ్డి. సైన్స్ టీచర్ మధు ఫ్రిజ్‌లు ఎయిర్ కండిషనర్లు, ఏరోసోల్ ఉత్పత్తుల నుండి క్లోరోఫ్లోరోకార్బన్ల వంటివి ఓజోన్ పొరకు హాని కలిగిస్తాయని అన్నారు. ఓజోన్ పొరను కాపాడుకుందాం , భూమిని రక్షించుకుందాం ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఉభయ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కవితను కలిసిన రాథోడ్ బాపురావు



**నెరడిగొండ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విదందా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. బుధవారం హైదరా బాద్‌లోనితెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు కవితక్కను ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవి తనకు అప్పగించడం పట్ల పార్టీ నాయకత్వానికి రాథోడ్ బాపురావు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు కొత్తగా కార్యకర్తలను పార్టీలోకి తీసుకురావడం, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజలతో పార్టీ నాయకులు నిరంతరం మమేకం కావాలని,స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి ఉన్న కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడతామని రాథోడ్ బాపురావు తెలిపారు. జిల్లాలో పార్టీ నాయకత్వం సూచనలు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతానని,జిల్లా రాజకీయ పరిస్థితులు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

- ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ శ్రీకాంత్
- ఓజోన్ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం




**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ డిసి వరంగల్ ఈస్ట్‌లో ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో ఐ క్యు ఎ సి, ఎన్ఎస్ఎస్ ల సహకారంతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి , జోనల్ ల్యాబొరేటరీ, వరంగల్కు చెందిన అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ ఎ. శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర ప్రాముఖ్యత, ఓజోన్ క్షీణత, గ్రీన్‌హౌస్ ప్రభావం, వాతావరణ మార్పులు, ప్లాస్టిక్ కాలుష్యం వంటి అంశాలపై శ్రీకాంత్ వివరించారు. పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

అనంతరం విద్యార్థులకు పర్యావరణ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఓజోన్ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, గ్రీన్‌హౌస్ వాయువులు, ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన పెరిగింది. పర్యావరణహిత జీవన విధానాన్ని పాటిస్తూ స్వచ్ఛమైన, సుస్థిరమైన భవిష్యత్తు కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

## నిమజ్జన ప్రదేశాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16(జనంసాక్షి ):** వినాయక నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల పెద్దవాగు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ప్రదేశాన్ని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్మచౌదరి, డి.ఎస్.పి. వహీదుద్దీన్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశం వద్ద ఎలాంటి అపసృతులు జరగకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు రహదారి మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో గల మట్టిని చదును చేయాలని, వినాయక విగ్రహాల సంఖ్యను బట్టి అదనంగా క్రేన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో సిబ్బందిని నియమించాలని, రహదారి, నిమర్జన ప్రాంతంలో వెలుతురు ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 17న ప్రజాపాలన దినోత్సవం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రజా పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 17 సెప్టెంబర్ 2026







# నాచారం ఈఎస్ఐ కార్మికులకు జీతాల కష్టాలు

**మూడు, నాలుగు నెలలుగా వేతనాలు అందక అవస్థలు**

- ఔట్‌సోర్సింగ్ నుంచి లేబర్ యాక్టివిటీకి మార్చారని ఆవేదన
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని వెల్లడి
- సుమారు 200 మంది కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్



**నాచారం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
*నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతూ, రోగులకు సేవలందిస్తున్న తమకు మూడు, నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 200 మంది కార్మికులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.*

2011లో ఔట్‌సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ, పారిశుద్ధ్య తదితర పనులకు తమను నియమించారని కార్మికులు పేర్కొన్నారు. తొలుత రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు వేతనాలు వచ్చేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు రూ.12 వేల వరకు పెరిగాయని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాలను లెక్కచేయకుండా ఆసుపత్రిలో విధులు నిర్వహించామని, అయినా ప్రస్తుతం నెలల తరబడి వేతనాలు అందక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయని వాపోయారు.
తమను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి లేబర్ యాక్టివిటీ కిందకు మార్చి కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు చెల్లించే విధానం తీసుకొచ్చారని వారు తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌లో చేరినప్పుడు ఇచ్చిన నియామక పత్రాలు తమ వద్ద ఉన్నప్పటికీ వాటికి ప్రస్తుతం విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. పిల్లల పాఠశాల ఫీజులు, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని, కొన్నిసార్లు రోజువారీ అవసరాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.గతంలో వేతనాలను రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పెంచే అంశంపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించినప్పటికీ అమలు కాలేదని కార్మికులు పేర్కొన్నారు. తమ సమస్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు. ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.
ఫిర్యాదుపై స్వీకరణ ముద్ర వేసి పంపించారే తప్ప తమ సమస్యను తెలుసుకునేందుకు అధికారులు సంప్రదించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం రోగుల మధ్య పని చేస్తూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న తమకు సకాలం లో వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. సుమారు 200 మంది కార్మికుల సమస్యను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

# 25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చెందుతున్న ఖమ్మం రైల్వే స్టేషన్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :**
రైలు ప్రయాణికులకు సౌకర్యం మరియు సౌలభ్యం కల్పన దిశగా పూర్తి కావస్తున్న పనులు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించేందుకు భారతీయ రైల్వే, దేశవ్యాప్తంగా స్టేషన్లను పునరాభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఎబిఎస్ఎస్)' ద్వారా భారీ పరివర్తనను చేపడుతోంది. ఈ పథకంలో భాగంగా తెలంగాణలో, రూ.2000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లు పునరాభివృద్ధి చేయబడుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023 ఆగస్టు మరియు 2024 ఫిబ్రవరి నెలల్లో రాష్ట్రంలోని స్టేషన్ల పునరాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో ఈ కార్యక్రమం గణనీయమైన ఊపందుకుంది.
ఇందులో భాగంగా, దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో నున్న ఖమ్మం రైల్వే స్టేషన్ రూ.25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేయబడుతుంది. కాజీపేట - విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్నటువంటి ఖమ్మం రైల్వే స్టేషన్‌ను నాన్-సబర్బన్ (గ్రేడ్-3 (ఎన్.ఎస్.జి-3) స్టేషన్‌గా వర్గీకరించబడింది. ఈ స్టేషన్‌లో సగటున రోజుకు 20 వేలమంది ప్రయాణీకుల రాకపోకలతో ప్రయాణీకులకు సేవలను అందిస్తుంది. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో సుమారు 55 రైళ్లు నిలుస్తాయి. న్యూఢిల్లీ, హౌరా, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, సికింద్రాబాద్, తిరుపతి తదితర ముఖ్య గమ్యస్థానాలకు వెళ్లే పలు ముఖ్యమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లకు కూడా ఖమ్మం స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం ఉంది.
రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం, సౌలభ్యం కల్పించి, మొత్తం ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో, ఖమ్మం స్టేషన్‌లో ఇప్పుడు ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలు, సదుపాయాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పాదచారుల వంతెన, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు, విశ్రాంతి గది, ఆర్‌పిఎఫ్ గదులు, ఏసీ లాంజ్ మొదలైన వాటి



మెరుగుదలలతో సహా అనేక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అదే సమయంలో, నూతన స్టేషన్ భవన నిర్మాణ పనులు, స్టేషను ఆవరణలో పచ్చదనాన్నిపెంచడం, స్టేషన్ ప్రాంగణం మరియు స్టేషన్ ముఖభాగం అభివృద్ధి పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.ఖమ్మం రైల్వే స్టేషన్ ఢిల్లీ-చెన్నై మరియు హైదరాబాద్-విజయవాడ రైల్వే లైన్ల కూడలిలో కీలకమైన ప్రదేశంలో నెలకొని ఉంది. ఇది ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య రైళ్ల రాకపోకలను సులభతరం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉండి, అనేక విద్యాసంస్థలు మరియు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు నిలయంగా ఉంది. ఇది చుట్టుపక్కల ఉన్న అనేక పట్టణాలు, గ్రామాలకు ప్రధాన కేంద్రంగా కూడా పనిచేస్తుంది. ఖమ్మం రైల్వే స్టేషన్ రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతున్న పెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటిగా నిలుస్తుంది. ఖమ్మం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి వలన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సులభమైన రాకపోకలు మరియు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం లభిస్తుంది. అదే సమయంలో స్థానిక ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కూడా గణనీయంగా దోహదపడుతుంది.

# 13 ప్రాంతాల్లో హైటెక్ మోడల్ బస్టాండ్లు

**షాపింగ్, ఫుడ్‌కోర్టులు, వినోద సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్**

- ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం
- వాణిజ్య స్థలాల కోసం వ్యాపారులకు అవకాశం
- త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక



**ముషీరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఆధునిక హంగులతో హైటెక్ మోడల్ బస్టాండ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్రంలోని 13 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్ విధానంలో వీటిని ఏర్పాటు చేయనుంది. ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానించడంతోపాటు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫుడ్‌కోర్టులు, వినోద సదుపాయాలు, వాణిజ్య స్థలాలను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మోడల్ బస్టాండ్లలో వాణిజ్య స్థలాలను పొందేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది. ప్రయాణికులకు రవాణా సౌకర్యాలతోపాటు షాపింగ్, ఆహారం, వినోదం వంటి సేవలను ఒకే ప్రాంగణంలో అందించడమే లక్ష్యమని పేర్కొంది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెంలో హైటెక్ మోడల్ బస్టాండ్లను ఏర్పాటు చేయనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది.

# వివాహిత అనుమానాస్పద మృతి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా కొండేపి మండలం పెట్లూరుకు చెందిన కల్యాణి (38)కి 2007లో శ్రీనివాసరావుతో వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మియాపూర్‌లో నివాసం ఉంటున్న సమయంలో 2016లో దాసరి నరసింహమూర్తి (35)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. 2018లో భర్త, పిల్లలను వదిలి నరసింహమూర్తితో వెళ్లిపోగా, పెద్దల సమక్షంలో తిరిగి కుటుంబం వద్దకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 12న మళ్లీ నరసింహమూర్తితో వెళ్లిపోయి నాదర్గుల్ శ్రీపురం కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15న కల్యాణి మృతి చెందినట్లు నరసింహమూర్తి ఆమె భర్తకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా రెండో అంతస్తులోని గదిలో కల్యాణి మృతదేహం మంచంపై కనిపించింది. ఆమె మెడపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. నరసింహమూర్తిపైనే అనుమానం ఉందని మృతురాలి తల్లి శ్యామల ఫిర్యాదు చేయడంతో ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పరారీలో ఉన్న నరసింహమూర్తి కోసం గాలిస్తున్నారు.

## కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా : మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు.
పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని ఆయన విమర్శించారు.

# ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం

**ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి వివేక్**



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** నాగోల్‌లోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి వివేక్, ఎమ్మెల్సీ కోదండ రాం, బొంతు రామ్మోహన్, అశ్వద్ధామ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, ఎం. శంకర్, మేలేజు వెంకన్న, తల్లోజు శ్రీనివాసచారి తదితరులు హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ఆర్టీసీ సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడతామని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజా పాలన దిశగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు ముందుంటుందని ఈ సందర్భంగా అన్నారు

# పోషణ్ మాహ్‌కు శాఖల సమన్వయం కీలకం

- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- 'మా అంగన్‌వాడీ.. మా బాధ్యత'తో పోషకాహార సేవలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 16 (జనంసాక్షి) :**
పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ సూచించారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార సేవలు సమర్థంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోషణ్ మాహ్‌లో భాగంగా జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైద్యారోగ్య, పంచాయతీరాజ్, విద్య, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. పోషకాహార లోపం నివారణకు శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల ఆహారం, పోషకాహారం, పరిశుభ్రత, రక్తహీనత నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార సేవలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చూడాలన్నారు. పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులను గుర్తించి అవసరమైన వైద్య, పోషకాహార సేవలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచి పోషణ్ మాహ్ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.
'మా అంగన్‌వాడీ.. మా బాధ్యత' అనే భావనతో కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పోషకాహారంపై అవగాహన పెంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో జిల్లా సంక్షేమ అధికారి శారద, విద్యాశాఖ అధికారి రేణుక దేవి, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ తదితర శాఖల అధికారులు

## ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం

**మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**

కొడంగల్, సెపెంబర్ 16 (జనం సాక్షి): కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పాత కొడంగల్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా నందారం ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, హుస్నాబాద్ సర్పంచ్ భీములు, కౌన్సిలర్ లు రాజశేఖర్, కౌన్సిలర్ బత్తుల అనిత నర్సిములు,లక్ష్మమ్మ బుగ్గప్ప, హన్యా నాయక్, సంతోష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


## తెలంగాణ వర్కర్స్ యూనియన్‌గా టీఎంయూ పోటీ

**నాగోల్‌లో కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశం**

**తాండూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ పేరుతో పోటీ చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) నిర్ణయించింది. బాణం గుర్తు వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. హైదరాబాద్ నాగోల్‌లో బుధవారం నిర్వహించిన టీఎంయూ కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.
అశ్వద్ధామరెడ్డి నాయకత్వంలో ఐఎన్‌టీయూసీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో పిలుపునిచ్చారు. సమావేశానికి మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. తాండూరు డిపో కార్మిక నాయకులు నవీన్‌గౌడ్, బాలప్ప, మొద్దీన్, విట్టల్‌రెడ్డి, పకీరప్ప, మాణిక్యప్ప, శ్రీనివాస్, యశోద తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొరనే పుడమికి శ్రీరామరక్ష

**అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమంలో తాడిబోయిన**



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) : భూమికి శ్రీరామరక్షగా ఉంటూ ప్రపంచ సౌభాగ్యానికి లక్ష్మణ రేఖగా భావిస్తున్న ఓజోన్ పొర ప్రస్తుతం తీవ్రస్థాయిలో క్షీణిస్తుండడంతో ప్రపంచానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంపల్లి పరిధి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం ఓజోన్ పొర ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. అనుపమ అధ్యక్షత వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా సెంటర్ ఫర్ ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య జి. కిషోర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాలను శోషించడంలో స్ట్రాటోస్ఫెరిక్ ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని, తద్వారా మానవులు, జంతువులు, మొక్కలు సహా భూమిపై ఉన్న జీవరాశులకు ఇది సహజ రక్షణ కవచంగా పనిచేస్తుందని తెలిపారు. ఓజోన్ పొరలో ఏర్పడుతున్న మార్పులు, ముఖ్యంగా అంటార్కిటికా ప్రాంతంలో ఓజోన్ క్షీణతను శాస్త్రవేత్తలు గుర్తించిన నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఓజోన్ పొరను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో దిద్దుబాటు చర్యలు చేపట్టాయని వివరించారు. ఐక్యరాజ్యసమితి 1994లో సెప్టెంబర్ 16ను అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా ప్రకటించిందని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కలిగించేలా విస్తృత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్వహిస్తున్నారని తెలిపారు. ఓజోన్ పరిరక్షణతో పాటు వాతావరణ మార్పులను నియంత్రించేందుకు కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆచార్య కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రధానంగా అడవుల నరికివేతను అరికట్టడం, మొక్కలు మరియు చెట్లను పెంచడం, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం, ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడంవంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు అనిత, సరిత ఉపాధ్యాయుడు శ్రీకాంత్, విద్యార్థినీ, విద్యార్థులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

# రెండు మెగా లెదర్ పార్కులకు గ్రీన్‌సిగ్నల్

- త్వరలో లెదర్ ఆర్టిజన్ల కల సాకారం
- ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని టీజీఎల్ఐపీసీ ఎండీకి ఆదేశాలు
- ఆర్టిజన్ల పోరాట ఫలితమే: డా. ఆరెపల్లి రాజేందర్
- లెదర్ పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఆర్థికాభివృద్ధికి అవకాశం



**బంట్వారం, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో రెండు మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నట్లు తెలంగాణ స్టేట్ లెదర్ ఆర్టిసన్స్ ప్రమోషన్ కోఆపరేటివ్ సొసైటీ తెలిపింది. లెదర్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన విధివిధానాలు, ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని టీజీఎల్ఐపీసీ (ఎల్ఐడీసీఏపీ) ఎండీని మంత్రి ఆదేశించినట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆరెపల్లి రాజేందర్ తెలిపారు.
తెలంగాణలో లెదర్ పార్కుల పునఃప్రారంభం, లెదర్ ఆర్టిజన్లకు ఉపాధి కల్పన, ఇందుకోసం కేటాయించిన భూములను పరిరక్షించాలనే అంశాలపై గత రెండు దశాబ్దాలుగా తాము పోరాడుతున్నామని రాజేందర్ తెలిపారు. 2001-04 మధ్య శిక్షణ పొందిన మాస్టర్లు, ఆర్టిజన్లు ఐక్యంగా ఉద్యమించడం వల్లే ఈ దిశగా పురోగతి సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో లెదర్ పరిశ్రమల ఏర్పాటుతో ఆ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి, ఆర్థికాభివృద్ధి కల్పించవచ్చని తెలిపారు. ఈ అంశంపై సెప్టెంబర్ 15న పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించిన అనంతరం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. లెదర్ పరిశ్రమల పునరుద్ధరణకు జరిగిన ప్రభుత్వ సమీక్ష సమావేశాల్లో సహకరించిన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. లెదర్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, మాస్టర్లు, ట్రైనర్లు, ఆర్టిజన్ల ఐక్యతతో రెండు మెగా లెదర్ పార్కుల ఏర్పాటు లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర లెదర్ మాస్టర్స్, ఆర్టిజన్స్ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# భూగర్భ జలాల రీచార్జ్‌కు ప్రకృతి ఆధారిత పరిష్కారాలు

- నీటిముంపు నివారణపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దృష్టి
- 56 ప్రాంతాల్లో వర్షాల సమయంలో నీటిముంపు
- కోయంబత్తూరు విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- అమలుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆదేశం




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** వర్షపు నీటిని సమర్థంగా నిర్వహించడంతోపాటు భూగర్భ జలాల రీచార్జ్‌ను పెంచేందుకు ప్రకృతి ఆధారిత పరిష్కారాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రత్యేక దృష్టి సారించింది. సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన అధ్యక్షతన బుధవారం వరద నివారణ, భూగర్భ జలాల రీచార్జ్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డాక్టర్ భీమ్రమాజా, శ్రీ శక్తివేల్ ఆధ్వర్యంలో వివిధ విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
సీఎంసీ 637.19 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందని కమిషనర్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో కార్పొరేషన్ పరిధిలోని 56 ప్రాంతాల్లో కనీసం రెండు గంటలపాటు నీటిముంపు ఏర్పడిందన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతోపాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్నారు. వేగవంతమైన పట్టణీకరణతో పేవ్డ్ ప్రాంతాలు పెరగడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గిపోయి నీటిముంపు సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో వర్షపు నీటిని సేకరించడం, నిల్వ చేయడం, భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం ద్వారా నీటిముంపును తగ్గించే ప్రకృతి ఆధారిత విధానాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేస్తున్న స్మార్ట్ అర్బన్ డీసెంట్రలైజ్డ్ స్టార్మ్‌వాటర్ సొల్యూషన్స్, మాడ్యులర్ ఎకోబ్లాక్, స్పాంజ్ విధానాలపై సమావేశంలో వివరించారు. వర్షపు నీటి ప్రవాహాన్ని సేకరించి భూగర్భ జలాల రీచార్జ్‌ను పెంచడం ద్వారా పట్టణాల్లో నీటిముంపును తగ్గించే విధానాలను ప్రతినిధులు వివరించారు. సీఎంసీ పరిధిలో నీటిముంపు సమస్య ఉన్న ప్రాంతాల్లో ఈ విధానాలను దశలవారీగా అమలు చేసే సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి సమర్థ నిర్వహణతోపాటు భూగర్భ జలాల రీచార్జ్‌ను ప్రోత్సహించే సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.




# రూ.9 లక్షల కోట్లు ఆవిరి

## ఇంధన మంటల్లో బూడిదైన సంపద



అంతర్జాతీయంగా చమురు ధరలు మండుతుండటంతో, స్టాక్‌మార్కెట్లలో మదుపర్ల సంపద బుగ్గిపాలవుతోంది. ఇదేబాటలో దేశీయ సూచీలు కూడా ఆరంభ లాభాలు పోగొట్టుకోవడంతో పాటు, భారీ నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగడం, విదేశీ మార్కెట్ల బలహీన సంకేతాలు ప్రతికూల ప్రభావాన్ని చూపించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 34 పైసలు తగ్గి 95.88 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.38% పెరిగి 109.24 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.9.17 లక్షల కోట్లు తగ్గి రూ.472.38 లక్షల కోట్ల (4.92 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

**5 నెలల కనిష్ఠానికి నిఫ్టీ**

ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 75,369.63 పాయింట్ల వద్ద లాభాల్లో (శుక్రవారం ముగింపు 74,781.76) ప్రారంభమైంది. ఆ తర్వాత లాభాలు క్రమంగా తగ్గుతూ, సూచీ నష్టాల్లోకి జారుకుంది. చివరివరకు అదే ఒరవడి కొనసాగి, సెన్సెక్స్ 777.94 పాయింట్ల నష్టంతో 74,003.82 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 279.50 పాయింట్లు కోల్పోయి 23,118.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 23,592.85 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. ముగింపే ఈ సూచీకి కనిష్ఠస్థాయి. సెన్సెక్స్ 3 నెలల కనిష్ఠానికి, నిఫ్టీ 5 నెలల కనిష్ఠానికి దిగి వచ్చాయి.

**ఏడు మినహా మిగతావి డీలా..**

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఏడు మినహా మిగతావి డీలాపడ్డాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 6.04%, ఇండిగో 3.95%, టైటన్ 3.1%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.09%, అదానీపోర్ట్స్ 3.03%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.38%, ఎస్‌బీఐ 2.77%, ట్రెంట్ 2.62% నష్టపోయాయి. కొత్త ఎండీ, సీఈఓ పదవి కోసం ఇద్దరి పేర్లను ఆర్‌బీఐకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిఫారసు చేసిందనే వార్తలతో ఈ బ్యాంకు షేరు 1.27% లాభంతో రూ.717 వద్ద ముగిసింది.

**రాణించిన ఐటీ షేర్లు**

ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికత అభివృద్ధి నెమ్మదించాలనే పరిశ్రమ నిపుణుల వ్యాఖ్యల నేపథ్యంలో, సంప్రదాయ ఐటీ సేవలకు ఆందోళనలు తగ్గుతాయనే భావనతో ఐటీ కంపెనీల షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.98%, హెగ్జావేర్ టెక్నాజీస్ 3.97%, ఇన్ఫోసిస్ 3.64%, టెక్ మహీంద్రా 2.31%, టీసీఎస్ 2.18%, విప్రో 1.4% పెరిగాయి.

**ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ లాభారంభం..**

స్టాక్ మార్కెట్లో నమోదైన తొలి రోజు ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ షేరు లాభాల్లో ముగిసినా, ఆరంభం నాటి భారీ లాభాలను నిలబెట్టుకోలేకపోయింది. ఇష్యూ ధర రూ.124తో పోలిస్తే బీఎస్ఈలో 30.64% అధికంగా రూ.162 వద్ద ఈ కంపెనీ షేరు నమోదైంది. ఆ తర్వాత 32.66% పెరిగి రూ.164.50ను చేరినా, చివరకు 4.51% లాభంతో రూ.129.60 వద్ద ముగిసింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.1,459.59 కోట్లుగా నమోదైంది.

**టాటా గ్రూపు షేర్ల దూకుడు**

లిస్టింగ్‌కు రాకుండా ఉండేందుకు, ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సును సరెండర్ చేసే నిమిత్తం టాటా సన్స్ దాఖలు చేసిన దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించిందన్న వార్తల నేపథ్యంలో టాటా గ్రూపులోని పలు కంపెనీల షేర్లు వెలుగులోకి వచ్చాయి. ఆర్‌బీఐ నిర్ణయంతో టాటా సన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావడం తప్పనిసరి అవుతుంది. ఈ నేపథ్యంలో టాటా కెమికల్స్ షేరు 20%, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 10.33%, టీసీఎస్ 2.18%, టాటా మోటార్ ప్యాసింజర్ వెహికల్స్ 0.33%, టాటా ఎలెక్సీ 1.48%, టాటా స్టీల్ 0.3% పెరిగాయి.

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

హైదరాబాద్(జనంసాక్షి): సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## సౌదీకి హౌతీల మరో భారీ షాక్..!

**అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హౌతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హౌతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్థంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హౌతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హౌతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హౌతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హౌతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హౌతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హౌతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు.

## బడ్జెట్ ధరలో ఒప్పో నుంచి స్మార్ట్‌ఫోన్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ ఒప్పో దేశీయ మార్కెట్‌లోకి కొత్త స్మార్ట్‌ఫోన్ కే14 లైట్‌ను లాంచ్ చేసింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆక్టాకోర్ ప్రాసెసర్‌తో వస్తోంది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్న వేళ.. బడ్జెట్ ధరలో మంచి బ్యాటరీతో స్మార్ట్‌ఫోన్ కావాలనుకునే వారికి ఇది ఒక ఆప్షన్ కానుంది. ఫీచర్లు పరిశీలిస్తే. ఆండ్రాయిడ్ 16తో కూడిన కలర్‌ఓఎస్ 16పై పనిచేస్తుంది. జనితిబనీఇ ు7250 ఆక్టా కోర్ ప్రాసెసర్ అమర్చారు. 6.75 అంగుళాల హెచ్‌డీ+ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120ఊళి రిఫ్రెష్ రేట్, 900 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. డిస్‌ప్లే ప్యానెల్ ఫ్లాష్ టచ్, ఆయిలీ-హ్యాండ్ టచ్, గ్లోవ్ టచ్ ఫీచర్లను అందిస్తుందని ఒప్పో చెబుతోంది. ఫోన్ వెనుక వైపు 13 ఎంపీ ప్రధాన కెమెరా, ముందువైపు 5 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఏఐ క్లియర్ ఫేస్, ఏఐ స్మార్ట్ ఇమేజ్ మ్యాటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. గూగుల్ జెమినై, గూగుల్‌ఏఐ అసిస్టెంట్ సపోర్టుతో వస్తోంది. ఎఖ64 రేటింగ్ ఉంది.7000ఎంఏహెచ్ బ్యాటరీ, 15చి ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సపోర్టుతో వస్తోంది. ధర విషయానికొస్తే.. రూ.16,999గా కంపెనీ నిర్ణయించింది. ఫెదర్ పర్పుల్, స్టోన్ బ్రౌన్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో నేటి నుంచే విక్రయాలకు రానున్నట్లు కంపెనీ తెలిపింది. లాంచ్ ఆఫర్‌లో భాగంగా ఎంపిక చేసిన బ్యాంక్ హోల్డర్స్‌కు రూ.వెయ్యి డిస్కౌంట్ అందిస్తోంది. మూడు నెలల పాటు నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కూడా ఉంది.




## రూ.500కు లభించే బ్యాగ్.. రూ.8.3 లక్షలా..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్‌కు చెందిన ఓ బ్యాగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'నవరాత్రి' పేరుతో రూపొందించిన ఈ బ్యాగ్ ధర ఏకంగా రూ.8.3 లక్షలు ఉండటమే దీనికి కారణం. ఈ బ్యాగ్ డిజైన్ గుజరాత్ వీధుల్లో కనిపించే సంప్రదాయ బ్యాగులను పోలి ఉందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అతి తక్కువ ధరకు లభించే బ్యాగ్‌కు భారీ ధర నిర్ణయించడంపై చర్చ మొదలైంది. ముఖ్యంగా భారతీయ సంప్రదాయ కళలు, హస్తకళలను విదేశీ లగ్జరీ బ్రాండ్లు ఉపయోగించుకుంటున్నాయని నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గొయెంకా తీవ్రంగా స్పందించారు. "ప్రాడా, కొల్హాపురి చెప్పుల వివాదం తర్వాత ఇప్పుడు ఈ బ్యాగ్ చర్చకు వచ్చింది. గుజరాత్ వీధుల్లో రూ.500కు లభించే బ్యాగ్ డిజైన్‌కు రూ.8.3 లక్షలు వసూలు చేస్తున్నారు. దానిని కనిపెట్టిన భారతీయ కళాకారులకు ఎలాంటి గుర్తింపునివ్వడం లేదు. లగ్జరీ బ్రాండ్లు మన కళలను ఇలా ఉపయోగించుకోవడం ఎప్పుడు ఆపుతాయో? అని ఆయన ప్రశ్నించారు. బయోకాన్ అధినేత కిరణ్ మజుందార్ షా కూడా దీనిపై స్పందించారు. "భారతీయ సంప్రదాయ కళను లగ్జరీ ఉత్పత్తిగా మలిచి.. మళ్లీ ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. దాన్ని సృష్టించిన కళాకారులకు గుర్తింపు ఇవ్వకపోవడం సరైంది కాదు" అని ఆమె పేర్కొన్నారు.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,62,254 | ₹ 1,77,008 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

# ఫోన్ కొంటే.. రెస్టారంట్‌లో తింటే.. యూపీఐ ఛార్జీలు చెల్లించాలా..?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నగదు రహిత చెల్లింపుల్లో కీలకమైన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధిస్తూ కేంద్రం చేసిన ప్రకటన వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తోంది. రూ.2000లకు మించిన లావాదేవీలపై రుసుములు తప్పవని, అయితే అవి వ్యాపార సంస్థలకే వర్తిస్తాయని కేంద్రం చెబుతోంది. కానీ, ఎటు తిరిగి వినియోగదారులపై ఆ భారం పడుతుందనేది సామాన్యుల వాదన. ఇంతకీ ఈ ఛార్జీలు ఎలా పడుతాయి..? ఎవరు కట్టాలి..? ఉదాహరణలతో తెలుసుకుందాం..! ఫోన్ కొంటే.. మీరు రూ.50వేల విలువ చేసే ఫోన్ కొనుగోలు చేసి, ఆ మొత్తాన్ని యూపీఐతో చెల్లింపు చేశారని అనుకుందాం. కేంద్రం ప్రకటించిన ఎండీఆర్ రేటు 0.4శాతం ప్రకారం.. ఈ లావాదేవీకి రూ.200 రుసుము పడుతుంది. ఈ మొత్తాన్ని మీరు చెల్లించనక్కర్లేదు. ఫోన్ విక్రేత నుంచి ఆ ఛార్జీని బ్యాంకులు లేదా పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు వసూలు చేస్తాయి.పెట్రోల్ కొట్టిస్తే.. మీ కారులో రూ.3 వేల పెట్రోల్ కొట్టించారనుకోండి..! ఆ యూపీఐ లావాదేవీకి మీరు అంత మొత్తమే చెల్లిస్తారు. ఒకవేళ పెట్రోల్ బంక్ వారికైతే అప్పుడు ఈ లావాదేవీపై రూ.5 రుసుము వర్తిస్తుంది. దాన్ని మీరు చెల్లించాల్సి ఉంటుంది. కస్టమర్‌గా ఒక్క రూపాయి అదనంగా పడదు.బీమా ప్రీమియం చెల్లింపులు, పెట్రోలు/డీజిల్ కొనుగోలు, ప్రభుత్వ విద్యుత్, నీరు, పైప్‌డ్ గ్యాస్ బిల్లులు, స్కూల్, కాలేజీ ట్యూషన్ ఫీజు వంటి నిర్దిష్ట చెల్లింపుల్లో రూ.2,000 దాటిన లావాదేవీలపై శాతంతో సంబంధం లేకుండా కేవలం రూ.5 స్థిర ఎండీఆర్ మాత్రమే వర్తిస్తుంది.రెస్టారంట్‌కు వెళ్తే.. ఒకవేళ మీరు ఏదైనా రెస్టారంట్‌లో భోజనం చేశారని అనుకుందాం. అక్కడ బిల్లు రూ.5వేలు అయ్యింది. అప్పుడు కూడా మీరు పైసా అదనంగా కట్టరు. ఎండీఆర్ రేటు ప్రకారం పడే రూ.20 ఛార్జీని సదరు రెస్టారంటే చెల్లిస్తుంది.



స్నేహితుడికి పంపిస్తే.. ఏదో అత్యవసరమై మీ స్నేహితుడికి ఓ రూ.50వేలు యూపీఐ ట్రాన్స్‌ఫర్ చేశారనుకోండి..! అప్పుడు మీ ఇద్దరిలో ఎవరికీ ఎండీఆర్ ఛార్జీలు పడవు. ఒక వ్యక్తి నుంచి మరొకరికి (పర్సన్ టు పర్సన్) పంపించే వ్యక్తిగత బదిలీలపై.. ఎంత మొత్తమైనా సరే ఎలాంటి రుసుములు ఉండవని కేంద్రం స్పష్టం చేసింది.యూపీఐ పేమెంట్ రూ.లక్ష చేస్తే.. ఏదైనా వ్యాపార సంస్థకు రూ.లక్ష పేమెంట్‌ను యూపీఐ ద్వారా చేస్తే.. ఎండీఆర్ రేటు ప్రకారం ఆ లావాదేవీకి రూ.400 ఛార్జీ పడాలి. కానీ, ఇక్కడ సదరు వ్యాపార సంస్థ నుంచి బ్యాంకులు/పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు రూ.300 మాత్రమే వసూలు చేస్తాయి. రూ.75వేలు, ఆ పైన చేసే ఎంత పెద్ద లావాదేవీ అయినా, ఒక్కో చెల్లింపుపై గరిష్ఠంగా రూ.300కు ఎండీఆర్‌ను కేంద్రం పరిమితం చేసింది.

**కస్టమర్లపై భారం తప్పదా..?**

ఈ ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు తమ కస్టమర్లపై బదిలీ చేయకుండా చూసుకోవాలని బ్యాంకులకు కేంద్రం సూచించింది. యూపీఐ అప్లికేషన్ ప్రొవైడర్లు వినియోగదారులపై ప్లాట్‌ఫామ్ ఫీజులు లేదా అంతర్గత ఛార్జీలను విధించడంపై నిషేధం ఉందని ఆర్థిక మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే, అమల్లో ఇది ఎంతవరకు సాధ్యమనేదే ఇక్కడ అసలు ప్రశ్న. ఇప్పటికే కొన్ని మర్చెంట్ అవుట్‌లెట్ల వద్ద క్రెడిట్ కార్డులకు సంబంధించి బోర్డులు కన్పిస్తాయన్న సంగతి తెలిసిందే. కొన్ని వ్యాపార సంస్థలు.. క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేసే కస్టమర్ల నుంచి అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు ఎండీఆర్ ఛార్జీలు అమల్లోకి వస్తే.. ఆ భారం వినియోగదారులపై వేస్తారనే ఆందోళనలు ఉన్నాయి. అంతేగాక, ఈ ఛార్జీల వల్ల వ్యాపారులు మళ్లీ నగదు రూపంలో చెల్లింపులకే మొగ్గు చూపుతారన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

## భారీ లేఆఫ్‌ల నేపథ్యంలో.. ఉద్యోగులకు ఒరాకిల్ సీఎఫ్‌వో కీలక సూచనలు

ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్‌లో మంగళవారం భారీగా ఉద్యోగులకు లేఆఫ్స్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కంపెనీ సీఎఫ్‌వో హిల్లరీ మాక్సన్ సంస్థలో పనిచేస్తోన్న ఉద్యోగులకు కీలక సూచనలు చేశారు. 'ఆల్ హ్యాండ్స్' సమావేశంలో మాట్లాడుతూ.. కంపెనీ ఆర్థిక వృద్ధి కోసం సహకరించాలని కోరారు. సంస్థ వృద్ధి స్థిరంగా ఉండాలంటే సమయం, డబ్బును ఆలోచనాత్మకంగా ఖర్చు చేయాలని సూచించారు. అయితే తక్కువ వనరులతో ఎక్కువ పని చేయాలని తాను చెప్పట్లేదని స్పష్టం చేశారు. వినియోగదారులకు ఉపయోగం లేని పనులు కాకుండా.. అత్యధిక ప్రయోజనం కలిగించే వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. కంపెనీ వృద్ధి, వినియోగదారుల డిమాండ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం వంటి విషయాలను ప్రస్తావించారు. సుమారు గంటసేపు జరిగిన ఈ సమావేశంలో హిల్లరీ మాక్సన్ ఉద్యోగ తొలగింపుల గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాకపోవడం గమనార్హం. కాగా ఏడాదిలో ఇప్పటికే దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులను తొలగించిన ఒరాకిల్.. లేఆఫ్ జాబితాలో ఉన్న మరికొందరిని మంగళవారం తొలగించిన విషయం తెలిసిందే. ఇదీ చదవండి: భారత్‌లో 'అమెజాన్ నౌ' ద్వారా రూ.9,500 కోట్ల వార్షిక అమ్మకాలు




## కేంద్ర క్యాబినెట్ గుడ్‌న్యూస్.. ఈపీఎఫ్‌వో వేతన పరిమితి పెంపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**



కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల భవిష్యనిధి గరిష్ఠ వేతన పరిమితి పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రూ.15వేలుగా ఉన్న పరిమితిని రూ.25వేలకు పెంచేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచే ఈ నిర్ణయం అమల్లోకి రానుందని కేంద్రం వెల్లడించింది.ఈపీఎఫ్ వేతన పరిమితి పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. జీవన వ్యయం పెరిగినప్పటికీ దాదాపు 12 ఏళ్లుగా గరిష్ఠ వేతన పరిమితి పెరగలేదు. 2014లో చివరిసారిగా రూ.6500 నుంచి రూ.15వేలకు పెంచారు. దీంతో వేతన పరిమితి పెంచాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల అదనంగా 51 లక్షలకు పైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందని, వీరంతా ఈపీఎఫ్ఓ పరిధిలోకి వస్తారని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీనిపై కేంద్రం ఏటా రూ.11,339 కోట్లు వెచ్చించనుందని చెప్పారు. ప్రస్తుతం, నెలకు రూ.15వేలు కంటే ఎక్కువ వేతనంతో ఉద్యోగంలో చేరే కొత్త ఉద్యోగి ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్ పరిధిలోకి రావడం లేదు. తప్పనిసరి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఈడీఎల్ఐ ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచడం వల్ల రూ.15,000- రూ.25,000 వేతన శ్రేణిలో గణనీయమైన సంఖ్యలో ఉద్యోగులు చట్టబద్ధమైన సామాజిక భద్రతా పరిధిలోకి వస్తారు. తాజా సవరణకు అనుగుణంగా పీఎఫ్ పొదుపు, ఈపీఎస్ పెన్షన్ మొత్తాలు పెరుగుతాయని కేంద్రం పేర్కొంది.

## దానం అనర్హత పై విచారణ వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): దానం అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ ఎంపీ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రా బాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధార మని తమ వాదనల్లో స్పష్టం చేసారు. పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహ రించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖ రిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తర ఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## భారత్‌లో 'అమెజాన్ నౌ' ద్వారా రూ.9,500 కోట్ల వార్షిక అమ్మకాలు




**దిల్లీ:**

అమెజాన్ తన క్విక్ కామర్స్ 'అమెజాన్ నౌ' ద్వారా దేశంలో 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల) వార్షిక స్థూల అమ్మకాలను సాధించినట్లు పేర్కొంది. ఈ సేవలను ప్రారంభించినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని, తద్వారా ఇది అమెజాన్ ఇండియా చరిత్రలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ వ్యాపార విభాగంగా నిలిచిందని అమెజాన్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 300కు పైగా నగరాల్లోని వినియోగదార్లకు అమెజాన్ నౌ సేవలను అందించాలన్న తమ ప్రణాళికలో భాగంగా, దీపావళి నాటికి ఈ సేవలను 100 నగరాలకు విస్తరించే దిశగా కంపెనీ ముందుకు వెళుతోందని అమెజాన్ ఇండియా కంట్రీ హెడ్ సమీర్ కుమార్ తెలిపారు. పండుగ సీజన్‌కు ముందు 10 వారాల కంటే తక్కువ వ్యవధిలోనే అమెజాన్ నౌ ను 4 రెట్లు ఎక్కువ నగరాలకు విస్తరించింది. తద్వారా 60కి పైగా నగరాలు, పట్టణాలకు నిమిషాల్లో డెలివరీని అందించింది. తిరుపతి, గుంటూరు, వరంగల్ నగరాల్లోనూ..: 'ప్రతి త్రైమాసికంలో మా ఆర్డర్లు రెట్టింపవుతున్నాయి. వినియోగదార్ల నుంచి వస్తున్న స్పందన మమ్మల్ని ఉత్తేజితుల్ని చేస్తోంది. ఉత్తరాదిన గురుదాస్‌పుర్, హోషియార్‌పుర్ నుంచి దక్షిణాదిన వేంబాయం, అలమ్‌కోడ్ వరకు నిమిషాల్లో డెలివరీ అందిస్తూ, దీపావళి నాటికి 100 నగరాలకు విస్తరించే దిశగా మేము ముందుకు సాగుతున్నామ'ని సమీర్ పేర్కొన్నారు. 'మెట్రో నగరాలతో పాటు పడుబిద్రి, తిరుపతి, గుంటూరు, గురుదాస్‌పుర్, జలంధర్, వెల్లూరు, ధార్వాడ్, వరంగల్, బెర్హంపుర్ వంటి పట్టణాల్లోని వినియోగదార్లకు కూడా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటి డెలివరీ వ్యవస్థకు 750కి పైగా మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల నెట్‌వర్క్ మద్దతుగా నిలుస్తోంద'ని వివరించారు.

# ఆగస్టులో ఎగుమతుల జోరు

**5 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు**

దిల్లీ: దేశ వస్తు ఎగుమతులు ఆగస్టులో 26.12% పెరిగి 43.81 బిలియన్ డాలర్ల (రూ.4.16 లక్షల కోట్ల)కు చేరాయి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు ఇందుకు అండగా నిలిచాయి. 2022 జూన్ తర్వాత (30.12% వృద్ధి) ఒక నెలలో ఎగుమతులు ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. ఆగస్టులో దిగుమతులు 1.41% పెరిగి 70.76 బి.డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి దిగుమ తులు తగ్గడంతో, దేశ వాణిజ్య లోటు అయిదు నెలల కనిష్ఠమైన 26.86 బిలియన్ డాలర్ల (రూ.2.55 లక్షల కోట్ల)కు తగ్గింది. ఈ ఏడాది జులైలో వాణిజ్య లోటు 31.98 బి.డాలర్లుగాను, 2025 ఆగస్టులో 27.22 బి.డాలర్లుగాను ఉంది. పసిడి దిగుమతుల్లో క్షీణత: 2025 ఆగస్టులో 5.4 బి.డాలర్లుగా ఉన్న పసిడి దిగుమతులు, గత నెలలో 57.7% తగ్గి 2.3 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టులో ఎగుమతులు 17.85% పెరిగి 215.91 బి.డాలర్లకు చేరాయి. దిగుమతులు 18.21% పెరిగి 363 బి.డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్యలోటు 123.88 బి.డాలర్ల నుంచి 147.09 బి.డాలర్లకు పెరిగింది. ఎగుమతుల వృద్ధిలో ఇంజినీరింగ్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, జౌళి రంగాలు కీలక పాత్ర పోషించాయి. మరోవైపు ప్రధానంగా వస్తు వాణిజ్య లోటు పెరగడం వల్ల మన దేశ కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) 2025 జులైలో ఉన్న 3.2 బిలియన్ డాలర్ల నుంచి, 2026 జులైలో 7 బిలియన్ డాలర్లకు పెరిగిందని ఆర్‌బీఐ తెలిపింది.



# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

- **సింగపూర్ కంపెనీలకు తెలంగాణలో విస్తృత అవకాశాలు**
- **ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16, (జనంసాక్షి):** భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి.. రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతో పాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే దిశగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు.. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్ అండ్ డీ, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్ అండ్ డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఆ మేరకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డా.ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్ ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పురోగతి.. విద్యుత్తు రంగాన్ని బలోపేతం చేయడం

**ఇంజనీర్ల అమూల్యమైన కృషిని స్మరించుకుంటూ.. ఎన్టిపిసిలో ఇంజనీర్స్ డే వేడుకలు**

**గోదావరిఖని, జనంసాక్షి :** సాంకేతిక పురోగతి, విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడం, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల అమూల్యమైన కృషిని స్మరించుకుంటూ, ఎన్‌టిపిసి రామగుండం అండ్ తెలంగాణ ఆధ్వర్యంలో 'ఇంజనీర్స్ డే 2026' ఉత్సాహంగా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (ఆర్అండ్‌టీ), రామగుండం వారు ఏర్పాటు చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రమౌళి గడ్డమంగు (ముఖ్య అతిథి), చందన్ కుమార్ సమంత - ఈడి (ఆర్అండ్‌టీ) (గౌరవ అతిథి), ఇతర ప్రముఖుల రాకతో కార్యక్రమం ప్రారంభమైంది. భారతదేశంలో ఇంజనీర్స్ డేగా జరుపుకునే భారతరత్న ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడంతో కార్యక్రమ ప్రక్రియ మొదలైంది, అనంతరం ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తర్వాత సభికులందరూ గర్వం, గౌరవంతో ఎన్‌టిపిసి గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళి గడ్డమంగు చేసిన ముఖ్య ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన తన అనుభవాలను మరియు స్ఫూర్తిదాయకమైన ఆలోచనలను పంచుకుంటూ, ఆవిష్కరణలు, అత్యుత్తమ పనితీరు, నిరంతర అభ్యాసం మరియు దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. శ్రీ చందన్ కుమార్ సమంత (ఈ డి- ఆర్ అండ్ టీ) కూడా సభికులను ఉద్దేశించి ప్రసంగించి, తన అంతర్దృష్టితో కూడిన స్ఫూర్తిదాయక మాటలతో ఇంజనీర్లలో ఉత్సాహాన్ని నింపారు. వేడుకల ఉత్సాహాన్ని మరింత పెంచేలా, హాజరైన వారి కోసం ఒక 'స్టాండ్-అప్ కామెడీ' ప్రదర్శన ఏర్పాటు చేయబడింది, ఇది ఆహ్లాదకరమైన మరియు



వినోదాత్మక విరామంగా నిలిచింది. దీని తర్వాత 'ఇంజనీర్స్ డే క్విజ్ 2026' విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది; ఇందులో విజేతలు సాధించిన విజయాలకు మరియు వారి భాగస్వామ్యానికి గుర్తింపుగా అవార్డులు, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. అలాగే, గౌరవ సూచకంగా మరియు అభినందనగా నియర్ (ఆర్అండ్‌టీ) కార్యవర్గ సభ్యులు ప్రముఖులకు జ్ఞాపికలు, శాలువాలను బహూకరించి సత్కరించారు. చివరగా, నియర్ (ఆర్ అండ్ టీ) అధ్యక్షుడు పి. విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు. 'ఇంజనీర్స్ డే 2026' వేడుకల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన ప్రముఖులు, యాజమాన్యం, నిర్వాహకులు, పాల్గొన్న వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### తనుగుల హత్య కేసు 24 గంటల్లో ఛేదన..

# కుటుంబ సభ్యులే నిందితులు

భూ వివాదమే హత్యకు కారణమని పోలీసుల వెల్లడి

- **ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **మృతదేహాన్ని పొలంలో పూడ్చినట్లు గుర్తింపు.. పార, గడ్డపార, సైకిల్, చున్నీ స్వాధీనం**



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తనుగుల గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో బొజ్జపల్లి రాజబాబు హత్యకు గురైన కేసును జమ్మికుంట పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణ ప్రకారం.. తన తల్లి లచ్చమ్మకు చెందిన భూమి విషయంలో రాజబాబు కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడు. భూమిని తనకే ఇవ్వాలని పట్టుబట్టడంతో కుటుంబంలో వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 10న మద్యం మత్తులో జూపాక శంకర్ ఇంటికి వెళ్లిన రాజబాబు తల్లి లచ్చమ్మ, అక్క కవితతో గొడవకు దిగాడు. ఆమెను జుట్టు పట్టుకుని లాగడంతో అక్కడున్న కుటుంబ సభ్యులు అతడిని కొట్టి మంచానికి కట్టివేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం శంకర్ చున్నీతో రాజబాబు మెడను బిగించడంతో మృతి చెందినట్లు విచారణలో వెల్లడైంది. విషయం బయటకు రాకుండా మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి సైకిల్‌పై గ్రామ శివారులోని పొలానికి తరలించి గుంతలో పూడ్చినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో ఏడుగురు నిందితుల ప్రమేయాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, తరలింపునకు ఉపయోగించిన సైకిల్, చున్నీలను స్వాధీనం చేసుకున్నారు. భూ, కుటుంబ వివాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని పోలీసులు సూచించారు.

# ఖమ్మంలో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభను జయప్రదం చేయండి

**బోధన్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** అఖిల భారత రైతుకూలీ సంఘం బోధన్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బోధన్ పట్టణంలో న్యూ డెమోక్రసీ కార్యాలయంలో సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఖమ్మంలో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలనీ కోరుతూ బుధవారం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ బోధన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎల్ చిన్న పర్వయ్య, జి నడిపి భూమయ్యలు మాట్లాడుతూ, కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం రైతుల బాధలను పట్టించుకోవడం లేదని, నేడు యూరియా, డీఏపీ లాంటి ఎరువుల సబ్సిడీ ఎత్తివేసిందని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోడీ ప్రభుత్వం నేడు రైతులపై ఎరువుల ధరను విపరీతంగా పెంచిందని, పత్తి పంటను విదేశాల నుండి, అమెరికా నుండి దిగుమతికి అనుమతి ఇచ్చిందన్నారు. భారతదేశ పత్తి రైతుల నోట్లో మట్టి కొట్టిందని, కార్పొరేట్ కంపెనీల రుణాలు మాపి చేసిన రైతూ రుణాలు ఎందుకు మాపి చేయడం లేదో సమాధానం చెప్పాలని, దేశ భక్తి ముసుగులో పాసీజంని అమలు చేస్తున్నారని, రైతూ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలనీ, దీనికి వ్యతిరేకంగా రైతులు పోరాడాలని అన్నారు,రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు ఎం ఎస్ పి గిట్టుబాటు ధర స్వామినాథన్ సిఫారస్ లను కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తానని ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చి వాటిని అమలు చేయకుండా రైతాంగానికి మోడీ తీవ్ర ద్రోహం చేసినారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలకు




వ్యతిరేకంగా రైతు కూలీలను ఐక్యం చేసి రైతాంగ పోరాటాలను ముందుకు తీసుకుపోయే విధంగా ఈ మహాసభలలో భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తామని వారు అన్నారు అలాగే రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ ఆధార పరిశ్రమలైన నిజాం షుగర్ ఫ్యాక్టరీ మరియు సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాడని వారు ధ్వజమెత్తారు అలాగే రైతు బీమా పథకం ఎత్తివేసే కుట్ర జరుగుతుందని అది సరైనది కాదని రైతులకు నష్టం చేసే చర్యలకు పాల్పడితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పిరోళ్ళ పోశెట్టి, సూర్య విఠల్, నాయకులు లక్ష్మణ్, జైరాం, సుధాకర్, పోశెట్టి, సంజీవ్, తదితర నాయకులు పాల్గొన్నారు



## ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కేంద్ర సహాయమంత్రికి వినతి

**చొప్పదండి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** మండలం లోని ఆర్నకొండ గ్రామంలో యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ అశోక్ ఆదిత్య యూత్ క్లబ్ (రి.నెం. 110/2011) సభ్యులు ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు జన్నారం శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందని, అలాగే గ్రామ బస్టాండ్ వద్ద నిత్య జనగణమన, జాతీయ గీతాలాపన కార్యక్రమాలతో పాటు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.గ్రామంలో 6 వేల జనాభాలో సుమారు 3 వేల మంది యువత ఉన్నారని, ఎక్కువ మంది యువత ఉన్నందున వారు చెడు అలవాట్లకు, వ్యసనాల వైపు వెళ్లకుండా, దేహదారుఢ్యం కొరకు మరియు గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీనివల్ల యువతలో మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని పేర్కొన్నారు.కావున గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించగలరని కోరారు.

# అయిలాపూర్ ఘటనపై పోలీసుల వివరణ

- **మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు**
- **వివస్త్రం చేసి కారం చల్లారన్న ప్రచారంలో వాస్తవం లేదు**
- **ముఖంపై మాత్రమే కారం చల్లినట్లు ప్రాథమిక విచారణలో గుర్తింపు**
- **నిందితులపై చట్టపరమైన చర్యలు**



**కోరుట్ల, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో మహిళపై దాడి ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై పోలీసులు స్పష్టత ఇచ్చారు. మహిళను వివస్త్రం చేసి మర్మాంగాలపై కారం చల్లారన్న ప్రచారంలో వాస్తవం లేదని మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు తెలిపారు. ప్రాథమిక విచారణలో మహిళ ముఖంపై మాత్రమే కారం చల్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 24న మహిళ తన మరిదితో ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె భర్త దుర్గయ్య ఆగస్టు 25న కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సెప్టెంబర్ 2న మహిళ తన మరిదితో కలిసి జగిత్యాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఆమె స్టేట్‌మెంట్ నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఇరువర్గాల కుల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, తాను మరిదితోనే ఉంటానని మహిళ తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మరిది వద్ద ఉంటున్న సమయంలో ఆయన మొదటి భార్య బంధువులు తనపై దాడి చేసి ముఖంపై కారం చల్లారని మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో సెప్టెంబర్ 15న కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

# సింగరేణిలో ఉత్సాహంగా హాకీ పోటీలు ప్రారంభం

- **క్రీడాస్ఫూర్తితో ప్రతిభను చాటుతూ కోల్ ఇండియా స్థాయికి ఎదగాలి : డీజీఎం పి. పైడిశ్వర్**

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థ రామగుండం ఏరియా-1 పరిధిలో ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న డబ్ల్యు పిఎస్ అండ్ జి ఏ-2026-27 అంతర్గత క్రీడా పోటీల్లో భాగంగా హాకీ పోటీలు బుధవారం జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పి. పైడిశ్వర్, డీజీఎం (సి ఎస్ పి) హాజరై హాకీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మమేకమైన ఆయన, పోటీల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "విజయం సాధించినప్పుడు ఆనందించాలి.. ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకూడదు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి" అని క్రీడాకారులకు సూచించారు. ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని తదుపరి స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి కోల్ ఇండియా స్థాయికి ఎంపికై సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. హాకీ పోటీల్లో ఆర్.జి.-1 ఏరియా పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. పోటీల సందర్భంగా క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరియ గా, స్టేడియం క్రీడాభిమానుల కేరింతలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి జి. హనుమంత రావు, కో-ఆర్డినేటర్ గాండ్ల రాజయ్య, వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి**

**ముషీరాబాద్ సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయపడేందుకు రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ వివేకానందపురం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ. సతీష్ బాబు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో దీపక్ బట్టాచార్జి, అధ్యక్షుడు నారాయణరావు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితురాలికి మంత్రి శ్రీధర్‌బాబు భరోసా..!

**రూ. 2.50 లక్షల ఎల్ఓసి మంజూరు**

**రామగిరి, సెప్టెంబర్ 16, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలం ఆదివారం పేట గ్రామానికి చెందిన గుడిసెల రాజేశ్వర్ కి వైద్య చికిత్సకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆర్థిక భరోసా కల్పించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వరి కి వైద్య ఖర్చుల నిమిత్తం (సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంత్రి మంజూరు చేయించారు. రాజేశ్వరి కుటుంబ సభ్యులు వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరగా, ఆయన వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్‌ఓసీ మంజూరుకు చర్యలు చేపట్టారు. అనంతరం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని రాజేశ్వరి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య చికిత్స సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు రాజేశ్వరి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారం అందడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని పేర్కొన్నారు.

# బాలాజీ జ్యూవెలర్స్ చోరీ కేసు ఛేదింపు

- **నలుగురు నిందితుల అరెస్ట్**
- **500కుపైగా సీసీ కెమెరాల పరిశీలన**
- **59.220 గ్రాముల బంగారు బార్ స్వాధీనం**
- **సుమారు 2 కిలోల వెండి పట్టీలు రికవరీ**

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమినగర్‌లో బాలాజీ జ్యువెలర్స్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌సీ పురం ఏసీపీ సీహెచ్.వై. శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 1న తెల్లవారుజామున దుండగులు షాపు తాళాలు పగులగొట్టి, వెనుక గోడకు ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి రంధ్రం ద్వారా లోపలికి ప్రవేశించారు. అనంతరం స్టోరేజ్ రూమ్ తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. కేసు దర్యాప్తులో భాగంగా 500కుపైగా సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన ఛోటూ అలియాస్ యోగేష్ మండేలియా (31), గోలు అలియాస్ రాజేష్ మండేలియా (35), భింద్ జిల్లా కథ గ్రామానికి చెందిన అఖిల్ శర్మ (30), డ్రైవర్ శ్యామ్‌సుందర్ కుష్వా (30) ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మరో కేసులో గ్వాలియర్ పోలీసులు వీరిని అరెస్టు చేయడంతో




పీటీ వారెంట్ల ద్వారా చందానగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. విచారణలో చోరీ సొత్తును భింద్ జిల్లా కథ గ్రామంలోని ఇంట్లో దాచినట్లు వెల్లడించగా, అక్కడ సోదాలు నిర్వహించి 59.220 గ్రాముల కరిగించిన బంగారు బార్, సుమారు 2 కిలోల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. మరో అర కిలో వెండి ఆభరణాలను స్థానికంగా విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసు ఛేదనలో చందానగర్, ఆర్‌సీ పురం ఇన్‌స్పెక్టర్లు, డిటెక్టివ్ క్రైమ్ సిబ్బంది, సీసీఎస్ బృందాలు పాల్గొన్నాయి.

# బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

- **కబ్జా భూములను స్వాధీనం చేసి పేదలకు పంచుతాం**
- **ఫాంహౌస్ భూములపై 33 నెలలకు తేల్చారా?**
- **విచారణ పేరుతో కాంగ్రెస్-బీఆర్ఎస్ చీకటి ఒప్పందం**
- **యూపీ ఎన్నికల కోసమే భూముల అంశాన్ని తెరపైకి తెచ్చారు**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** కరీంనగర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో దండయాత్ర చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచి పెడతామని చెప్పారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ భూదోపిడీని సీఎం ప్రస్తావించడం వెనుక పెద్ద మతలబు ఉందని, యూపీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే బీఆర్ఎస్‌తో బేరసారాలకు సిద్ధమయ్యారని ఆరోపించారు. బుధవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో పర్యటించి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు రూ.1.5 కోట్లు కేటాయించామని, గతేడాదితో పోలిస్తే మూడింతలు ఎక్కువ నిధులు కేటాయించామన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, మిరుమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేస్తామని, మూడు రోజుల ముందే నీళ్లు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సెంటిమెంట్‌తో ఆటలాడితే సహించం అని హెచ్చరించారు.

అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌కు సంబంధించి ఎనిమిది మంది ఎమ్మెల్యేల భూభాగోతం గురించి మాట్లాడటానికి గంట సమయం పట్టిందని, 90 మంది ఎమ్మెల్యేల విషయంలో ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలని ప్రశ్నించారు. తెలంగాణలో 60 శాతం మందికి భూముల్లేవని, 25 లక్షల కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడానికి గజం స్థలం లేదని, అయినా బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాలు దోచుకున్నారని తెలిపారు. పాదయాత్రలో బీఆర్ఎస్ భూదోపిడీ గురించి మాట్లాడితే కేసీఆర్ 'నా తలను ఆరు ముక్కలు చేస్తాను' అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని తెలియడానికి 33 నెలలు పట్టిందా అని ప్రశ్నించారు. రూ.లక్షల కోట్ల విలువైన ఆ భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదన్నారు.

భూముల విచారణ పేరుతో బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం ఖాయమని, యూపీ ఎన్నికలకు అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సర్దడం తథ్యమని ఆరోపించారు. జిల్లా కలెక్టర్లకు పూర్తి అధికారాలిస్తే 24 గంటల్లో నివేదిక వస్తుందని, 30 రోజుల గడువు పేరుతో డీల్ కుదుర్చుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్లు, ఈ-ఫార్ములా రేస్, కాళేశ్వరం, గొర్రెల స్కాంలు ఏమయ్యాయని, ఫారెస్ట్ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలేవని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్‌లకు కేటాయించిన భూములను కూడా బీఆర్ఎస్ కబ్జా చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ దండయాత్ర చేసి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- **పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
- **నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి**

**బోధన్, సెప్టెంబర్ 16 ( జనంసాక్షి ) :** అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించి పోతంగల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అకడమిక్, అడ్మిన్ బ్లాక్ లు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్, ఇండోర్ గేమ్స్, క్రికెట్ గ్రౌండ్, ప్లే గ్రౌండ్, టీచర్స్ క్వార్టర్స్, సెక్యూరిటీ బ్లాక్, పార్కింగ్ తదితర నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల వివరాలు ఆరా తీశారు. మైల్ స్టోన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. నిర్దేశిత సమయం లోపు పనులన్నీ పూర్తయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని టీజీఈడబ్ల్యుఐడీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తోందని అన్నారు. వీటి ప్రాధాన్యతను గుర్తెరిగి, పనుల నాణ్యతలో ఎక్కడ కూడా రాజీ పడకుండా పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించాలని అన్నారు. ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో సుమారు 2500 మంది పైచిలుకు విద్యార్థులు, 300 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బంది ఉంటారని, వీరి అవసరాలకు సరిపడా మంచినీరు, డ్రైనేజీ వంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. భవిష్యత్తులో



ఎలాంటి ఇబ్బందులు, నాణ్యతా లోపాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కొడిచెర్ల ఇసుక క్వారీని సందర్శించారు. క్వారీలో అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం నిబంధనలను అనుసరిస్తూ ఈ క్వారీ ద్వారా ఇసుకను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా గట్టి నిఘా ఉంచాలని, సీ.సీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: తలసాని

**అమీర్‌పేట, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేట డివిజన్ డీకే రోడ్డులోని అశ్రయ్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు తలసాని తెలిపారు. అనేక దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, సనత్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రెసిడెన్షియల్ ప్రాంతాల్లో కమర్షియల్ కార్యకలాపాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయగా, దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్, జీహెచ్ఎంసీ ఏఈ జమీర్, వాటర్ వర్క్స్ ఏఈ మౌనిక, ఎలక్ట్రికల్ ఏఈ మౌనిక, శానిటేషన్ డీఈ వెంకటేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ దవాఖానలో ఘనంగా వినాయక చవితి పూజలు

- గత 34 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన నిమ్స్ డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) దవాఖానలో వినాయక చవితి పూజలు ఘనంగా నిర్వహించారు.గత 34 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న గణనాథునికి బుధవారం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించా రు.ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ పరంజ్యోతి, ఉత్సవ కమిటీ సభ్యులు పి.రాజ్ కుమార్, ఎం. రాజ్ కుమార్, శ్యామ్ కుమార్, సత్య గౌడ్, శ్రీనివాస రావు, వెంకటేష్, రాజు, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొని గణేశుడి ఆశీస్సులు పొందారు.

## లోధా సామాజిక వర్గంపై బీసీ కమిషన్ క్షేత్రస్థాయి విచారణ





- సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆరా
- ధ్రువీకరణ పత్రాల జారీపై ఫిర్యాదుల పరిశీలన
- కుటుంబాలు, వృత్తులు, విద్యపై వివరాల సేకరణ
- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తాం

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** లోధా సామాజిక వర్గ ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి, జీవన పరిస్థితులను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ బుధవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది. సిర్గాపూర్ మండలం కడప్పల్, నిజాంపేట్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో లోధా సామాజిక వర్గ ప్రజలతో కమిషన్ ప్రతినిధులు సమావేశమై వివరాలు సేకరించారు. కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డా. బాలలక్ష్మి తదితరులు ప్రజలతో మాట్లాడారు. లోధా సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కొన్నేళ్లుగా అందుతున్న వినతుల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు అందడం లేదన్న ఫిర్యాదులను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. కుటుంబ పరిస్థితులు, సంప్రదాయాలు, వృత్తులు, జీవన విధానం, పిల్లల విద్య తదితర అంశాలను నమోదు చేసి, విచారణ అనంతరం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. విద్యతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అర్హులు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్, డీఎస్పీ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, లోధా సామాజిక వర్గ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో రైతుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే

**ఫామ్ ఆయిల్‌కు కనీస మద్దతు ధర ఇవ్వాలి**
**ఉల్లి రైతులకు ప్రత్యేక సబ్సిడీ అందించాలి**
**రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి**

**తాండూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** శాసనసభలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రైతుల సమస్యలను ప్రస్తావించారు. ఫామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని, పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఫామ్ ఆయిల్ తోటల మీదుగా వెళ్లే 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లను మార్చాల్సి వచ్చినప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, లైన్ షిఫ్టింగ్ ప్రక్రియను సరళీకరించాలని సంబంధిత మంత్రిని కోరారు. తాండూరు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉల్లి సాగు చేస్తున్న రైతులు ఉన్నందున వారికి ప్రత్యేక సబ్సిడీ అందించి ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్‌నగర్ తండా భూ సమస్యలపై ఎస్టీ కమిషన్ పరిశీలన

- 50 ఏళ్లుగా నివాసం.. హక్కులపై వివాదం.. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించిన సభ్యులు
- సింగరేణి సీఎండీకి లేఖ రాస్తాం : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్



**గోదావరిఖని, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** రామగుండం మండలం 8 ఇంక్లైన్ కాలనీలోని రాజీవ్‌నగర్ లంబాడి తండా భూ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వాగతం పలికారు. ఉన్నతాధికారులతో కలిసి తండాలో పర్యటించిన కమిషన్ సభ్యులు స్థానికులతో మాట్లాడి భూముల వివాదం, రికార్డులు, హక్కులకు సంబంధించిన వివరాలను సేకరించారు. సింగరేణి 8 ఇంక్లైన్ కాలనీ పరిధిలోని కొన్ని కేసులపై కమిషన్‌కు ఫిర్యాదులు అందడంతో ఇప్పటికే సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు హుస్సేన్ నాయక్ తెలిపారు. తండాలో గిరిజనులు సుమారు 50 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, అవసరం లేకుండా వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని సింగరేణి అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారానికి సింగరేణి సీఎండీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు. 12 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి హక్కుల కల్పనకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను పరిశీలిస్తామని, భూ రికార్డులు, హక్కులు, ఇతర అంశాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పర్యటనలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, రెవెన్యూ, సింగరేణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన పోలీసులకు నగదు ప్రోత్సాహకాలు

- సీసీఆర్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ప్రోత్సాహకాలు
- సైబర్ నేరాల నియంత్రణలో కృషికి అభినందన
- సమన్వయంతో నేరాల నియంత్రణకు కృషి
- అంకితభావంతో విధులు నిర్వహించాలి: సీపీ




**గోదావరిఖని, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** విధుల్లో ప్రతిభ కనబరిచిన సీసీఆర్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ విభాగాల అధికారులు, సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, సైబర్ నేరాల అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారు చేసిన కృషిని అభినందించారు. పోలీసు విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తే నేరాల నియంత్రణతో పాటు దర్యాప్తులో వేగం, నాణ్యత పెరుగుతాయని సీపీ తెలిపారు. సైబర్ నేర బాధితులకు సత్వర సహాయం, సమాచార విశ్లేషణ, నేరస్తుల గుర్తింపులో సిబ్బంది కృషిని ప్రశంసించారు. నేరస్తుల కదలికలపై నిఘా, కేసుల దర్యాప్తునకు అవసరమైన సమాచార సేకరణలో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ విభాగాల పనితీరును అభినందించారు. ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచే సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా ఇతరుల్లోనూ బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను తిప్పికొడతాం

**ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత**



**మల్కాజిగిరి సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత విమర్శించారు. బుధవారం ఆనంద్‌బాగ్‌లోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే విపక్షాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకే పార్టీ సమన్వయకర్తగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు హంగామా చేస్తూ రాజకీయ డ్రామాలకు తెరలేపారని ఆరోపించారు.22ఏ భూముల సమస్యపై సామాన్య ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరికీ నష్టం కలగకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే 62.5 శాతం పూర్తయిందని, మిగిలిన 20 రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, ప్రవీణ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంద భాస్కర్ మాదిగ, పిట్ల నాగరాజు, అరుణ్, లక్ష్మి, ఆశ, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే మర్రి



**అల్వాల్, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.12.19 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. బాధితులు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## లింగమయ్య చెరువులో అనుమతి లేకుండా చేపల వేట

**ఇందోల్ గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు**







**కోట్‌పల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మండలంలోని ఇందోల్ గ్రామ పరిధి లింగమయ్య చెరువులో అనుమతులు లేకుండా చేపలు పట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కడిచర్ల చంద్రకళ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం నిర్ణయం మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న రాత్రి 10.30 గంటల సమయంలో కొందరు వ్యక్తులు చెరువులో చేపలు పడుతుండగా గ్రామస్థులు గుర్తించి ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. వారిలో ఒకరు రాజుగా, తాండూర్ వాసిగా పరిచయం చేసుకున్నారని, అయితే చేపలు పట్టేందుకు ప్రభుత్వ లేదా గ్రామ పంచాయతీ అనుమతులు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చేపల తరలింపు కోసం తీసుకొచ్చిన బొల్లోరు వాహనం (ఏపీ 36 టీబీ 2789)ను చెరువు వద్ద ఉంచి, అనంతరం తమకు సమాచారం లేకుండా తీసుకెళ్లారని గ్రామస్థులు ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అనుమతులు లేకుండా చేపలు పట్టినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## పట్టపగలే ఇంట్లోకి దొంగలు

**అయ్యప్పనగర్‌లో భారీ చోరీ.. 10 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ**



**యాలాల (జనంసాక్షి) :** మండలం కోకట్ మార్గంలోని అయ్యప్పనగర్‌లో బుధవారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. చోరీకి గురైన నగదులో కుమార్తె కళాశాల ఫీజు కోసం దాచిన డబ్బు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రవీణ్‌కుమార్, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. తాండూరు పరిసరాల్లో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో కాలనీలు, ప్రధాన రహదారులు, శివారు ప్రాంతాల్లో నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

## అమరవీరుల త్యాగాలను గుర్తించాలి

**సీపీఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా**



**రంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన చారిత్రాత్మక పోరాటమే సాయుధ పోరాటమని కొనియాడారు. రైతులు, కూలీలు, పేద ప్రజలు తమ హక్కుల కోసం ఎర్రజెండా నాయకత్వంలో సాగించిన ఈ పోరాటం తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. వేలాది మంది యోధులు భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ప్రభుత్వమే అధికారికంగా ఈ వారోత్సవాలను నిర్వహించి పోరాట యోధులను స్మరించుకోవాలన్నారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితోనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి శివరాల సూర్యం, జిల్లా నాయకులు పోచమోని నీలమ్మ, శివరాల యాదగిరి, శివరాల లక్ష్మయ్య, ములుగు నర్సింహా, జంగిలి నర్సింహా, సీతయ్య, కట్టెల మారయ్య, బండ నర్సింహా, అశోక్, లక్ష్మయ్య, యాదగిరి పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 16 (జనం సాక్షి);** వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్,బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి.గితే పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి,వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం,స్టేజ్,విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని,వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని,పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## కుంటుపడిపోతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మెడిపల్లి, తోల కట్ట ఆయా పార్టీల వార్డు సభ్యులు, నాయకులు బీఆర్ఎస్లో చేరిక



**మొయినాబాద్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలు, హామీలు ప్రజలకు సక్రమంగా అందడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డిలు అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని మెడిపల్లి బీజేపీ కొందరు వార్డు సభ్యులు, నాయకులు తోల్ కట్ట కొందరు వార్డు సభ్యులు, నాయకులు, యువకులు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్లో చేరారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నివాసంలో మేడిపల్లి, తోల కట్ట గ్రామాలకు చెందిన పలువురు వార్డు సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పార్టీలో చేరిన అనంతరం సబితారెడ్డి, అనంతరెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని గుర్తు చేశారు. వెయ్యి రోజుల పాలన ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవి నెరవేరలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని అందినంత దోచుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి, నాయకులు రవియాదవ్, శ్రీహరియాదవ్, జేవంతు, చిన్న, నర్సింహ్మారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్ట్‌టైమ్ టీచర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- 18లోగా దరఖాస్తులు.. 19న డెమో, ఇంటర్వ్యూలు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న వారు 19వ తేదీ ఉదయం 10 గంటలకు విద్యార్హతలకు సంబంధించిన అసలు ధ్రువపత్రాలు, రెండు తాజా పాస్‌పోర్టు సైజు ఫొటోలతో డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయ అధికారి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, చిట్కుల్‌ను 9704550253, 9640382248 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# చేయూత పెన్షన్ నూతన దరఖాస్తులకు ముగిసిన గడువు

- మొత్తం 5,98,193 దరఖాస్తులు
- వీలైనంత త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు
- క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసిన అధికారులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చేయూత పెన్షన్ నూతన దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,98,193 దరఖాస్తులు అందాయి. వీటిలో 3,31,236 వితంతు పెన్షన్లకు, 62,689 ఒంటరి మహిళల పెన్షన్లకు, 1,48,882 దివ్యాంగుల పెన్షన్లకు, 18,005 చేనేత కార్మికుల పెన్షన్లకు, 37,381 గీత కార్మికుల పెన్షన్లకు దరఖాస్తులు వచ్చాయి. అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు ఇప్పటికే వేగవంతం చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్ణీత ప్రక్రియ ప్రకారం పరిశీలన పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా పారదర్శకంగా, వేగంగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# హైదరాబాద్ విమోచన యోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. 1948 సెప్టెంబరు 17వ తేదీ హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భమని గవర్నర్ పేర్కొన్నారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో ప్రస్తుత తెలంగాణతో పాటు మరాఠ్వాడా, హైదరాబాద్-కర్ణాటక ప్రాంతాలు ఉండేవని గుర్తుచేశారు. విమోచన ఉద్యమంలో ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలను కృతజ్ఞతతో స్మరించుకోవాలని, విమోచన యోధులకు నివాళులర్పించాలని ఆయన అన్నారు. ఈ చారిత్రక ఘట్టం, నాటి ప్రజల త్యాగాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. "విమోచన యోధుల ధైర్యం, త్యాగం మనకు స్ఫూర్తిదాయకం. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యత, సమగ్రత విలువలను పరిరక్షిస్తూ ముందుకు సాగాలి" అని గవర్నర్ అన్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఐక్యతా భావంతో నిర్వహించి, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు శాంతి, ప్రగతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

### ప్రధాని మోదీకి తెలంగాణ గవర్నర్ జన్మదిన శుభాకాంక్షలు

ఈ నెల 17 వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల తరఫున, తన తరఫున ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, బలం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ సమర్థవంతమైన, దార్శనిక నాయకత్వంలో భారత్ అభివృద్ధి, ప్రగతి, సుసంపన్నత వైపు మరింత వేగంగా ముందుకు సాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. దేశ సేవలో ప్రధాని మరిన్ని సంవత్సరాలు అంకితభావంతో కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు.

# భార్య ముక్కు కొరికేసిన భర్త

- మంచిర్యాలలో దారుణ ఘటన




**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం!
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా వైపుకు అల్పపీడనం

**అమరావతి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తు న్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

# ఆకలిని తరిమికొట్టి అక్షరానికి అండ

- కరీంనగర్ లో రూ.8 కోట్ల భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్
- 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన ఆహారం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా, వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన సిప్ ఎదర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఐ ఎస్ ఓ స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

### కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు, ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కోడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు. 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, డిఇఓ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పట్టణీకరణతో నగరాలకు వరద ముప్పు

- అందుకే చెరువుల అభివృద్ధికి హైడ్రా ప్రాధాన్యం
- వైపరీత్యాల వేళ ఆపద మిత్రులు అండగా ఉండాలి
- యువ ఆపద మిత్రుల శిక్షణలో హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం





**హైదరాబాద్, సెప్టెంబరు 16 (జనంసాక్షి) :** పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. సహజ నీటి వనరులు, చెరువులు కబ్జాలకు గురౌతున్నాయి. భారీ వర్షాలు పడితే వరదలు ముంచెత్తే పరిస్థితులు నగరాల్లో నెలకొన్నాయి. ఇలాంటి తరుణంలో ప్రాణ, ఆస్తి నష్ట నివారణలో ప్రభుత్వ విభాగాలతో పాటు యువ ఆపదమిత్రులు కూడా సిద్ధంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. నాగోలులోని హైడ్రా శిక్షణ కేంద్రంలో యువ ఆపదమిత్ర 5వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించి.. వారికి దిశానిర్దేశం చేశారు. నగరంలో 69 శాతం చెరువులు కబ్జాకు గురయ్యాయని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాల ద్వారా తేల్చి చెప్పింది. చెరువులను కాపాడుకుంటే చాలా వరకు వరదలు కట్టడి చేయవచ్చు. అందుకే చెరువుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చిందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను ఇప్పటి వరకూ చూశాం.. హైడ్రా ఇందుకు భిన్నమని కమిషనర్ చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షించి ప్రకృతి వైపరీత్యాలకు ఆస్కారం లేకుండా చూడాలనేదే హైడ్రా సంకల్పమన్నారు. భారీ వర్షాల వేళ వరద నీరు నాలాల ద్వారా చెరువులకు చేరేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. నాలాలు, చెరువుల అభివృద్ధితో వరదలు కట్టడి చేయవచ్చునని ఇప్పటికే పలు ప్రాంతాల్లో రుజువైందన్నారు.

### అక్రమ కట్టడాలతోనూ వైపరీత్యాలు..

నగరంలో అక్రమ కట్టడాలు భూకంపాలతో సమానమైన ప్రమాదాన్ని సూచిస్తున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. కేవలం 50 గజాలలో ఏడెనిమిది అంతస్తులు భవనాలు నిర్మించడంతో పరిసర ప్రాంత నివాసితులకు అవి ముప్పుగా పరిణమిస్తున్నాయని అన్నారు. ఇటీవల గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో 7 అంతస్తుల భవనం కూలిపోవడంతో పాటు.. 2024లో సిద్ధిఖ్ నగర్‌లో పక్కకు వంగిన భవనం, దేశరాజధానిలో కుప్పకూలిన ఘటనలను ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ప్రస్తావించారు. ఇవన్నీ మానవ తప్పిదాలతో ఏర్పడిన వైపరీత్యాలుగా హైడ్రా కమిషనర్ పరిగణించారు. చదువులు కొనసాగిస్తూనే.. సమాజ సేవ చేయాలనే ఆలోచనతో వచ్చిన మీరంతా అభినందీయులన్నారు. 5వ బ్యాచ్లో శిక్షణ పొందుతున్న 117 మంది వాలంటీర్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల విద్యార్థులు కనుక హైడ్రాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానికంగా ఉంటారు..విషయం తెలిసిన వెంటనే రంగంలోకి దిగడంతో పాటు.. ప్రభుత్వ విభాగాలకు సమాచారమిచ్చి నష్ట నివారణలో ముందుండాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, అడిషనల్ కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్‌కుమార్ యువ ఆపదమిత్రులనుద్దేశించి పలు సూచనలు చేశారు. హైడ్రా ఏడీఎఫ్‌వో మోహన రావు.. వారం రోజుల శిక్షణ సాగే తీరును వివరించారు. హైడ్రా ఆర్ ఎఫ్‌వో జయప్రకాష్, డీఎఫ్‌వోలు శ్రీధర్ రెడ్డి, గౌతమ్, మై భారత్ హైదరాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ శషాంక్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారిణి గ్రీష్మ చంద్రిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారీ వ్యక్తి అరెస్ట్

- సెల్‌ఫోన్ స్వాధీనం..
- వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేసినట్లు పోలీసుల వెల్లడి

**నల్లబెల్లి, సెప్టెంబరు 16(జనంసాక్షి):** నకిలీ అక్రిడిటేషన్ కార్డు తయారు చేసి, దానిని అసలైనదిగా నమ్మించే ప్రయత్నం చేసిన వ్యక్తిని నల్లబెల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్లబెల్లి మండలం బిల్నాయక్‌తండాకు చెందిన మూడు రవీందర్ తాను 'ఎంఈఈ24 న్యూస్' రిపోర్టర్‌గా చెప్పుకుంటూ చలామణి అవుతున్నాడు. ఇతర మీడియా సంస్థకు చెందిన అక్రిడిటేషన్ కార్డు ఫోటోను ఆధారంగా చేసుకుని, అందులోని పేరు, సంస్థ పేరు, కార్డు నంబరు, ఫొటో, సంతకం తదితర వివరాలను మార్చినట్లు విచారణలో వెల్లడైందని ఎస్సై తెలిపారు.. చాట్‌జీపీటీ సహాయంతో 'మూడు రవీందర్, రిపోర్టర్, ఎంఈఈ24 న్యూస్, కార్డు నంబరు డబ్ల్యూజీఎల్ఎం173, చెల్లుబాటు తేదీ 30.04.2028' తదితర వివరాలతో నకిలీ అక్రిడిటేషన్ కార్డును తయారు చేసినట్లు పోలీసులు తెలిపారు. తయారు చేసిన నకిలీ కార్డును వాట్సాప్ ద్వారా పలువురికి పంపడంతో పాటు, 'పోలీస్ అండ్ ప్రెస్ మీడియా నల్లబెల్లి' వాట్సాప్ గ్రూపులోనూ ప్రచారం చేయించినట్లు పేర్కొన్నారు. నకిలీ కార్డు తయారీకి ఉపయోగించిన శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. నిందితుడు మూడు రవీందర్ ను అరె స్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

# మూతపడిన మిల్లులు..

## మూగబోయిన యంత్రాలు..

- రోడ్డెక్కిన హమాలీలు
- సీఎంఆర్ ఒప్పందం సవరించే వరకు మిల్లులు తెరవం..
- "తెలంగాణ రైస్ మిల్లర్ల ఉద్యమం"కు నామకరణం చేసిన సయ్యద్ రఫీ..
- పోరాటంలో భాగస్వామ్యం




**వనపర్తి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** వనపర్తి జిల్లాలో రైస్ మిల్లుల సమస్యలపై మిల్లర్లు చేపట్టిన ఉద్యమానికి హమాలీలు సంఘీభావం ప్రకటించారు. మూతపడిన మిల్లులు, నిలిచిపోయిన యంత్రాలతో ఉపాధి కోల్పోతున్న హమాలీల సమస్యను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. మిల్లర్ల సమస్యలకు తోడు రైతులు, కార్మికుల జీవనోపాధిపై ప్రభావం పడుతున్న పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యమకారులు కోరుతు న్నారు. ఈ కార్యక్రమానికి "తెలంగాణ రైస్ మిల్లర్ల ఉద్యమం" అని నామకరణం చేసిన సయ్యద్ రఫీ, మిల్లర్ల పోరాటంలో భాగంగా నిలిచారు. సీఎంఆర్ ఒప్పందం ఏకపక్షంగా ఉండటంతో మిల్లర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించని వారితో పాటు, పరిస్థితుల కారణంగా బకాయిలు చెల్లించలేని మిల్లర్లను కూడా ఒకే విధంగా చూడకూడదని కోరారు. సీఎంఆర్ ఒప్పందాన్ని సవరించి, మిల్లర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు మిల్లులను తిరిగి ప్రారంభించేది లేదని ఉద్యమకారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడంతో పాటు సీఎంఆర్ విధానంలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. "మిల్లర్ల భద్రత-రైతులకు భరోసా-కార్మికుల జీవనోపాధి" అనే నినాదంతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370